


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

మంగళవారం | 14 జనవరి 2025 | హైదరాబాద్

సంపుటి 18 | సంచిక 84

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




- APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
- నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
- కరెంట్ అఫైర్స్
- నమూనా ప్రశ్నాపత్రాలు
- విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, పుష్యమి మాసం పుష్య ఐ.పాడ్యమి తె.3.41 వరకు, పునర్వసు ఉ.10.50, వర్జ్యం రా.6.57 నుంచి 8.34 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.48 నుంచి 8.31 వరకు తిరిగి రా.10.48 నుంచి 11.40 వరకు

### పలు అభివృద్ధి కార్యక్రమాలకు
## శంకుస్థాపనలు



- లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ
- పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన
- నారావారి పల్లెలో ముఖ్యమంత్రి పలు కార్యక్రమాలకు శ్రీకారం

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నారావారిపల్లిలో పలు అభివృఎద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, లబ్ధిదారులకు పలు సంక్షేమ కార్యక్రమాల కు చెందిన ఆస్తులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. సీఎం వెంట రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు, చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఉన్నారు.

### హిమమెంత కురిసిన
# ప్రయాణం సులభం

- ప్రాణాలను పణంగా పెట్టారు
- జడ్-మోడ్ టన్నెల్ ప్రారంభోత్సవంలో కార్మికులకు ప్రధాని నివాళులు
- దాదాపు 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన జడ్-మోడ్ టన్నెల్
- సోన్మార్గ్ టన్నెల్ పొడవు ఆరున్నర కిలోమీటర్లు
- హిమపాతం ఉన్నప్పటికీ రవాణాకు ఆటంకం లేకుండా టన్నెల్ ద్వారా ప్రయాణం
- అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం







6 లో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సోన్మార్గ్ టన్నెల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.. దాదాపు 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన జడ్-మోడ్‌టన్నెల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం దేశ ప్రజలకు అంకితం చేశారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు సూర్య సంక్రాంతి శుభాకాంక్షలు, సంక్రాంతి పర్వదినం సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున బుధవారం (15-01-2025) నాటి సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం (16-01-2025)

-సూర్య యాజమాన్యం

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు



5 లో

- వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్
- 1,048 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 345 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఉచితాలదే జోరు



6 లో

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రజలను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు, వాటి పరిష్కారాల కోసం పెద్దగా చర్చలు జరగకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పథకాలతో పార్టీల మధ్య తీవ్రపోటీ
- ఆర్థిక సాయం, ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాలపై అందరి దృష్టి
- ప్రజా సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చ కనిపించట్లే
- పథకాలు ప్రకటించడంలో ఆప్ దూకుడు
- రంగంలో కాంగ్రెస్ కూడా ఆదే దారిలో పయనం

## నిఘా నేత్రంలో కుంభమేళా



6 లో

- భారీగా భద్రతా ఏర్పాట్లు
- అండర్ వాటర్ డ్రోన్లు, ఏఐ కెమెరాల వినియోగం

ప్రపంచంలోనే అతిపెద్ద జనసమూహంగా రికార్డులు సృఎష్టించే మహా కుంభమేళకు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తోంది.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### సంక్షేమ పథకాల అర్హత
## పేదోడు అయితే చాలు

- ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే
- రాబోయే నాలుగు ఏళ్లల్లో 20 లక్షల ఇళ్లు లక్ష్యం
- ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ
- కూసుమంచిలో నమూనా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సంక్షేమం ఇస్తే వచ్చేసారి మా పార్టీకి ఓటు వేయాలనే నిబంధన పెట్టం...కేవలం పేదోడు అయితే చాలు ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హుడేనని తెలంగాణ రెవెన్యూ, గృఎహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



7 లో

### మంత్రి నారా లోకేష్
## ప్రజాదర్బార్



2 లో

- నారావారిపల్లెలో నిర్వహించిన దర్బార్
- 54వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రిని కలిసి సమస్యలు విన్నవించిన ప్రజలు
- పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ

### తెలంగాణ వైపు
## ప్రపంచం చూస్తోంది


- మొదటి ఏడాది పెట్టుబడులతో సత్ఫలితాలు
- పెట్టుబడులకు సానుకూలంగా 18 ప్రాజెక్టులు
- పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్
- అన్ని దేశాలు పెట్టుబడి పెట్టే అవకాశాలు
- 20 నుండి సీఎం రేవంత్ దావోస్ పర్యటన
- అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చర్చలు

పెట్టుబడులకు గమ్య స్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృఎష్టిని ఆకర్షిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూ లమైన వాతావరణముందని అభిప్రాయపడ్డారు.



2 లో

## అంతా ఇంతే!




ఈసారి కోడికత్తి డ్రామాలు కుదరవన్నమాట సార్

### త్వరలో సీఎం రేవంత్
## ఆకస్మిక పర్యటనలు



3 లో

- అక్రమాలు జరుగకుండా చూడాలి
- అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు ఇస్తాం
- అధికారులు విధుల పట్ల అలసత్వం వహించొద్దు
- మంత్రి కోమటిరెడ్డి

ఖమ్మం జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కొంచెం ఇంపార్టెంట్ మీటింగ్ కారణంగా ఆలస్యంగా వచ్చానన్నారు.

### ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు
## బీసీల పాలిట శాపం

- సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఈడబ్ల్యూఎస్ పరిధి దాటకుండా ఉన్నాయి
- అయినా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం
- తెలంగాణలో గత ప్రభుత్వ తీరుతో మరి నష్టం
- జనాభా 10% లేకున్నా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు
- ఐదు శాతం జనాభా ఉంటే 10% ఎలా అమలు చేస్తారు?
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం
- అందుకే బీసీ ఇంటలెక్చువల్ ఫోరం పోరాటం
- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు



7 లో

తెలంగాణ రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీలకు పాలిట శాపంగా తయారైందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు ఆర్టికల్ 15(4), 16(4) ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాలకు మిగతా వర్గాలలో పాటు సమానంగా ఎదగడానికి రాజ్యాంగం సామాజిక న్యాయం సమానత్వ సాధనలో కీలక సాధనములు అని అన్నారు.

### రూ.35 కోట్లతో అన్నదాన
## సత్రం నిర్మాణం



3 లో

- దక్షిణ కాశీ వేములవాడ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వేములవాడలో రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేపడుతాం
- శ్రీశైలంలో ఉన్నట్లే మ్యూజికల్ ఫౌంటెన్‌ను వేములవాడలో ఏర్పాటు చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్

### వచ్చే విద్యాసంవత్సరం నుంచి
## తల్లి దీవెన



2 లో

- 24 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బు అంద చేసిన కూటమి ప్రభుత్వం
- భయానక పరిస్థితి నుంచి సంతోషకర పరిస్థితి
- గుంతల రోడ్ల మరమ్మతులు నెలాఖరుకు పూర్తి
- జగన్‌కు మతి చెలించింది : మంత్రి సారథి



# సీఎం నాయకత్వంలో అభివృద్ధి పరంగా రాష్ట్రంలో ప్రతిరోజు పండగే

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలు నిరాశ, నిస్పృహలతో ఏ పండుగ సంతోషంగా జరుపుకోలేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంక్రాంతి పండుగను చాలా ఆనందంగా జరుపుకుంటున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి పరంగా రాష్ట్రంలో ప్రతి రోజు పండుగ వాతావరణం నెలకొని వుంటుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఎంపి కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భోగి వేడుకల్లో ఎంపి కేశినేని శివనాథ్ , సతీమణి కేశినేని జానకి లక్ష్మితో కలిసి పాల్గొని భోగి మంటలు వెలిగించారు. అనంతరం ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి వేడుకల్లో భాగంగా ఎంపి కేశినేని శివనాథ్ చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లేని విధంగా సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో కలిసి చేసుకోవటానికి వివిధ రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో రాష్ట్రానికి తరలిరావటం సంతోషంగా వుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం పెంచిన పెన్షన్ అందించటంతో పాటు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయటంతోపాటు, అన్న క్యాంటీన్లు ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో లేని విధంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి తారీఖు జీతం అందిస్తున్న విషయం పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ ముందు ఉద్యోగులకు పాత బకాయిలు సైతం చెల్లించటం జరిగిందన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణంలో మరింత పురోగతి సాధిస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధి లో ప్రజలందరూ పాలుపంచుకోవాలని ఎంపి కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**• లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ • పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన**


**• నారా వారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాలకు శ్రీకారం**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నారావారిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, లబ్ధిదారులకు పలు సంక్షేమ కార్యక్రమాల కు చెందిన ఆస్తులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. సీఎం వెంట రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు, చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా నారావారి పల్లి లోని ఇద్దరు రైతులకు డ్రిప్ పరికరాలను బలరాం నాయుడు,జ్యోతి లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందచేశారు. ఏపీఎంఐపి ప్రాజెక్టు కింద అర్హులైన అందరిని కవర్ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా ఏపీఎంఐపి అధికారి సతీష్ ఉన్నారు. నారావారి పల్లె నందు సుమారు రూ. 4.27 కోట్లతో నిర్మించనున్న 33/కెవి సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ కు శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంఖు స్థాపన చేశారు. ఇక్కడ సిఎండి ఏపీఎస్పీడీసీఎల్ సంతోష్ రావు ఉన్నారు. ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటుతో కవర్ చేయాలని తెలుపుతూ, అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నారావారి పల్లి గ్రామ పరిధిలోని మూడు సచివాలయల పరిధిలో 26 అభివృద్ధి పనులు రూ. 3.21 కోట్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరించి శంఖు స్థాపన చేశారు.. ఇక్కడ పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్ ఉన్నారు. -నారావారి పల్లె గ్రామ అభివృద్ధిలో భాగంగా ఎ.రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా శ్రీసిటీ సౌజన్యంతో రూ.1.10 కోట్లతో అభివృద్ధి చేయుటకు పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఐ ఎఫ్ పి ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఎఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామాగ్రి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. నారావారి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 8 అంగన్వాడి కేంద్రాలలోని అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాన్ని కేర్ అండ్ గ్రో సామాజిక చైతన్య ప్రతినిధుల ద్వారా తిరుపతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అమలు కొరకు ముఖ్యమంత్రి సమక్షంలో ఎంఓయు ల మార్పిడి చేసుకున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మరియు కేర్ అండ్ గ్రో. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు మంచి భవిష్యత్తును అందించడానికి ఒక ప్రాజెక్టుకు ఏంఓయు ను సంతకం చేశారనీ తెలుపుతూ సదరు కేర్ అండ్ గ్రో ద్వారా కుప్పం నందు 480 సెంటర్లలో అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లల మానసిక, శారీరక, విద్యా పరమైన అంశాలలో మెరుగ్గా ఫలితాలు వచ్చేలా చేపట్టిన చర్యలు,తల్లులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించే ఈ కార్యక్రమం కుప్పంలో మంచి ఫలితాలు ఇస్తోందని, ఇక్కడ కూడా మంచి ఫలితాలు రావాలని అన్నారు. ఇక్కడ జిల్లా మహిళ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, కేర్ అండ్ గ్రో ఫౌండర్ డా. మేఘన ఉన్నారు. గ్రామీణ మహిళలు ఇంటి వద్ద నుండే కిరాణా షాపులకు వస్తువులను సరఫరా చేసి తద్వారా వారి ఆర్థిక స్థితి గతులు మార్చుకునే విధంగా సౌలభ్యం కల్పించడానికి ఈజిమార్ట్ ( ), డిఆర్డిఎ - వెలుగు సంస్థ మధ్య ఒప్పంద సంతకం చేసి ఎంఓయు లు మార్పిడి చేసుకోవడం జరిగింది... ఇందులో డిఆర్డిఏ వెలుగు పీడీ శోభన్ బాబు ఈజీమార్ట్ ఫౌండర్ అండ్ సీఈఓ వెంకట్ నల్లపాటి ఉన్నారు. -నారా వారి పల్లి సమీపంలోని 5 గ్రామాల 200 మంది మామిడి రైతులతో ఎఫ్ పి ఓ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి అందజేయడం జరిగింది. ప్రభుత్వ స్కీంల వినియోగంతో ఇన్ఫ్రాస్ట్రక్చర్, మార్కెటింగ్ అనుసంధానంతో బిగ్ బాస్కెట్, రిలయన్స్, ప్రాసెసింగ్ యూనిట్లకు నేరుగా మార్కెటింగ్ చేసుకోవడం వలన మధ్యవర్తులు లేకుండా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ప్రైమరీ ప్యాకింగ్ అండ్ గ్రేడింగ్ చేసుకుని నేరుగా వారు అమ్ముకునేందుకు ఈ ఎఫ్పీఓ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం తెలిపారు.. ఇక్కడ ఎస్ పి ఓ లు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి ఉన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు డి ఆర్ డి ఏ - వెలుగు మరియు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నారావారిపల్లి నుండి సి.రామాపురం గ్రామాలలోని మహిళలకు 15 ఆటోలు ఒక లక్ష యాభై వేలు సబ్సిడీతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించారు. - ఆటోల ద్వారా నెలకు 12,000 రూపాయల పెట్రోల్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ హితంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి ఉన్నారు.

## ఆశలు, ఆశయాలు నెరవేర్చడానికి నేనున్నా

### సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భోగి మంటలతో మీ సమస్యలన్నీ తీరిపోయి మీకు భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ఆశలు, ఆశయాలూ తీర్చడానికి ప్రజాప్రతినిధులుగా మేం అన్ని వేళలా మీతోనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. మీ అందరికి భోగి పండుగ శుభాకాంక్షలు. అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు.

## దుబాయ్ కార్ రేసులో ప్రముఖ టీమ్

### మరిన్ని విజయాలు సాధించాలన్న ఎపి డిప్యూటీ సిఎం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : దుబాయ్ కార్ రేసులో విజ్యం సాధించిన తమిళ అగ్రకథానాయకుడు అజిత్ కుమార్ కు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. దుబాయ్ 24 రేసులో 4 విభాగంలో స్పిరిట్ ఆఫ్ ది రేస్ అవార్డును 991 విభాగంలో థర్డ్ ప్రైజ్ గెలుచుకున్నందుకు అజిత్ కుమార్ ఆయన టీమ్‌కు అభినందనలు చెప్పారు. గొప్ప సంకల్పంతో సవాళ్లను అధిగమించి, ప్రపంచ వేదికపై భారత్ జెండాను ఎగురవేయడం నిజంగా స్ఫూర్తిదాయకం. మీకు , మీ బృందానికి మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## నారావారిపల్లెలో మంత్రి నారా లోకేష్

# ప్రజాదర్బార్

నారావారిపల్లె: కష్టాల్లో ఉన్నవారికి అన్ని విధాల అండగా నిలుస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. తన నారావారిపల్లె పర్యటనలో 54వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు నారావారిపల్లె వచ్చిన మంత్రి నారా లోకేష్ ను స్వయంగా కలిసిన ప్రజలు.. తాము ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలపై వినతి పత్రాలు అందించారు. వైసీపీ హయాంలో తన భర్త గుర్రం ఏకాంబరాన్ని అప్పటి మంత్రి పెద్దిరెడ్డి బంధువులు హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని పుంగనూరు నియోజకవర్గం, పులిచెర్ల మండలం, కమ్మపల్లె గ్రామపంచాయతీ, దిన్నెహరిజనవాడకు చెందిన మృతుని సతీమణి గుర్రం కోకిల మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి తగిన న్యాయం చేయడంతో పాటు ఏ అండా లేని తమ కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీనైన తాను అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నానని, తనకు ఇంటిస్థలం, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నమయ్య జిల్లా కలకడ మండలం పోతువారి పల్లెకు చెందిన కె.వెంకటలక్ష్మి విజ్ఞప్తి చేశారు. అనంతపుర జిల్లా, అనంతపురం రూరల్ మండలం, పాపంపేటలోని తన ఎకరం భూమిని కోనంటి రామప్ప, కె.వెంకట చౌదరి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి బారి నుంచి తన భూమిని కాపాడాలని గొంది వెంకట సుబ్రహ్మణ్యం విన్నవించారు. సమ్మె కాలాన్ని సాధారణ సెలవుగా ప్రకటించి వేతనం మంజూరు చేయడంతో పాటు నిలిచిపోయిన వార్షిక ఇంక్రిమెంట్ అందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెర్ప్ ఎంప్లా యిస్ జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వెలుగు సిబ్బంది సర్వీసును 62 ఏళ్లకు పెంచా లని, పే స్కేల్ అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య సమస్యలతో మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్యనియామకం కింద అర్హతలను బట్టి ఉద్యోగాలు కల్పించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని వివిధ పాఠశాలల్లో 12 ఏళ్లుగా ఒప్పంద ఉపా ధ్యాయురాలిగా పనిచేస్తున్న తనకు 2021-22 ఏడాది నుంచి రెన్యువల్ చేయలేదని, తిరిగి కాంట్రాక్ట్ టీచర్ గా పనిచేసేందుకు అవకాశం కల్పించాలని చిత్తూరు జిల్లా గడ్డంవారిపల్లికి చెందిన ఎన్.జయశ్రీ విన్నవించారు.

# తెలంగాణ వైపు ప్రపంచం చూస్తోంది

**• మొదటి ఏడాది పెట్టుబడులతో సత్ఫలితాలు • పెట్టుబడులకు సానుకూలంగా 18 ప్రాజెక్టులు • పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్ • అన్ని దేశాలు పెట్టుబడి పెట్టే అవకాశాలు • 20 నుండి సీఎం రేవంత్ దావోస్ పర్యటన**

**• అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చర్చలు**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి; పెట్టుబడులకు గమ్య స్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాది లోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ధి పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని అన్నారు. జూబ్లీహిల్స్ లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతి ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు. గత ఏడాది ప్రభుత్వం తో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీ లు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి. అవి ఏయే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెటుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడుల కు ముందుకు వచ్చాయి. దాదావు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదావు 17 ప్రాజెక్టులు ప్రారంభమ య్యాయని అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉందని తెలిపారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబు తో సీఎం చర్చించారు. ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు ముఖ్యమంత్రి దావోస్ లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటన లో ఉంటారు. సింగపూర్ లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు పలు సంస్థల తో సంప్రదింపులు జరుపుతారు. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు.

## మా మధ్య విబేధాలు లేవు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మా మధ్య ఎటువంటి విబేధాలు లేవు. అవన్నీ సోషల్ మీడియా సృష్టించిన కథనాలేనని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో చైర్మన్ బీర్ నాయుడు, ఈవో శ్యామలరావులు వివరించారు. తమ మధ్య ఎటువంటి గ్యాప్ లేదని వివరించారు. తిరుపతిలో భక్తుల తొక్కిసలాటకు వీరి మధ్య విభేదాలే కారణమన్న ఊహాగానాలపైనా మాట్లాడారు. సోషల్ మీడియా వార్తల్ని నమ్మొద్దంటూ భక్తులకు ఓ సలహా కూడా ఇచ్చారు. తిరుపతి తొక్కిసలాట ఘటన తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తిరుపతిలో భక్తుల తొక్కిసలాట తర్వాత అక్కడ పర్యటించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం చైర్మన్, ఈవో సమన్వయ లోపంపై మాట్లాడారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య గ్యాప్ వల్లే తొక్కిసలాట జరిగిందా అన్న చర్చ మొదలైంది. దీనిపై ఇవాళ మరోసారి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు స్పందించారు. తమ మధ్య గ్యాప్ ఉందన్న ప్రచారాన్ని వీరిద్దరూ ఖండించారు. టీటీడీ బోర్డుకూ, ఈవోకు మధ్య విబేధాలున్నాయన్న ప్రచారాన్ని చైర్మన్ బీఆర్ నాయుడు ఖండించారు. బోర్డుకూ, అధికారులకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదన్నారు. దీనిపై సోషల్ మీడియాలో వచ్చే వార్తల్ని నమ్మొద్దని భక్తుల్ని కోరారు. మీడియాలోనూ వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురించవద్దని బీఆర్ నాయుడు సూచించారు. అందరూ కలిసి సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు టీటీడీ ఈవో శ్యామలరావు కూడా టీటీడీలో ఎలాంటి సమన్వయ లోపం లేదని క్లారిటీ ఇచ్చారు. టీటీడీలో చైర్మనే కీలకమని, బోర్డు నిర్ణయాల్ని అధికారులు అమలు చేస్తారనన్నారు. మరోవైపు తిరుపతి వైకుంఠ దర్శనం టోకెన్ల కోసం భక్తుల్ని అనుమతించే విషయంలో కొన్ని లోపాలు జరిగాయని శ్యామలరావు అంగీకరించారు. అయితే చైర్మన్ కూ, తనకూ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తాను ఎవరితోనూ అమర్యాదగా మాట్లాడనని ఈవో స్పష్టం చేశారు. తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# వచ్చే విద్యాసంవత్సరం నుంచి తల్లి దీవెన

**• 24 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బు అంద చేసిన కూటమి ప్రభుత్వం • భయానక పరిస్థితి నుంచి సంతోషకర పరిస్థితి • గుంతల రోడ్ల మరమ్మతులు నెలాఖరుకు పూర్తి**

**• జగన్‌కు మతి చెలించింది : మంత్రి కొలుసు పార్థసారధి**




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వచ్చే విద్యాసంవత్సరం నుంచి తల్లి దీవెన పథకాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఒకో పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుందని, అందులో భాగంగానే తల్లి దీవెన ఒకటని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు మతి చెల్లించిదని ఆరోపణలు చేశారు. పూర్తి నిరాశతో జగన్ ఏమీ మాట్లడుతున్నాడో తెలియని పరిస్థిత నెలకొందన్నారు. మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం కూలిపోతుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జగన్ మాటలు వింటుంటే మతి చెలించి మాట్లాడుతున్నారనే అనుమానం కలుగుతోందని మంత్రి మండిపడ్డారు. జగన్ పని తీరు, వ్యవహారశైలి నచ్చక అనేక మంది నేతలు ఆ పార్టీని వీడుతున్నారని, అయినా ఆయన మాత్రం పద్ధతి మార్చుకోవడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాన్ పార్టీ అధినేత పూర్తిగా నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయాయని, ఆ విషయం ఆయన మాటల ద్వారా అర్థమవుతోందని పార్థసారథి చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో రైతులంతా సంతోషంగా ఉన్నారని, ధాన్యం సేకరణ విషయంలో జగన్ ప్రభుత్వం ఎలా మోసం చేసిందో రైతులకు తెలుసని మంత్రి విమర్శించారు. బిందు సేద్యం, పామాయిల్, మామిడి, ధాన్యానికి మద్దతు ధర వంటి వాటితో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని తెలిపారు. అందుకే ఈ సంక్రాంతికి గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత సంతోషంగా అన్నదాతలు ఉన్నారని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పుకొచ్చారు.

**ఆనందంగా సంక్రాంతి..**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. రైతుల నుంచి దాదావు 29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లోనే వారికి డబ్బులు చెల్లించాం. అందుకే రైతులు నేడు చాలా సంతోషంగా సంక్రాంతి పండగ నిర్వహించుకుంటున్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను రైతులు ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ధాన్యం సేకరించి జగన్ ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోతే మా ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించింది. ధాన్యం సేకరణలో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసింది. వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా రద్దు చేసిన అనేక కార్యక్రమాలను పునరుద్ధరించాం. ప్రతినెలా ఒకటో తేదీ నాటికి పెంచిన పెన్షన్లతో ఇళ్లకు వెళ్లి అందిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రతి కుటుంబానికీ రూ.12 వేలు తల్లికి వందనం పేరుతో ఇవ్వబోతున్నాం. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి మా భూమి మాదే అనే ధైర్యం ప్రజలకు కల్పించాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల పొట్ట నింపే కార్యక్రమం సీఎం చేపట్టారు.

వైసీపీ హయాంలో సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వెళ్లలేమని ఏపీ ప్రజలు బాధపడేవారు. నేడు ఊరూరా రోడ్లు వేయడంతో సొంతూళ్లకు ఆనందంగా వెళ్లారు. ఏపీలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. సంక్రాంతి పండగను సంబరంగా చేసుకుంటున్నారు. పారిశ్రామికంగా ఈ రాష్ట్రం వైసీపీ పాలనలో అధోగతి పాలైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక లోకేశ్ విదేశీ పర్యటనలు చేపట్టి పెట్టుబడులను తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో చాలా మంది పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఓ పరిశ్రమ పెట్టాలంటే తమకేంటని పాలకులు దోచుకున్నారు. 2018-19లో డేటా సెంటర్‌కు 130 ఎకరాలు కేటాయిస్తే వైసీపీ పాలనలో అసలు పట్టించుకోలేదు. రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లేక వలసలు వెళ్లారు. వచ్చే రెండేళ్లల్లో రాష్ట్రంలో లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. చంద్రబాబుపై నమ్మకంతో ప్రజలంతా పండగ చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఏపీ గాడిన పడిందని, అభివృద్ధి జరుగుతోందని ప్రజలు నమ్ముతున్నారు. వైసీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేస్తున్నారు. జగనన్న కాలనీలకు - ఎన్టీఆర్ నగర్ పేరు సబబేనని భావిస్తున్నాం. జగన్ ఇప్పుడు కూడా నేర ప్రవృత్తితో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ తీరు మార్చుకోకుంటే ప్రజలు ఈసారి మరింత బలంగా బుద్ధి చెబుతారు. మూడు నెలల్లో ప్రభుత్వం పడిపోతుందని జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం. జగన్ పగటి కలలు కంటున్నారా?.. రాత్రి కలలు కంటున్నారా?.. లేక రాజకీయ పరిస్థితులకు మైండ్ చలించి మాట్లాడుతున్నారా? అనే అనుమానం కలుగుతోంది. వైనాట్ 175 అన్న నినాదం ఏమైందో ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో అందరికీ తెలుసు. వైసీపీ నేతల గాలి మాటలను పట్టించుకోమని చెప్పారు.


## దావోస్ పర్యటనకు ఏపీ సీఎం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ దావోస్‌లో పర్యటించనున్న విషయం తెలిసిందే. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో చంద్రబాబు నేతృత్వంలో తొమ్మిది మంది బృందం పాల్గొననుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అక్కడ ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈఓలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో వనరులు, పెట్టుబడి అవకాశాలను వీరు ప్రపంచ ఆర్థిక సదస్సులో వివరించనున్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని దావోస్ పర్యటన బృందంలో మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా, సీఎం సెక్యూరిటీ అధికారి శ్రీనాథ్ బండారు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, పరిశ్రమల కార్యదర్శి యువరాజ్, ఏపీ ఈడీబీ సీఈవో సాయి కాంత్ వర్మ, కాడా పీడీ వికాస్ మర్మత్ ఉండనున్నారు.

## ఏపీ క్రికెట్ అసోసియేషన్‌లో విభేదాలు

### లోకేష్ వద్దకు చేరిన పంచాయితీ!




అమరావతి: వైసీపీ అధికారం కోల్పోవడంతో పాత కార్యవర్గం తప్పుకుంది. కొత్తగా టిడిపి నాయకుల నేతృత్వంలో కమిటీ ఏర్పాటు అయింది. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆంధ్రా క్రికెట్ ఆసోసియేషన్కు అధ్యక్షు డయ్యారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. అయితే ఆ ఇద్దరి మధ్య ఇప్పుడు విభేదాలు ప్రారంభమైనట్లు ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాలకు సంబంధించి విభేదాలు నడుస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరు ఎంపీలు లోకేష్ కు అత్యంత సన్నిహితులు. దీంతో లోకేష్ వద్దకు ఆ పంచాయతీ చేరినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయవాడ నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు కేశినేని చిన్ని . సోదరుడు నాని పై గెలుపొందారు. అయితే లోకేష్ అండదండలతోనే చిన్ని తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మరోవైపు సానా సతీష్ ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. చాలామంది ఆశావహులు ఉన్నా.. లోకేష్ పెద్దపీట వేయడంతోనే సతీష్ కు రాజ్యసభ పదవి దక్కిందన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ ఇద్దరూ ఎంపీలు ఏపీ క్రికెట్ అసోసియేషన్ లో కీలకంగా ఉన్నారు. ఇటువంటి సమయంలో వారి మధ్య విభేదాలు.. లోకేష్ కు తలనొప్పిగా మారాయి. ఏపీ క్రికెట్ అసోసియేషన్ లో విభేదాల పర్వం పరిష్కరించాల్సిన అవసరం లోకేష్ పై ఏర్పడింది. ముఖ్యంగా అసోసియేషన్ లో విధానపరమైన అంశాలకు సంబంధించి అధ్యక్షుడు చిన్ని ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని సతీష్ చెబుతున్నారు. కానీ చిన్ని మాత్రం సతీష్ పై తీవ్రస్థాయిలో ఆగ్రహంతో ఉన్నారు. అధ్యక్షుడిగా ఉన్న చిన్ని పాలకవర్గంతో సంబంధం లేకుండా హామీలు ఇస్తున్నారని.. కోట్లాది రూపాయలు విరాళం ప్రకటిస్తున్నారని.. అటువంటి వాటికి నాతో సంబంధం లేదని సానా సతీష్ తేల్చి చెబుతున్నారు.




# 12 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

**• 28 దుంగలు స్వాధీనం • పుల్లంపేట మండలంలో స్వాధీనం చేసుకున్న పోలీసులు • అభినందించిన జిల్లా ఎస్పీ**

అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్; అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం లోని అనంతసముద్రం అటవీ ప్రాంతంలో పుల్లంపేట పోలీసులు మరియు ఫారెస్ట్ అధికారులు జిల్లా ఎస్పీ ఆదేశాలతో సంయుక్త ఆపరేషన్లో భాగంగా 568 కేజీల 28 దుంగలను స్వాధీనం చేసుకొని 12 మంది ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా పుల్లంపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో రాజంపేట డిఎస్పి సుధాకర్ మాట్లాడుతూ అనంతసముద్రం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను తరలించేందుకు సిద్ధంగా ఉంచారనే సమాచారంతో రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బీవీ రమణ, పుల్లంపేట పోలీసులు, నందలూరు పోలీసులు, ఫారెస్ట్ అధికారులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా 12 మందిని అరెస్టు చేయడం జరిగిందని, ఎర్రచందనం అక్రమ రవాణా విషయంలో పోలీసులు ఉక్కు పాదం మోపి కచ్చితంగా వ్యవహరిస్తారని మరోసారి నిరూపించామని ఆయన తెలియజేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా అడ్డుకున్న పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారని, వారికి రివార్డు కూడా అందేలా సిఫారసు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. అలాగే నిందితులను పట్టుకోవడంలో బాగా కృషి చేసిన పోలీస్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని డిఎస్పి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎస్సై మోహన్ కుమార్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీనరసింహుని సేవలో స్పీకర్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని సోమవారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.శ్రీ గోదా కళ్యాణోత్సవం సందర్భంగా ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయ అధికారులు, అర్చకులు స్పీకర్ ప్రసాద్ కుమార్ కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామి వారి దర్శనంతరం అర్చకులు వేద మంత్రాలతో స్పీకర్ ను ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

ఆయన వెంట ఓ ఎస్ డి వెంకట్, టిపిసిసి సోషల్ మీడియా సెక్రటరీ చామల రఘుపతి రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మందా జగన్నాథంకు కేటీఆర్ నివాళి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః పాలమూరు జిల్లా రాజకీయాల్లో మాజీ ఎంపీ మందా జగన్నాథం తనదైన ముద్ర వేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన మంద జగన్నాథం పార్థివ దేహాన్ని కేటీఆర్, ఇతర నాయకులు. సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జగన్నాథం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... మంద జగన్నాథం మరణంతో తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని తెలిపారు. పాలమూరు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు.

## విల్లంబుల వీరుడి
# పోరాట స్ఫూర్తితో అభివృది

● రూ.4 కోట్ల 96 లక్షలతో పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన ● రూ. 1 కోటి 35 లక్షలతో బాల సదన్ భవన నిర్మాణానికి భూమిపూజ ● కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జూనియర్ కాలేజ్ అప్ గ్రేడ్ ● పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఆదిలాబాదు ఉమ్మడి జిల్లా ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్: విల్లంబుల వీరుడి పోరాట స్ఫూర్తితో అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక) తెలిపారు. సోమవారం జిల్లాలో చేపట్టిన పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే. ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి వెద్మ బొజు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి.డేవిడ్తో కలిసి భూమి పూజ చేశారు. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామం స్వామి ఆలయ దారిలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్వాగత తోరణం నిర్మాణానికి శంకుస్థావన చేశారు. ఆసిఫాబాద్ పట్టణం జనకాపూర్లో రూ.1 కోటి 36 లక్షలతో బాల సదన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. వాంకిడి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జూనియర్ కాలేజ్ అప్ గ్రేడ్ చేశారు. జన్మాపూర్లో రూ.19 లక్షలతో నిర్మించిన ఆదర్శ అంగన్వాడీ భవనం ప్రారంభించారు. రోడ్డు భద్రత మహోత్సవంలో భాగంగా హెల్మెట్ వంపిణీ చేసి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం కెరమేరి మండలంలో జోడేఘాట్లో రూ.4 కోట్ల 96 లక్షలతో పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కోట పరందోలి గ్రామంలోని జంగుబాయి పుణ్య క్షేత్రం వద్ద సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేపటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు వెనుక జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసిన భీమ్ ప్రాణ త్యాగాలు ఉన్నాయన్నారు. చరిత్రను తిరిగి రాసిన జోడేఘాట్ ప్రాంతాన్ని చారిత్రాత్మకమైన టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భీమ్ వర్ధంతి, జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం. తీసుకుందని తెలిపారు.

ఈ ప్రాంత ఆదివాసీల డిమాండ్ మేరకు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయి అన్నారు. సందర్శనకు వచ్చే ఏర్పాటకులకు భీమ్ చరిత్రను తెలియజేయడంతో పాటు ఆయన స్ఫూర్తిని తెలియజేసేలా అభివృద్ధి చేయడం నీటి సమస్యతో ఆదివాసీలు వ్యవసాయంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ పోరాటం కూడా భీమ్ స్ఫూర్తితోనే ముందుకు వెళ్లడం జరిగింది. ఆదివాసీలను విద్యలో ముందుకు వెళ్ళేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ట్రైబల్ అడ్వైజరి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని ఆదివాసీల అభివృద్ధికి సంక్షేమానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ప్రణాళికను తయారు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆదివాసీలకు దుప్పట్లు పంపించేశారు. రోడ్డు భద్రత మహోత్సవంలో భాగంగా అసిఫాబాద్లో మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి నడవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు వ్యక్తిగత భద్రత అవసరమని, బార్లకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు పెట్టడం కంటే హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వాహనదారులు భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం నక్కుకుప్రం భీమ్ మనవడు సోనేరావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జ్ అమ్మార శ్యాం నాయక్, సంబంధిత శాఖల అధికారులు, ఆదివాసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## త్వరలో సీఎం రేవంత్ ఆకస్మిక పర్యటనలు

● అక్రమాలు జరుగకుండా చూడాలి ● అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు ● అధికారులు విధుల పట్ల అలసత్వం వహించొద్దు ● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఖమ్మం జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కొంచెం ఇంపార్టెంట్ మీటింగ్ కారణంగా ఆలస్యంగా వచ్చానన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటనలు ఉంటాయని తెలిపారు. అక్రమాలు జరుగకుండా చూడాలన్నారు. భవనాలు ఉన్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారు.. అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర వహించాల్సి వుంటుంది.. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దు.. గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండి అని మంత్రి సూచించారు. అలాగే, ప్రజా పాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు అని రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వారి కోసం ఒక్కొక్కటిగా పని చేసి పెడుతున్నాం.. ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు. దీనికి గాను సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు.

దానికి మంత్రులు, అధికారులు అందరు హాజరయ్యారు.. ప్రతి అర్హుడైన పేదవాడికి న్యాయం జరిగేలా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. అర్హుడైన ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తాం.. రెవెన్యూ మంత్రి కూడ ఖమ్మం జిల్లాకు చెందిన వాడే ఆయన దగ్గర ఉండి మరి మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారు.. 16 నుంచి 26 వరకు అధికారులు కష్టపడి, ప్రతి గ్రామానికి వెళ్ళి సర్వే చేయాలి.. పేదలకు ఇళ్లు అందేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

## వేములవాడలో రూ.35 కోట్లతో
# అన్నదాన సత్రం నిర్మాణం

● దక్షిణ కాశీ వేములవాడ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.. ● వేములవాడలో రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేపడుతాం ● శ్రీశైలంలో ఉన్నట్లే మ్యూజికల్ ఫౌంటెన్?ను వేములవాడలో ఏర్పాటు చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః వేములవాడ రాజన్నను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. అందరికీ భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సీజన్ లో కూడా మంచి పుష్కలమైన వర్షాలు పడి ఆయుఆరోగ్యాలతో పాడి పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో తెలంగాణ సమాజం బాగుండాలని రాజన్న స్వామిని మొక్కుకున్న.. రైతంగా బాగుంటేనే అందరూ బాగుంటారు.. దక్షిణ కాశీ వేములవాడ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు కార్యక్రమాలను ప్రారంభించారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇక, విప్ ఆది శ్రీనివాస్ తో పాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నిత్య అన్నదాన సత్రం ఏర్పాటు చేయడం అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మా విజ్ఞప్తి మేరకు అన్నదాన సత్రం నిర్మాణానికి 35 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి మంజూరు చేస్తూ జీవో కూడా విడుదల చేశారని చెప్పారు. 35 కోట్లతో అన్నదాన సత్రం భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతుంది. అన్నదాన సత్రం నిరంతరం జరగడానికి ట్రస్ట్ లో ఇప్పటికే 20 కోట్ల రూపాయలు ఉన్నాయి.. దానిని వంద కోట్లు చేసే బాధ్యత జిల్లా ప్రజా ప్రతినిధులది ఈ ప్రాంత ప్రజలది అన్నారు. అలాగే, మా కుటుంబం తరపున 40 లక్షల రూపాయలను ఆ రాజన్న స్వామి వారి నిత్యాన్నదాన సత్రంకు విరాళం ఇస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు. అలాగే, రాజరాజశ్వర స్వామి భక్తులుగా డోనర్స్ ఉంటే విరాళాలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. దేవస్థానం పేరు మీద బ్యాంక్ అకౌంట్ లో రశీదులు తీసుకొని విరాళాలు ఇవ్వండి అన్నారు. లేదంటే, స్థానిక ఎమ్మెల్యేలు, ఈవోని కలిసి విరాళాలు ఇవ్వొచ్చు అని తెలిపారు. ఆ రాజరాజేశ్వర స్వామి ఆశీర్వాదంతో నిత్యాన్నదాన సత్రం విజయవంతం కావాలన్నారు. అందరు సహకరించండి.. వేములవాడ రాజన్న అన్నదాన ట్రస్ట్ కి సంబంధించి విరాళాలు ఏవి ఇచ్చిన సరే.. రైతులు బియ్యం, కూరగాయలు కూడా ఇవ్వొచ్చు అని ఆయన తెలిపారు. అన్ని పార్టీల వాళ్లు ఎవరెవరు ఆర్థికంగా ఉన్న ఆ దేవాలయానికి వెచ్చిస్తే సంతోషంగా..మేము ఇద్దరం కలిసి హైదరాబాద్ లో డోనర్స్ ను కలుస్తాం.. వేములవాడ దర్శనంలో కోడె టికెట్, అభిషేకం టికెట్ తీసుకొని దర్శనం చేసుకున్నాం.. తిరుపతి లాగ అందరికీ టికెట్ తీసుకుని ప్రత్యేక దర్శనం చేసుకోవచ్చు అన్నారు. శ్రీశైలంలో ఉన్నట్లే మ్యూజికల్ ఫౌంటెన్ వేములవాడలో లార్డ్ శివ ఉండేలా చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.



## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై మూడు కేసులు నమోదు



తెలంగాణ బ్యూరోప్రతినిధి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కి పండుగపూట బిగ్ షాక్ తగిలింది. ఆయనపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ వన్ టౌన్ పీఎస్లో ఈ కేసులు నమోదు అయ్యాయి. కరీంనగర్ ఆర్డీవో, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కింద కేసులు నమోదు అయ్యాయి. మరో ఫిర్యాదు ఆధారంగా 126 (2),115(2) పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం కలెక్టరేట్లో నిర్వహించిన కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పథకాలపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన కౌశిక్ రెడ్డి నువ్వు ఏ పార్టీ అంటూ సంజయ్ను ప్రశ్నించారు. దమ్ముంటే కాంగ్రెస్ టికెట్పై గెలవాలని సవాల్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. వాగ్వాదం కాస్తా ముదిరి ఇద్దరూ ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. మంత్రుల ఎదుటే కొట్టుకున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు కౌశిక్ రెడ్డిని కలెక్టరేట్ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. వివాదం నేపథ్యంలో అక్కడంతా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, బీఆర్ఎస్ టికెట్పై గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడడం ఏంటని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ వివాదాలు ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ● మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి అన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా రూ.54 కోట్ల వ్యయంతో 27 చెరువుల కింద 2400 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుందని చెప్పారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్కుమార్రెడ్డి మాట్లాడుతూ.. "ఉగాదిలోపే ఈ ప్రాజెక్టును నిర్మించబోతున్నాం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరివ్వాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాం. ఖమ్మంలోనే కీలక మంత్రులున్నారు. ఖజానా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల్లో ఉంది. పొంగులేటి వద్ద రెవెన్యూ, హౌసింగ్, తుమ్మల చేతుల్లో వ్యవసాయ శాఖ ఉంది. అందుకే ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలను కూడా ఆయకట్టులోకి తీసురాలేదు. పాలమూరు, సీతారామ పరిస్థితి కూడా అంతే. అందుకే మేం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి ఎకరాకు నీరందించాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ఈ వానాకాలం వరిపంట రికార్డు స్థాయిలో 153 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. తెలంగాణ వరి రైతులు రికార్డు సృష్టించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కింద సీఎం రేవంత్రెడ్డి ఆగస్టు 15న పంపులను ఆన్ చేశారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ "ఇందిరమ్మ రాజ్యం వచ్చినందుకు గత పదేళ్లలో అమలు కాని పథకాలను అమలు చేశాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాం. రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ, రూ.22వేల కోట్ల రుణమాఫీ, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేశాం. ఖమ్మం జిల్లాను వ్యవసాయపరంగానే కాదు భవిష్యత్తులో పారిశ్రామికంగానూ అభివృద్ధి చేస్తామని మాటిస్తున్నా" అని భట్టి విక్రమార్క తెలిపారు.





## కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీస్ రాజ్యం

● బీఆర్ఎస్ నేతలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు ● మాజీ మంత్రి గంగుల కమలాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధి : కరీంనగర్లో జరిగిన అధికారిక సమావేశంలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఫెయిల్ అయ్యారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం ఆయన కరీంనగర్ జిల్లాలో మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ఎమ్మెల్యేను ముగ్గురు మంత్రుల ముందు లాక్కుపోవడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. జిల్లా ఇంచార్జీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిన్నటి మీటింగ్ లో ఫెయిల్ అయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీస్ రాజ్యం పెట్టి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కౌశిక్ రెడ్డి ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని, గతంలో జిల్లా పరిషత్ లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఇంచార్జీ మంత్రి కంట్రోల్ చేసేవారన్నారు. నిన్న జరిగిన ఘటనలో ముగ్గురు మంత్రులు ఉండి జరిగిన ఘటనను కంట్రోల్ చేయలేకపోయారని ఆయన మండిపడ్డారు. ఏ సమావేశంలో కూడా ఎమ్మెల్యేలపై పోలీసులు ఇలా దాడి చేయలేదని, వారి ఇద్దరి మధ్య వ్యక్తిగతంగా జరిగిన సంభాషణలో ఏం జరిగింది తెలుసుకోకుండా లాక్కుపోవడం ఏంటి అని ఆయన ప్రశ్నించారు. అధికారులతో అక్రమ కేసులు పెట్టించేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేశారని, కరీంనగర్ చరిత్రలో ఇలాంటి ఘటనలు ఎప్పుడు జరగలేదు బలం ఉందని ఎదురిస్తే ఎలా అని ఆయన మండిపడ్డారు. మంత్రుల అనుమతులు లేకుండానే పోలీసులు వేదిక మీదకు వచ్చారా అని ఆయన అన్నారు. ఒక బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ప్రజల పక్షాన దళిత బంధు విషయం పై ప్రశ్నించడం జరిగిందని, అక్రమ కేసులకు మా పార్టీ నాయకులు కానీ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు ఎప్పుడు?

● లేకుంటే కూలీలు తిరగబడుతారు.. తస్మాత్ జాగ్రత్త..! ● రేవంత్ను హెచ్చరించిన హరీశ్రావు

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వ్యవసాయ కూలీలందరికి వర్తింపజేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు డిమాండ్ చేశారు. లేదంటే గ్రామాల్లో కూలీలు తిరగబడుతారు.. తస్మాత్ జాగ్రత్త అని రేవంత్ రెడ్డిని హరీశ్రావు హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్రావు మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అనే పథకం కింద వ్యవసాయ కూలీలకు నెలకు వెయ్యి చొప్పున 12 వేలు ఇస్తామన్నారు. ఉపాధి హామీ పనిలో మట్టి పనులకు పోయే వారిని వ్యవసాయ కూలీలుగా గుర్తిస్తామన్నారు.

మన రాష్ట్రంలో 50 లక్షల ఉపాధి హామీ కార్డుల కింద.. కోటి 2 లక్షల మంది మట్టి పనికి వెళ్తున్నారు. ఒక్క సెంట్ భూమి ఉన్నా.. వారు కూలీ కాదు అని నిబంధన పెట్టారు. ఉపాధి హామీ కింద ఈ ఏడాది 20 రోజులు పని చేసి ఉంటేనే కూలీ అని గుర్తిస్తామన్నారు. సెంటు భూమిలో ఏమైనా పండుతదా..? ఆ సెంటు భూమిలో వ్యవసాయం చేసుకుని దళితుడు, గిరిజనుడు బతుకుతాడా..? అని హరీశ్రావు ప్రశ్నించారు. ఎకరం కంటే తక్కువ భూమి ఉన్న రైతులు 24 లక్షల 57 వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో దళితులు, గిరిజనులు, బీసీలు ఉన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటే దళిత గిరిజన రైతులకు శఠగోపం పెట్టడమేనా..? వాళ్ల నోరు నొక్కడమేనా..? ఈ పథకాన్ని వారికి వర్తింపజేయొద్దని, వారి నోర్లు నొక్కాలని మీకు చేతులు ఎలా వచ్చాయి..? కోటి మంది కూలీలు ఉంటే 10 లక్షల మందికే ఇస్తామంటున్నారు.

ప్రభుత్వం నిజాయితీగా ఆలోచించి.. ఎకరం లోపు ఉన్న రైతులకు మేలు చేయాలి. నీకు ఇష్టం లేకపోతే పథకం బంద్ చేయ్.. తప్పయిందని క్షమాపణ చెప్పు. వ్యవసాయ కూలీలను మోసం చేయొద్దు. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలకు కోత పెట్టడం అవసరమా..? వ్యవసాయ కూలీల పక్షాన కోరుతున్నాను.. ఉపాధి హామీలో మట్టి పనికి వెళ్లే కూలీకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయండి. గ్రామ సభలు పెడితే తిరగబడుతారని హెచ్చరిస్తున్నా.. కూలీలు తిరగబడుతారని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తున్నా.. ఆకలి ఉంది కాబట్టి కడుపు నింపుకోవడానికి కూలీకి పోతున్నారు.. ఎకరం లోపు భూములు ఉన్నవారందరిని వ్యవసాయ కూలీలుగా గుర్తించి ఈ పథకం కింద లబ్ది చేకూర్చాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్రావు పేర్కొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన కైట్ ఫెస్టివల్

● హైదరాబాద్లో నేటి నుండి మూడు రోజులపాటు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్




తెలంగాణ బ్యూరో ప్రతి నిధి: సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్ ప్రారంభించిన మంత్రులు పర్యాటక, సాంస్కృతిక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లు ప్రారంభించారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ స్మిత సబర్వాల్, రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రంగారెడ్డి, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సుధీర్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సారధి వెన్నెల గద్దర్,తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ లు హాజరయ్యారు. 19 దేశాల నుండి 57 మంది ఇంటర్నేషనల్ కైట్ ప్లయర్స్, 22 రాష్ట్రాల నుండి 58 మంది జాతీయ కైట్ ప్లయర్స్ పాల్గొన్నారు. దేశ విదేశాలనుండి 1350 రకాల వివిధ పిండి వంటకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కైట్ ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటుచేసిన చేనేత స్టాల్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆకట్టుకున్న వివిధ కళారూపాలతో కళాకారుల ప్రదర్శనలు ఇచ్చారు. అలరించిన పేరిని, శివతాండవం, భరతనాట్యం, కూచిపూడి, డప్పు డోలు వాయిద్యాలతో ఆదివాసీ నృత్యాలు చేయడంతో హాజరైన వారి ని ఆకట్టుకున్నాయి.



# మేధావులు బీసీ ఉద్యమాన్ని భూజానికెత్తుకోవాలి

● పోరాటాలతోనే ప్రభుత్వాలు దిగి వస్తాయి ● చదువు ద్వారానే కులాలు అభివృద్ధి ● సమాజంలో మార్పు కోసం ముందుకు రావాలి ● ప్రపంచంలో జరిగిన విప్లవాత్మకమైన మార్పు మేధావులతో సాధ్యం అయింది ● రాష్ట్రంలో బిసి ఉద్యమం బలంగా ఉంది.. వచ్చేది బీసీల రాజ్యమే ● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

తెలంగాణ బ్యూరోప్రతినిధిః మేధావులు బీసీ ఉద్యమాన్ని భూజానికెత్తుకొని పోరాడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. చదువుతో ఉద్యోగం, ఉద్యోగంతో అధికారం, అధికారంతో కులాల గౌరవం పెరుగుందున్నారు. సమాజంలో మార్పుకోసం ముందుకు రావాలని సూచించారు. సోమవారం కాచిగూడలోని హొటల్ అభినందన్లో తెలంగాణ బీసీ లెక్చరర్ల అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కాముని సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, మామిడి విఠల్, నర్సింహులు, శేఖర్, నందగోపాల్, సుధాకర్, ఉదయ్ నేత, బాబూరావు, పరుశరామ్, సంతోష్ తదిరుతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణలో బీసీ ఉద్యమం బలంగా ఉందన్నారు. గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీ నినాదం నడుస్తోంది. దేశ ప్రధాని బిసి కావడం గొప్ప విషయం , ఆయన ఒక త్యాగి , సమాజమే ఆయన కుటుంబం ప్రమోషన్లలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి. సివిల్ సర్వీసెస్ లలో బీసీల సంఖ్య తక్కువ ఉంది. కేంద్ర ప్రభుత్వంలో 100 మంది ప్రిన్సిపాల్ సెక్రెటరీ లలో బిసిలు ముగ్గురే. సుప్రీంకోర్టు 32 మంది జడ్జీలలో ఒక్కరు కూడా బిసి లేరు. హెచ్.ఓ.డి స్థాయికి వెళ్ళకుండానే బిసిలు రిటైర్మెంట్ అవుతున్నారు. నిర్మాణాత్మక సైన్యాన్ని మేధావులు తయారు చేయాలి. రాజ్యాంగాన్ని సవరించి , బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. నాచప్ప కమిటీ సిఫార్సు మేరకు బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి. బిసి మేధావులు బలమైన ఉద్యమం చేపడితే , పాలకులు దిగివచ్చి సమస్యలను పరిష్కరిస్తారు.

బిసి లెక్చరర్ ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి ఈ సమావేశానికి అందరికీ అభినందనలు బీసీ లెక్చరర్స్ ఈ సమాజంలో గుణాత్మకమైన పరిణామాత్మకమైన మార్పు రావాలంటే పేదవారు న్యాయం జరగాలంటే బీసీ లెక్చరర్స్ యొక్క పాత్ర గొప్పది అందుకే లెక్చరాలు మీద సామాజిక బాధ్యత ఈ పేద కులాల యొక్క అభివృద్ధి కోసం సామాజిక బాధ్యతను వేసుకోవాలి అప్పుడే సమాజంలో గుణాత్మకమైనటువంటి పరిణామాతకమైన మార్పులు జరుగుతాయి అందుకోసం లక్షణాలందరూ కూడా మేధావులు లెక్చరర్ మీరందరూ మీ బిజినెస్ గ్రంధాల మీద ఈ బాధ్యత వేసుకోవాలి అని చెప్పి బీసీ ఉద్యమాన్ని ఎంతో దూరం తీసుకొచ్చారు తద్వారా ఈ కులాలు సుఖంగా జీవించాలి సమాజంలో అసమానతలు అయినటువంటి సమాజం సామాజిక న్యాయం కోసం ఉండదు. తెలంగాణ ఉద్యమం అయిపోయింది అనేక ఉద్యమాలు వచ్చినాయి ఇప్పుడు వచ్చేది ఉద్యమం వచ్చేది బీసీల రాజ్యం. బలమైన సామాజిక వ్యవస్థలో బలమైన ప్రభుత్వ వేస్తుంటుంది బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం జరుగుతుంది కాబట్టి గ్రామాల్లో పేదరికంతోటి నలిగిపోతున్నారు మన యొక్క శ్రమశక్తి మన యొక్క జాతీయత దేశభక్తి పెంపొందించవలసినటువంటి బాధ్యత విద్యార్థులను తీర్చి దిద్దాల్సిన బాధ్యత నిర్వీర్యం అవుతున్నటువంటి యువతరాన్ని వాళ్ళ లోపల బలాన్ని శక్తిని ప్రోత్సహించి ఈరోజు మేము చేసిన పోరాటం మామూలు ఎక్కువ హాస్టల్లో పెట్టాలని 1978లో సెప్టెంబర్ 24 2018 4,000 మంది విద్యార్థులతో తెలుగు సంక్షేమ భవాని అంటే అప్పుడు బీసీ భవన్ అప్పటినుంచి హాస్టల్ గురుకులాలు అన్ని చేసెయ్ ప్లీజ్ నెంబర్ సిమెంట్ కావాలి అందరికి స్కాలర్షిప్ లభించాలి భారతదేశాన్ని అగ్ర దేశంగా తయారు చేయాలి నెంబర్ మనదేశంగా ఇప్పుడు నెంబర్ త్రీ దాకా ఇవ్వకూడదు మీరు సమాజంతోపాటు సంకల్ప బాలాజీ మీరే సంపత్ని పెంచుకుంటూ మన బీసీ యువతను నడిపించాలని బీసీ ఉద్యమాన్ని నడిపించాలి వచ్చేది బీసీల ఉద్యమం తప్పనిసరి ఈరోజు బీసీ వాదం బలం ఉంది ఇది దారి తప్పకుంట కచ్చితంగా మంచి ఫలితాన్ని ముందుకు తీసుకుపోదాం అని చెప్పి అందుకే మీరే దీనికి నాయకత్వం వహించాలని విద్యార్థులు చేస్తున్న అదే విధంగా కేంద్రంలో బీసీ లో పార్లమెంట్లో బీసీలు పెట్టి చట్టసభలు 50% పెట్టాలి మన తెలుగు రాష్ట్రాల్లో ఉన్నట్లు స్కాలర్షిప్లు ఫీజులు గురుకులాలు హాస్టల్లో విదేశాలు అన్ని రాష్ట్రాల్లో పెట్టాలి అందరు చదువుకొని విదేశాలకు పోవాలి దేశ సంపద కూడా పెంచాలి అని కృష్ణయ్య తెలిపారు.

సూర్య
హైదరాబాద్
మంగళవారం
14 జనవరి 2025



# సంపాదకీయం

editpage@suryaa.com

డిజిటల్ విప్లవాన్ని వ్యవసాయానికి విస్తరించడం ద్వారా, ఆర్థిక వ్యవస్థలోని క్లిష్టమైన రంగాలకు వినూత్న, సాంకేతికతతో నడిచే పరిష్కారాలలో ప్రపంచంలో అగ్ర స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని మనదేశం లక్ష్యంగా పెట్టుకుంది. రైతులకు ఆదాయ మద్దతును పెంచడం ద్వారా రైతుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు, దేశంలో వ్యవసాయం వేగంగా, విస్తృతంగా అభివృద్ధి చెందడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. అందులో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఒకటి. డిజిటల్ గుర్తింపు, సురక్షిత చెల్లింపులు, లావాదేవీలు దేశంలోని డిజిటల్ విప్లవానికి కొత్త బాటలు వేశాయి. ఇటీవలి సంవత్సరాల్లో పాలన తీరును, సేవా పంపిణీ వ్యవస్థను గణనీయంగా మార్చాయి. ఈ పురోగతి ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ, విద్య, రిటైల్తో సహా వివిధ రంగాలలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ విస్తారిత వ్యవస్థకు మార్గం సుగమం చేసింది. పౌర కేంద్రీకృత డిజిటల్ పరిష్కారాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపింది. ఈ పరివర్తన క్రమంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన గత సెప్టెంబర్ నెల 2వ తేదీన జరిగిన కేంద్ర మంత్రివర్గ కమిటీ గణనీయమైన ఆర్థిక వ్యయం రూ.2,817 కోట్లతో 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్'కు ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 1,940 కోట్లు. డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి వివిధ కార్యక్రమాలను ఒకే గొడుగు కిందకు తెచ్చే పథకంగా డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ను రూపొందించారు. వీటిలో డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డీజీసీఈఎస్)ని అమలు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా, పరిశోధనా సంస్థల ద్వారా ఐటీ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం వంటివి ఉన్నాయి. ఈ పథకం రెండు మూల స్తంభాలపై రూపొందించారు..అగ్రిస్టాక్,

## రైతుల జీవితాలను మార్చే సాంకేతికత

కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టం, అదనంగా ఈ మిషన్ 'సాయిల్ ప్రొఫైల్ మ్యాపింగ్'ను కలిగి ఉంది. వ్యవసాయ రంగానికి సకాలంలో నమ్మదగిన సమాచారాన్ని అందించడానికి రైతు కేంద్రిత డిజిటల్ సేవలను ప్రారంభించడం లక్ష్యంగా పెట్టుకుంది.

కిసాన్ కి పెహచాన్ సేవలు, పథకం అమలు వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి రైతు కేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)గా రూపొందించారు. ఇది మూడు కీలక భాగాలను కలిగి ఉంటుంది. రైతుల రిజిస్ట్రీ, జియో-రిఫరెన్స్ గ్రామ మ్యాప్లు, సాగు అయ్యే పంట రిజిస్ట్రీ. అగ్రిస్టాక్ కీలకమైన అంశం ఏమిటంటే రైతులకు విశ్వసనీయమైన డిజిటల్ గుర్తింపుగా ఉపయోగపడే ఆధార్ కార్డ్ మాదిరిగానే 'రైతు ఐడీ'ని ప్రవేశపెట్టడం. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల రూపొందించి, నిర్వహించే ఈ ఐడీలు భూమి రికార్డులు, పశువుల యాజమాన్యం, పంట సాగు, పొందే ప్రయోజనాలతో సహా వివిధ రైతు సంబంధిత డేటాకు అనుసంధానం అయి ఉంటుంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖతో 19 రాష్ట్రాలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ద్వారా అగ్రిస్టాక్ అమలు పురోగమిస్తోంది. రైతు ఐడీల రూపకల్పనకు, డిజిటల్ క్రాప్ సర్వేను పరీక్షించడానికి ఆరు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ (ఫరూఖాబాద్), గుజరాత్ (గాంధీనగర్), మహారాష్ట్ర (బీడ్), హర్యానా (యమునా నగర్), పంజాబ్ (ఫతేగఢ్ సాహిబ్), తమిళనాడు (విరుధ్నగర్) పైలట్ ప్రాజెక్టులు చేపట్టారు.

మూడేళ్లలో 11 కోట్ల మంది రైతులకు డిజిటల్ గుర్తింపులను రూపొందించడం (2024-25 ఆర్థిక సంవత్సరంలో 6 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3 కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరంలో 2 కోట్లు). 2024-25 ఆర్థిక సంవత్సరంలో 400 జిల్లాలు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో అన్ని జిల్లాలను కవర్ చేస్తూ రెండేళ్ళలో దేశవ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభించడం. కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (డీఎస్ఎస్) అనేది పంటలు, నేల, వాతావరణం, నీటి వనరులపై రిమోట్ సెన్సింగ్ డేటాను సమగ్ర భౌగోళిక వ్యవస్థకి అనుసంధానిస్తుంది. మట్టి ప్రొఫైల్ మాపింగ్ మిషన్ కింద దేశంలోని వ్యవసాయ భూమిలో దాదాపు 142 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో 1:10,000 స్కేల్ తో పూర్తి భూ సారం లక్షణాల చిత్రపటాన్ని రూపొందించడాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు. సుమారు 29 మిలియన్ హెక్టార్ల మట్టి ప్రొఫైల్ సమాచార నిధి ఇప్పటికే పూర్తయింది.

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద, డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డీజీసీఈఎస్) వ్యవసాయ ఉత్పత్తి ఖచ్చితత్వాన్ని పెంపొందించడానికి ఖచ్చితమైన దిగుబడి అంచనాలను అందించడానికి పంట కోత ప్రయోగాలకు ఉపయోగిస్తారు.

ఈ మిషన్ వ్యవసాయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తుందని, దాదాపు 2,50,000 మంది శిక్షణ పొందిన స్థానిక యువతకు, కృషి సఖిలకు అవకాశాలను కల్పిస్తుందని భావిస్తున్నారు. డేటా అనలిటిక్స్, ఏఐ, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, ఈ మిషన్ రైతులకు- ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, సలహాలు ఇవ్వడంతోపాటు అన్ని రకాల సేవలను అందిస్తారు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఎలాంటి మినహాయింపులూ లేకుండా అమలు చేయడంపై దృష్టి పెడుతుంది. రైతులను ప్రాథమిక లబ్ధిదారులుగా భావిస్తోంది. సేవలు, ప్రయోజనాలు అందుబాటులోకి రావడంతో పాటు, రాతపనిని తగ్గించడం, వ్యక్తిగతంగా సందర్శించే అవసరం తగ్గించడం కోసం డిజిటల్ ప్రమాణీకరణ జరుగుతుంది. పంట విస్తీర్ణం, దిగుబడిపై ఖచ్చితమైన డేటా ద్వారా ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, రుణ వ్యవస్థలలో మెరుగైన సామర్థ్యం, పారదర్శకత. మెరుగైన విపత్తు ప్రతిస్పందన, బీమా క్లెయిముల కోసం క్రాప్ మ్యాప్ రూపకల్పన, పర్యవేక్షణ కలిగి ఉంటుంది. డిజిటల్ మౌలిక వ్యవస్థ ద్వారా అన్ని విభాగాల నుంచీ లాభం చేకూరేలా చూడటం, పంట ప్రణాళిక, ఆరోగ్యం, తెగుళ్ల నిర్వహణ, నీటిపారుదల కోసం తగిన సలహా సేవలను అందిస్తారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర బడ్జెట్లో రాష్ట్రాల భాగస్వామ్యంతో వచ్చే మూడేళ్లలో వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ)ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం ఈ సంవత్సరం 400 జిల్లాలకు ఖరీఫ్ కోసం డిజిటల్ పంట సర్వేతో రైతులు, వారి భూములను దీని పరిధిలోకి తెస్తారు. 6 కోట్ల మంది రైతులు, వారి భూముల వివరాలతో రిజిస్ట్రీలను తాజా సమాచారంతో నింపుతారు. యూనియన్ బడ్జెట్ 2023-24 గతంలో వ్యవసాయం కోసం డీపీఐని ప్రవేశపెట్టింది. ఇది జనాభా వివరాలు, భూమి హక్కులు, సాగులో ఉన్న పంటలతో సహా రైతులపై సమగ్ర డేటాను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. పశువులు, చేపల పెంపకం, నేల ఆరోగ్యం, అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై సమాచారంతో సహా రైతు-కేంద్రిత సేవల శ్రేణిని అందించడానికి డీపీఐ రాష్ట్ర, కేంద్ర డిజిటల్ మౌలిక సదుపాయాలతో ఏకీకృతం చేస్తుంది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్తో పాటు మొత్తం రూ.14,235.30 కోట్లతో ఆరు ప్రధాన పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమాలలో 2047 నాటికి ఆహార భద్రత, వాతావరణ స్థితిస్థాపకతను నిర్ధారించే లక్ష్యంతో క్రాప్ సైన్స్ కోసం రూ.3,979 కోట్లు, విద్యార్థులు, పరిశోధకులకు మద్దతుగా వ్యవసాయ విద్య, నిర్వహణ, సామాజిక శాస్త్రాలను బలోపేతం చేయడానికి రూ. 2,291 కోట్లు ఉన్నాయి. రూ.1,702 కోట్లు సుస్థిరమైన పశుసంపద, డెయిరీ ద్వారా ఆదాయాన్ని పెంచడానికి కేటాయించగా, ఉద్యానవనాల నుండి ఆదాయాన్ని పెంచడానికి హార్టికల్చర్ స్థిర అభివృద్ధి కోసం రూ.1,129.30 కోట్లు కేటాయించారు. అదనంగా, కృషి విజ్ఞాన కేంద్రాన్ని బలోపేతం చేయడానికి రూ.1,202 కోట్లు, సహజ వనరుల నిర్వహణ కోసం రూ.1,115 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ సమగ్ర విధానాలు భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, సామర్థ్యం, స్థిరత్వాన్ని పెంపొందించడానికి డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతుల జీవితాలను మార్చగలవు.

# టిడిపిని నిర్మాణాత్మకంగా దెబ్బతీస్తున్న పవన్

- కూటమి భాగస్వాములను కూడా ప్రశ్నిస్తున్న జనసేనాని
- కూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉన్నప్పుడు సీఎంతో చర్చించకుండా ప్రకటన
- బీజెపి నేతృత్వంలో టిడిపిని నిర్వీర్యానికి బీజం పడినట్లు గుసగుస
- తిరుపతి ఘటనలో విచారణ కు ఆదేశించక ముందే ప్రభుత్వంపై పవన్ విసుర్లు
- కూటమి ధర్మానికి భిన్నంగా నేల విడిచి సాము చేస్తున్నారనే ఆరోపణలు



ఆర్వేడి నాయుడు
8247896830

జనసేన ఆవిర్భవించింది ప్రశ్నించడం కోసం....పవన్ పుట్టింది కూడా ప్రశ్నించడం కోసమే.ఈ మాటలు మీడియా అన్నది కాదు...విపక్షాలు చేసిన వెటకారం అంతకంటే కాదు. స్వయంగా పవన్ కళ్యాణ్ ఇప్పటికే కొన్ని పదుల సార్లు అనేక వేదికల మీద చేసిన వ్యాఖ్యలు.ఈ తరుణంలో ఆయన కూటమి భాగస్వాములను కూడా ప్రశ్నిస్తున్నారు.ఇప్పుడిదే హాట్ టాపిక్ గా మారింది. చాలా ముందస్తు ప్రణాళికతోనే కూటమి పెద్దన్న అయిన టిడిపిని ఇరుకున పెడుతున్నాడు పవన్.తిరుమల తొక్కిసలాట అనంతరం పర్యటించిన పవన్ కళ్యాణ్ తప్పంతా అధికారులదేనని స్టేట్ మెంట్ ఇచ్చారు. అంతటితో ఆగకుండా భద్రతా ఏర్పాట్లు లేవని చురకలంటించారు.మరో వైపు చంద్రబాబు నాయుడు పరామర్శించి నిజానిజాలు తెలుసుకుంటుండగానే పవన్ ఈతరహా వ్యాఖ్యలు చేయడంలో ఆంతర్యం లేకపోలేదు. టిడిపిని నిర్మాణాత్మకంగా దెబ్బతీసే ఎత్తుగడకు బీజెపి నేతృత్వంలో బీజం పడినట్లు కనిపిస్తుంది. వాస్తవానికి కూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉన్నప్పుడు సీఎంతో చర్చించకుండా ఏ స్టేట్ మెంట్ కూడా ఇవ్వకూడదు.ఇది కూటమి ధర్మం.కానీ తప్పు జరిగింది మన్నించండి అని పవన్ కోరడం విచిత్రంగా ఉంది. సీఎం తో చర్చించకుండా జరిగింది తప్పు అని ఒప్పేసుకునేంత చొరవ ఇంట్లో అయితే ఉంటుంది గానీ ..ఒక ప్రభుత్వంలో ఉండదు,ఉండరాదు.అలా ఉంటే దాన్ని ఆధిపత్యం అంటారే తప్ప... ప్రభుత్వ పాలసీ అనిపించుకోదు.ఒక ప్రభుత్వాన్ని ఒకరే నడిపించలేరు.ఆ విషయం స్పృహలోకి రాకపోతే పవన్ నుంచి ఇలాంటి మాటలే వస్తాయి. కనీసం విచారణ కూడా ఆదేశించకుండానే తప్పు జరిగింది...అది కూడా కూటమి ప్రభుత్వం వల్లే ఈ తప్పు జరిగింటి అంటే దానికి చంద్రబాబుని ముమ్మాటికి బాధ్యుణ్ణి చేస్తున్నట్లే కదా? తప్పు జరిగిందా లేదా అనే విచారణలో కదా తేలాల్సింది.యాదృచ్ఛికంగా జరిగిందా లేదా కుట్ర కోణంలో జరిగిందా అని తెలియకుండా,తెలుసుకునే ప్రయత్నం చేయకుండా ...మా వల్లే ఇదంతా అని ఒక మాట అనేస్తే దానికి బాధ్యులెవరవుతారు అనే రాజకీయ జ్ఞానం పవన్ లో అయితే కనిపించడం లేదు. అంతే కాదు...సీజ్ ది షిప్ విషయంలో, హోం మంత్రి అనిత విషయంలో, ఇలా ఆయన తేనె పూసిన కత్తిలా టిడిపిని ప్రజా కోర్టులో దోషిగా నిలబెడుతూనే ఉన్నాడు.ఏవైనా అనుకోని ఘటనలు జరిగినపుడు ప్రభుత్వం స్పందించేలోపే ఆ బాధ్యత ప్రభుత్వానిదే అన్నట్లుగా స్టేట్ మెంట్ ఇస్తున్నాడు.నిశితంగా గమనిస్తే...షిప్పు వ్యవహారం,హోం మంత్రి వ్యవహారం, ఇప్పుడు తిరుమల ఘటన,ఇవాళ పిఠాపురం వ్యాఖ్యలు ఇవన్నీ చూస్తుంటే పవన్ వెనుక ఎవరో ఉన్నారనిపిస్తుంది.సీజ్ ది షిప్ ఘటనలోనూ ఆయన తన పార్టీ మంత్రి నాదెండ్ల మనోహర్ని పల్లెత్తు మాటైనా అనకుండా ...టిడిపి కి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేని బాహాటంగా విమర్శించడం చూస్తుంటే ఆయన టార్గెట్ వైసీపి కాదు...టిడిపి అనేది అంతర్గంగా ఒప్పుకుని తీరాల్సిందే. శుక్రవారం పిఠాపురంలో పర్యటించిన పవన్ కళ్యాణ్...టిటిడి ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, చౌదరిలపై విరుచుకుపడ్డారు.తనకు నామోషి లేదని అందుకే సారీ చెప్పానని,కావున తొక్కిసలాటకు సంబంధించి మీరు కూడా సారీ చెప్పాలని కోరారు.అంతే కాదు...ఒక అడుగు ముందుకేసి క్షమాపణ చెప్పడానికి మీకెందుకంత నామోషీ అని బీ.ఆర్.నాయుడు తదితరులను నిలదీశారు. బీఆర్ నాయుడు కూడా అనంతరం జరిగిన ప్రెస్ మీట్లో అంతే స్థాయిలో ప్రతిస్పందించారు. ఎవరో అడిగితే తాను క్షమాపణలు ఎలా చెప్తానంటూ ప్రశ్నించారు. వాస్తవానికి ఇదే విషయాన్ని పవన్ కళ్యాణ్ ఫోన్ చేసి బీ.ఆర్. నాయుడుకి చెప్తే సరిపోయేది.పవన్ మాట ప్రకారం కచ్చితంగా సారీ చెప్పే వాడు. కానీ ఇదే విషయాన్ని పబ్లిక్ లో రాద్దాం తం చేయడం ద్వారా జరిగిన తొక్కిసలాట నెపాన్ని టిడిపి మీద వేసి తాను కడిగిన ముత్యాన్ని అనిపించుకోవాలని చూస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ....టిడిపి మంత్రులను,ప్రజాప్రతినిధులను బద్నాం చేయడం ఇది పవన్ కళ్యాణ్కి ఐదోసారి. సంధ్య థియేటర్ ఘటనలో పవన్ కళ్యాణ్కి తెలంగాణ ప్రభుత్వం మంచితనం కనిపించింది గానీ... తిరుమల తొక్కిసలాటలో ఏం జరిగిందో తెలుసుకోలేని అమాయకత్వంలో ఆయన ఉన్నారని భావించలేం. ఏ ప్రయోజనం తో అయినా కానివ్వండి...పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి కూటమి ధర్మానికి భిన్నంగా నేల విడిచి సాము చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

# ఎందుకింత అత్యుత్సాహం? అలసత్వం?

- తెలుగు రాష్ట్రాల్లో మొదలైన సంక్రాంతి సంబరాలు
- పండగకు ముందే కొత్త శోభను తీసుకొస్తున్న అందమైన ముగ్గులు
- పోలీసుల ఆధ్వర్యంలో సంప్రదాయ సంక్రాంతి
- తొలి సినిమా టికెట్లు పెంచుకొని సినిమా వసూళ్ల పంటలు
- వైరస్ తరుముకొస్తున్న వేళ ప్రజలు జాగరూకత అవసరం



డా. ముచ్చుకోట. సురేష్ బాబు,
9989988912

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. ఏపీలో పండుగ శోభ మొదలైంది. కోనసీమలో సంబరాలు కొనసాగుతున్నాయి. చాలా చోట్ల ముగ్గుల పోటీలు మొదలయ్యాయి. రంగురంగుల రంగవల్లులతో యువతులు, మహిళలు అందమైన ముగ్గులు వేస్తూ పండగకు ముందే కొత్త శోభను తీసుకొస్తున్నారు. కోనసీమలోని ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ సందడి మరింత ఎక్కువగా ఉంది. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో అంబరాన్ని తాకాయి సంక్రాంతి సంబరాలు. సనాతన సారథి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సంప్రదాయ సంక్రాంతి సంబరాలు కోడిపందాలు, గుండాట, పేకాట, క్యాబరే డాన్స్, జూదం పెచ్చరిల్లి పోయాయి. వెర్రి పుంతలు తొక్కుతున్న ఈ ప్రక్రియ ఏ సంప్రదాయం ఏ సనాతనము అర్థం కావడం లేదు. మరో వైపు డాకు మహారాజ్, గేమ్ చేంజర్, పుష్ప ప్రీ రిలీజ్ ఈవెంట్స్ పెట్టి జనాన్ని తొలి సినిమా టికెట్లు పెంచుకొని సినిమా అంటే సిగ్గు నీతి మానం లేనిది అని కొత్త అర్థం చెబుతున్న హీరోలు. ఒకవైపు హింస, అస్లీలత, అనైతికత, విచ్చలివిడితనం, తాగుడు పెంచి పోషించే సినిమాలను ప్రోత్సహిస్తూ మరో వైపు విద్యార్థులలో నైతికత నైపుణ్యత పెంపొందించడానికి క్యాబినెట్ హోదాలో కలిగిన చాగంటి గారిని సలహాదారులుగా నియమించారు. మొదటిరోజే సినిమా చూసేయాలి, పండగ రోజు దర్శనం చేసుకోవాలి, పుష్కరాలప్పుడే గోదాట్లో మునగాలి, పున్నమి రోజు ప్రదక్షిణ చేయాలి, మాల్ ఓపెనింగ్ రోజు కొనాలి, రెస్టారెంట్ మొదటిరోజే టేస్ట్ చేయాలి.

ఈ మూర□త్వమే కదా ప్రమాదాలకు కారణం. మన ప్రాణాల కన్నా ఏది ముఖ్యం కాదు. మన కోసం మన కుటుంబం ఉంది. కుటుంబం లో ఒకరు లేక పోతే ఆ లోటు పిల్లలపై ఎంత ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోండి. మనల్ని ప్రేమించే అభిమానించే వాళ్ళ కన్నా హీరోలు దేవుళ్ళు లేరు. పోయాక ఏడ్వడానికి, శవం ఎత్తడానికి దేవుడు గానీ హీరోగానీ రారు.

తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయారు. వైకుంఠ ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టత లోపించడం వైఫల్యంగా కనిపిస్తున్నది. తిరుపతిలో ఏర్పాటు చేసే టికెట్ కేంద్రాలు స్థానికులకు మాత్రమేనని గతంలో ప్రకటించేవారు. ఎవరైనా ఇతర ప్రాంతాల భక్తులు కౌంటర్ల దగ్గరకు వచ్చినా టికెట్లు ఇచ్చేవారు. ఈ దఫా లోపం ఏమంటే, టికెట్ లేని వారిని తిరుమల కొండకు అనుమతించబోమని యాజమాన్యం ప్రకటించింది. దీనివల్ల ముఖ్యంగా తమిళనాడు ప్రాంతం నుంచి చాలా పెద్ద సంఖ్యలో ఎలాగైనా వైకుంఠ ద్వారాలలో ప్రవేశం పొందాలనే ఆతృతతో భక్తులు తిరుపతి చేరుకున్నారు. బుధవారం ఉదయానికి దూర ప్రాంతాల నుంచి రాత్రంతా ప్రయాణం చేసి అలసిపోయిన భక్తులు టికెట్ కౌంటర్లకు చేరుకున్నారు. గురువారం ఉదయం ఐదు గంటల నుంచి టికెట్లు ఇస్తారని ముందస్తుగా అధికారులు ప్రకటన చేసినా బుధవారం ఉదయం 10 గంటలకు కౌంటర్ల దగ్గరకు భక్తులు చేరుకోవడం మొదలైంది. ప్రతి గంటకు భక్తుల సంఖ్య పెరగడం ఉదయం నుంచి కనబడుతూనే ఉంది. పెరుగుతున్న సంఖ్యను దృష్టిలో పెట్టుకొని పోలీసు యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ఘటన జరిగేది కాదు. జన సమ్మర్థం గా ఉన్నటువంటి ప్రాంతాల్లో, నివాస ప్రాంతాల్లో సన్నని ఇరుకు దారులలో వీటిని ఏర్పాటు చేయడం, మలమూత్ర విసర్జనకు కూడా అవకాశం లేకుండా ఉండటం, ఆఖరుకు ఆహారం, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ఎక్కడి నుంచో దూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి వేచి ఉండటం అడుగడుగునా కనిపించింది. 3,000 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో ప్రశాంతమైన వాతావరణంలో దర్శన ఏర్పాట్లు చేశామని ప్రకటించారు. ఇన్ని వేల మంది పోలీసులను కేటాయించామని చెబుతున్నా కౌంటర్లు దగ్గర భక్తులను నియంత్రించడానికి, క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమిత సంఖ్యలో ఉండటం ఈ దుస్థితి కారణంగా ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిన, ఎందరో క్షతగాత్రులైన తరువాత ఇప్పుడు మనం చింతించడం తప్ప చెసెది ఏమి లేదు అని నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు చేసిన టీటీడీ ఛైర్మన్ బి.ఆర్ నాయుడు. టీవీ రంగంలో నిష్ణాతుడైన బి ఆర్ నాయుడు ఈ మధ్యనే ఛైర్మన్ గా వచ్చారని ముఖ్యమంత్రి ఆయన్ను వెనకేసుకు రావడం చూస్తుంటే ఎక్కడికి వెళుతున్నారో అర్థం కావడం లేదు. మరోవైపు ప్రీ రిలీజ్ ఫంక్షన్ రద్దు చేసుకొని మంత్రులు, టిటిడి బోర్డు సభ్యులు క్షతగాత్రుల పరామర్శకు క్యూ కట్టారు. మూడు సంవత్సరాల కిందట వచ్చిన కరోనా మనల్ని సామజిక దూరం పాటించమని చెప్పింది, గత సంవత్సరం బాబా గారి పాదాల కింద భూమిని తాకడానికి 117 మంది బలైపోయారు, ఇప్పటికే చైనా నుంచి మరో వైరస్ తొంగిచూస్తోంది. ఏది ఏమైనా ప్రజలు జాగరూకత అవసరం. తొక్కిసలాటల్లో విలువైన ప్రాణాలు తీసుకోకండి. సంయమనం పాటిస్తే అందరికీ మంచిది.

# దేశానికి ఆదర్శం తెలంగాణ వ్యవసాయ రంగం

- నాసిరకం, కల్తీ విత్తనాలే దొరికిన స్థితి నుంచి మెరుగుకు
- నష్టపోయిగతంలో రైతులు అప్పులు పాలైన వైనాలు
- వడ్డీ మీద పెరిగిన వడ్డీ లతో పెరిగిన రైతులు ఆత్మహత్యలు
- వ్యవసాయాన్ని "పండుగ" చేసి తీరాలన్నది లక్ష్యంగా ప్రభుత్వం
- గతంలో వ్యవసాయానికి ఇవ్వని అత్యధిక ప్రాధాన్యత దక్కుతోంది

డా.కోలాహలం రాంకిషోర్
9849328496

సమైక్య రాష్ట్రంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపో యింది. ప్రాజెక్టులు నిర్మించకపోవడంతో సాగునీరు అందలేదు. కరెంటు కోతల వల్ల భూగర్భజలాలను వినియోగించుకో లేక పోయారు. పండిన పంటలు కళ్లెదుట ఎండిపోతున్నా నిస్సహాయంగా చూస్తూ ఉండాల్సిన దుస్థితి. సకాలంలో ఎరువులు, విత్తనాలు దొరికేవి కావు.ఒక వేళ దొరికినా... నాసిరకం, కల్తీ విత్తనాలే దొరికేవి .ఈ మాఫియా రైతుల భవిష్యత్తును దెబ్బతీసింది. పంట పెట్టుబడి కోసం ఆస్తులు తాకట్టుపెట్టే దీనావస్థ. ఎన్నో ఇబ్బందులు పడి పండించిన వంటకు కనీస ధర రాకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా నష్టపోగా రైతులు అప్పులు కూడా తీర్చలేక నానా గోస పోడేవారు. వడ్డీ మీద వడ్డీ పెరిగి, ఉన్నదంతా అమ్మినా, అప్పులు తీరని దుస్థితిలో తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు పెరిగాయి.ఆదుకోవాల్సిన చంద్రబాబు ప్రభుత్వమే "వ్యవసాయం దండుగ" అన్నారు. "

ైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉండేది. తెలంగా ణ వచ్చిన వెంటనే వ్యవసాయరంగ సమస్యలను పరిష్కరించడమే ప్రథమ లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేసింది. "దండుగ" అన్న వ్యవసాయాన్ని "పండుగ" చేసి తీరాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకుంది. ఎక్కువ మంది ఆధార పడిన వ్యవసాయరంగాన్ని వృద్ధి చేయడం ద్వారానే రాష్ట్రంలో ప్రగతి సాధ్యమని ప్రభుత్వం గట్టిగా విశ్వసించింది. గతం 64 ఏళ్ళలోఎన్నడూ కాంగ్రేస్, టీడీపీ ఇవ్వని అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది వ్యవసాయానికి ఇచ్చింది.కేసీఆర్ వ్యవసాయ రంగంలోని సమస్యలన్నింటిపై అధ్యయనం చేశారు. ఆ సమస్యలకు పరిష్కారంగా ముందుగా రైతులను అప్పుల ఊబి నుంచి బయట పడేసే మార్గం ఆలోచించారు. విత్తనం వేసిన దగ్గరి నుంచి పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు ప్రతీ దశలో రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని గట్టిగా నిర్ణయం తీసుకున్నారు. దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక వ్యూహాలను అమలు చేశారు.

**రైతుల రుణమాఫీ పథకం:** రైతుల 'రుణమాఫీ'పథకంతో లక్ష రూపాయల వరకున్న రుణ మాఫీ చేసింది. 35,29,944 మంది రైతులకు చెందిన మొత్తం 16,124.37 కోట్ల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేయాలని సీఎం కేసీఆర్ తీవ్రంగా ప్రయత్నించినా ఆర్.బి.ఐ అంగీకరించ లేదు. దానితో నాలుగు విడతలుగా రుణమాఫీ ప్రక్రియను సంపూర్ణం చేసింది.

రైతులకు ఇన్పుట్ సబ్సిడీ చెల్లింపు:వడగండ్లు, భారీ వర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు 2009 నుంచి రైతులకు చెల్లించాల్సిన ఇన్పుట్ సబ్సిడీ బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. 2014-15 లో రూ. 480.43 కోట్లతో 12.64 లక్షలు రైతుల ఖాతాలలో జమచేశారు.ఆ తరువాత వచ్చిన వైపరీత్యాలకు కూడా ప్రభుత్వం రూ.845.14 కోట్లను రైతులకు చెల్లించింది. 37,45,102 మంది రైతులకు రూ.1,325 కోట్ల ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చింది.

**ఎర్రజొన్న రైతులకు:** నిజామాబాద్ జిల్లాలోని ఎర్రజొన్న రైతులకు రావలసిన రూ.9.5 కోట్ల బకాయిలను 2014 నవంబర్ 8న చెల్లించింది. రైతులు ఎర్రజొన్న పండించి, పక్క రాష్ట్రాలకు అమ్మితే బ్రోకర్లు చేసిన మోసం వల్ల నష్టపోయారు. ఈ రైతులను ఆదుకోవ డానికి ప్రభుత్వం ఆ బకాయిలను చెల్లించింది.

**సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు విత్తనాలు, ఎరువులు, పురుగు, మందుల కోసం రైతులు ఎన్నో అగచాట్లు పడేవారు. ఎరువుల షాపుల ముందు లైన్ల లో గంటల తరబడి ఎండలో నిలబడి నీరసించి, తమకు బదులుగా తమ చెప్పులు క్యూలైన్లలో పెట్టే వారు. ఎరువుల కోసం కొట్లాటలవల్ల లాఠీచార్జ్ జరిగేది. పోలీసు కాల్పులు జరిగిన ఉదంతాలు కూడా ఉన్నాయి. చివరికి పోలీస్ స్టేషన్లలో ఎరువులు పెట్టి అమ్మించే దుస్థితి చూశాం.కొద్దిపాటి ఎరువులను లాటరీ తీసి ఊరికి కొద్దిమంది చొప్పు న వంచేవారు. ఇదే అదనుగా రైతులకు నకిలీ ఎరువులు, కల్తీ పురు గుమందులు, నకిలీ విత్తనాలు అంటగట్టే మాఫియా జడలు విప్పింది. అదును దాటిపోతుండడంతో ఏదో ఒక విత్తనం వేయాలనే తొందర లో దొరికిన విత్తనాన్ని వేసుకునే వారు. అవి మొలకెత్తక రైతులు నిలువునా మోసపోయేవారు.

ఈ దుస్థితి నుంచి గట్టెక్కించ డానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తెలం గాణ రైతులకు అవసరమైన ఎరువులను ముందుగానే సేకరించి, నిల్వ చేసుకునే ప్రణాళిక రూపొందించారు. రైతులకు అవసరమయ్యే 14.96 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, 30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరు వులను ఎండాకాలంలోనే తెప్పించి, రైతులకు సకాలంలో అందేలా అన్ని చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన నాలుగేండ్లలో 21.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రూ.446.56 కోట్ల సబ్సిడీతో 29 లక్షల మంది రైతులకు అందజేశారు. 107.27 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సబ్సిడీపై అందించారు.

**నకిలీలకు, కల్తీకి పాల్పడే వారిపై పీడీ చట్టం:** విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో కల్తీల వల్ల, నకిలీల వల్ల రైతులు ఎంతో నష్టపోవాల్సి వచ్చేది. పెట్టిన పెట్టుబడి, శ్రమ బూడిదలో పోసిన పన్నీరుగా మారడంతోపాటు, పంటకాలం కూడా కోల్పోయారు. ఈ నేపథ్యంలో కల్తీలు, నకిలీలపై కఠినంగా వ్యవహరించి, పీడీ యాక్టు తెచ్చి నకిలీ మాఫీయా పై నమోదుచేసి జైలుకు పంపేలా ఆర్డినెన్స్ జారీకి 2017 జూన్ 17న కేబినెట్ ఆమోదం తెలిపింది. చరిత్రలో మొదటిసారిగా ఐదు నకిలీ విత్తన కంపెనీల యజమానులపై ప్రభుత్వం పీడీయాక్ట్ కేసు నమోదు చేసి జైలుకు పంపించింది. ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో రైతులకు కల్తీ విత్తనాలు పంపిణీ చేసిన 135 మంది డీలర్ల లైసెన్సులు, 9 సెంట్రలైజ్డ్ సీడ్ లైసెన్సులు రద్దుచేసి, 17 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ కల్తీలు, నకిలీలు చోటు చేసుకోకుండా కాపుకాసింది.

**ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.6 లక్షల సాయం:** వ్యవసాయంలో నష్టాలపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి స్వరాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం పరిహారాన్ని పెంచింది. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.6 లక్షల పరిహారం ఇవ్వాలని 2015, సెప్టెంబర్ 19న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. చనిపోయిన రైతు కుటుంబానికి రూ.5 లక్షలు, రైతు చేసిన అప్పుల చెల్లింపునకు వన్ టైం సెటిల్మెంట్ కింద రూ.లక్ష ఇచ్చారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు రైతు కుటుంబానికి కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే ఎక్స్ గ్రేషియా ఇచ్చేవారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడేండ్లలో ఆత్మహత్యలకు పాల్పడిన 457 మంది రైతులకు రూ.27.42 కోట్లు విడుదల చేస్తూ 2017 అక్టోబర్ 9న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ రైతుల పిల్లలను సంక్షేమ హాస్టళ్లలో చదివించారు. ఆ కుటుంబాలకు ఇండ్లు కూడా మంజూరు చేశారు.

**నీటితీరువా పన్ను విధానం రద్దు:**తెలంగాణ ఏర్పాటకు ముందు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రోడ్డు పన్ను లాగానే.. వ్యవసాయానికి నీటిని వాడుకునే రైతులు నుంచి నీటి తీరువా పన్నులు వసూలు చేసేవి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పన్ను బకాయిలతో పాటు, పన్ను విధానాన్ని శాశ్వతంగా రద్దు చేశారు. 2018 జూన్ 2 నాటికి రూ.800 కోట్ల నీటి తీరువా బకాయిలు రద్దు చేశారు. ఇకపై రైతులకు సాగునీటిని ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రైతులపై భారం పడకుండా ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకోంది.

**మన ఊరు మన కూరగాయలు :** పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. రైతు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించడం, నాణ్యమైన తాజా కూరగాయలను సరసమైన వినియోగదారులకు విక్రయించి ,నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమచేయటం ఈపథకం ప్రధాన ఉద్దేశ్యం.తద్వారా రైతుల ఆదాయం మార్కెట్ ధరలో 25 నుండి 64 శాతం పెరిగినది. నగర ప్రజలకు నాణ్యమైన కూరగాయలను అందించేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్ ఏరియాల్లో 2017 మే 19న 40 కేంద్రాల్ని ప్రారంభించారు. 2017 జూన్ రెండో తేదీ నాటికి మరో 10 సెంటర్లను ఏర్పాటు చేశారు.

సూర్య
హైదరాబాద్
మంగళవారం
14 జనవరి 2025



# మెటా ఆరోపణలు తప్పు

**2024 ఎన్నికలను ఈసీ సక్రమంగా నిర్వహించలేదంటూ మెటా విమర్శలు**

**స్ట్రాంగ్ కౌంటరిచ్చిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్..**

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ధీటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో మెటా యాజమాన్యం వ్యాప్తి చేసిన ఆరోపణలు కూడా తప్పని నిరూపితమైందంటూ చెప్పుకొచ్చారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల సంఘం 2024 లో ఎన్నికలను సక్రమంగా నిర్వహించలేకపోయిందంటూ వినిపిస్తోన్న విమర్శల నేపథ్యంలో రైల్వే మంత్రి ఇలాంటి ట్వీట్తో కౌంటర్ ఎటాక్ చేశారు. అలాగే, పీఎం నరేంద్ర మోడీ పాలనపై ప్రజలకు నమ్మకం కలిగిందని, అందుకే 3వసారి విజయం అందించారని అన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలోనూ, ఆ తర్వాత సహాయ కార్యక్రమాలు చేయడంతో పీఎం మోడీ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన ట్వీట్ చేస్తూ 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో 2024 ఎన్నికలను పకడ్బందీగా జరిగాయి. దాదాపు 640 మిలియన్లకుపైగా ఓటర్లు ఇందులో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై భారత ప్రజలు తమ నమ్మకాన్ని చూపించారు' అని అన్నారు.ఈ క్రమంలో 2024 ఎన్నికలలో భారతదేశంతో సహా చాలా అధికార ప్రభుత్వాలు కోవిడ్ తర్వాత ఓడిపోయా యనే మిస్టర్ జుకర్బర్గ్ వాదన తప్పుగా నిరూపితమైందని తెలిపారు.800 మిలియన్ల మంది ప్రజటకు ఉచిత ఆహారం నుంచి 2.2 బిలియన్ల ఉచిత వ్యాక్సిన్ల వరకు.. అలాగే కోవిడ్ సమయంలో ప్రపంచవ్యాప్తంగా దేశాలకు సహాయం చేయడం నుంచి, భారతదేశాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నడిపించడం వరకు ప్రధానమంత్రి మోడీ నిర్ణయాత్మక వ్యవరించారు. అందుకే పీఎం నరేంద్ర మోడీకి 3వ సారి ప్రజలు పట్టం కట్టారు. సుపరిపాలన, ప్రజల విశ్వాసానికి ఇదే నిదర్శనం' అంటూ చెప్పుకొచ్చారు.'మిస్టర్ జుకర్బర్గ్ అందించిన సమాచారం ఎంతో నిరాశపరిచింది. వాస్తవాలు, విశ్వసనీయతతో ఇలాంటి సమాచారం తప్పని ప్రజలు నిరూపించారు' అంటూ ఆయన ట్వీట్లో పేర్కొన్నారు.



# హిమమెంత కురిసినా ప్రయాణం సులభం

- జడ్-మోడ్ టన్నెల్ ప్రారంభోత్సవంలో ప్రాణాలను పణంగా పెట్టిన కార్మికులకు ప్రధాని మోదీ నివాళులు..
- దాదాపు 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన జడ్-మోడ్ టన్నెల్
- సోనామార్గ్ టన్నెల్ పొడవు ఆరున్నర కిలోమీటర్లు
- హిమపాతం ఉన్నప్పటికీ రవాణాకు ఆటంకం లేకుండా టన్నెల్ ద్వారా ప్రయాణం
- అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం

సోనామార్గ్ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సోనామార్గ్ టన్నెల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.. దాదాపు 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన జడ్-మోడ్టన్నెల్ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం దేశ ప్రజలకు అంకితం చేశారు. పూర్తిగా సొరంగ మార్గంలో నిర్మించిన సోనామార్గ్ టన్నెల్ పొడవు ఆరున్నర కిలోమీటర్లు ఉంటుంది.. మొత్తం 12 కిలోమీటర్ల ప్రాజెక్టులో -మోడ్ టన్నెల్ పొడవు 6.5 కిలోమీటర్లు.. దీని ద్వారా సోనామార్గ్కు ఏడాది పొడవునా కనెక్టివిటీ ఉంటుంది. శీతాకాలంలో తీవ్ర హిమపాతం ఉన్నప్పటికీ రవాణాకు ఆటంకం లేకుండా టన్నెల్ ద్వారా ప్రయాణం చేయవచ్చు.కాగా.. జడ్-మోడ్టన్నెల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ.. కీలక వ్యాఖ్యలు చేశారు.. ప్రాజెక్టును పూర్తి చేస్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు కార్మికులకు నివాళులర్పించారు. కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేశారని ప్రశంసించారు. జమ్ముకశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు, పర్యాటక రంగానికి ఈ జడ్-మోడ్ టన్నెల్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు ప్రధాని మోదీ.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ జమ్మూ కాశ్మీర్తో తనకున్న లోతైన సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు.. జమ్మూకశ్మీర్తో తనకు పాత సంబంధాలే ఉన్నాయని ప్రధాని మోడీ అన్నారు. ఈ రోజు తాను గొప్ప బహుమతితో ఈ ప్రాంత ప్రజల మధ్యకు వచ్చానన్నారు. కొద్ది రోజుల క్రితం జమ్మూలో రైల్వే డివిజన్కు శంకుస్థాపన చేసే అవకాశం తనకు లభించిందన్నారు. సోనామార్గ్ టన్నెల్ను దేశానికి, జమ్మూ ప్రజలకు అప్పగించే అవకాశం తనకు లభించిందన్నారు. జమ్మూ-కశ్మీర్, లడఖ్ల చిరకాల కోరిక ఈ రోజు నెరవేరిందని పేర్కొన్నారు.మోడీ శంకుస్థాపన చేశారంటే.. ప్రారంభిస్తారని.. అందుబాటులోకి తీసుకువస్తరని.. ఇదే అందరూ నమ్మాలని ప్రధాని మోడీ అన్నారు. ప్రతి పనికి ఒక సమయం ఉంటుందని.. సరైన సమయంలో సరైన పని జరుగుతుందన్నారు. 2015 లో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే సోనామార్గ్ టన్నెల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని.. తమ ప్రభుత్వ హయాంలో ఈ సొరంగం పనులు పూర్తి కావడం సంతోషంగా ఉందని మోదీ పేర్కొన్నారు.

**ప్రధాని మోదీని ప్రశంసించిన సీఎం ఒమర్ అబ్దుల్లా..**

జమ్మూ కాశ్మీర్లో ఎన్నికలు సజావుగా జరగడంపై ఒమర్ అబ్దుల్లా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపారు.. "జమ్మూ కాశ్మీర్లో ఎన్నికలు జరిగాయి.. ఎక్కడా ఎలాంటి అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు లేవు.. అధికార దుర్వినియోగంపై ఫిర్యాదు లేదు. ఈ ఘనత మీకు (ప్రధాని మోదీకి), మీ సహచరులకు, భారత ఎన్నికల కమిషన్కు చెందుతుంది.. రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామన్న మీ వాగ్దానాన్ని అతి త్వరలో మీరు (పీఎం మోదీ) నెరవేరుస్తారని నా హృదయం చెబుతోంది".. అంటూ ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

ఈ ఇంజినీరింగ్ మైలురాయిని సాధించడానికి కఠినమైన పరిస్థితులను అధిగమించడంలో కార్మికుల అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రాజెక్టో పాలుపం



చుకున్న అధికారులు, కార్మికులతో ప్రధానమంత్రి మోదీ ప్రత్యేకంగా సంభాషించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా



పాల్గొన్నారు. ప్రారంభోత్సవం తరువాత, ప్రధాని మోదీ సొరంగంను పరిశీలించారు.. దాని రూట్ మ్యాప్ను సమీక్షించారు.. నిర్మాణ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**అన్నివైపులా టన్నెల్స్..**

కశ్మీర్ లోయలో చలికాలం కురిసే మంచు..రవాణా వ్యవస్థను స్తంభింపజేస్తుంది. లోయను దాటి ఎటు వెళ్లాలన్నా..ఎత్తైన హిమాలయ పర్వత శిఖరాలను దాటి వెళ్లాల్సి ఉంటుంది. పర్వత శ్రేణుల్లో నివసించే గ్రామాలు, పట్టణాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతుంటాయి. ఈ పరిస్థితిని నివారించాలంటే పర్వతాలను అడ్డంగా తొలుస్తూ సొరంగాలను నిర్మించాల్సిందే. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అదే పని చేస్తోంది. శ్రీనగర్కు..రోడ్డు మార్గంలో నిరంతరం అనుసంధానించేందుకు అన్ని వైపులా టన్నెళ్లను నిర్మిస్తోంది. అందులో భాగంగా సోనామార్గ్ ప్రాతంలో నిర్మించిన జడ్ మోడ్ టన్నెల్ను ప్రారంభించారు ప్రధాని మోదీ.

జడ్-మోడ్సొరంగం కాశ్మీర్ లోయ - లడఖ్ మధ్య దూరాన్ని 49 కి.మీ నుంచి 43 కి.మీలకు తగ్గిస్తుంది.. వాహన వేగాన్ని గంటకు 30 కి.మీ నుండి 70 కి.మీ/గంకు పెంచుతుంది. సముద్ర మట్టానికి 8,650 అడుగుల ఎత్తులో ఉన్న ఈ సొరంగం కొండచరియలు - హిమపాతాలు సంభవించే మార్గాలను దాటవేసి, లేహ్కు వెళ్లే మార్గంలో శ్రీనగర్ - సోనామార్గ్ మధ్య అన్ని వాతావరణ కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది.








# ట్రంప్తో విభేదించిన వాన్స్..!



వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్-జేడీ వాన్స్ ఇంకా ప్రమాణస్వీకారం కూడా చేయలేదు. అప్పుడే ఇద్దరికీ కొన్ని అంశాల్లో స్వల్ప అభిప్రాయ భేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. 'క్యాపిటల్ హిల్' ఘటనలో నిందితులకు క్షమాభిక్ష అంశంపై వారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఇప్పటికే వారికి తన అధికారాలను ఉపయోగించి కేసుల నుంచి విముక్తి కల్పిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. మరోవైపు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాన్స్ మాత్రం సహజంగానే వారికి ఎటువంటి క్షమాభిక్ష ఇవ్వకూడదని చెబుతున్నారు.తాజాగా ఫాక్స్ న్యూస్లో జరిగిన కార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ "ఇది చాలా సింపుల్. నాడు మీరు శాంతియుతంగా ఆందోళన చేసినట్లైతే.. మిమ్మల్ని జస్టిస్ డిపార్ట్మెంట్ ఓ గ్యాంగ్ సభ్యుల్లా ట్రీట్ చేసేది. మీకు క్షమాభిక్ష కూడా లభించేది. కానీ, ఒకవేళ మీరు ఆ రోజు హింసకు పాల్పడితే.. మీకు క్షమాభిక్ష రాదు. దీనిపై కొంత అస్పష్టత ఉంది. జనవరి 6వ తేదీ నాటి అల్లర్లకు సంబంధించి చాలామంది అమాయకులు విచారణను ఎదుర్కోవడం సరికాదు. దానిని మనం సరిచేయాలి" అని వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలపై క్యాపిటల్ హిల్స్ ఘటనకు మద్దతు తెలిపేవారు వాన్స్ను తీవ్రంగా విమర్శించడం మొదలుపెట్టారు. దీనికి మళ్లీ సామాజిక మాధ్యమం ఎక్స్లో ఆయన వివరణ పోస్టు చేశారు." మొదటగా నేను చెప్పేది ఏమిటంటే.. జే6 (జనవరి 6) ఖైదీల నిధికి నేను కూడా విరాళం ఇచ్చాను. నేను సెనెట్ బరిలో నిలిచిన వేళ ఈ విషయాన్ని చాలామంది విమర్శించారు. నేను చాలా ఏళ్లుగా వీరిని రక్షిస్తున్నాను. రెండోది.. నాడు జనసమూహంలో ఫెడరల్ ఇన్ఫార్మర్లు ఉన్నారు. వారికి క్షమాభిక్ష లభిస్తుందా..? అలాగని నేను అనుకోను. అధ్యక్షుడు ప్రతి కేసును తాను పరిశీలిస్తానని చెప్పారు. (నేను కూడా అదే చెబుతున్నాను) అలా అంటే కొంత వెనక్కి తగ్గినట్లు కాదు. అన్యాయంగా జైళ్లకు వెళ్లినవారిని రక్షిస్తాం. ఎవరి ప్రభావానికో లోనై రెచ్చిపోయిన వారు, చెత్త విచారణలు ఎదుర్కొంటున్నా వారు కూడా వీరిలో ఉన్నారు" అని రాసుకొచ్చారు.తాను అధికారం చేపట్టిన తొలిరోజే క్యాపిటల్ హిల్స్ ఘటనలో నిందితులకు క్షమాభిక్షను ప్రకటిస్తానని ట్రంప్ చెప్పారు. ఇటీవల ఎన్బీసీ మీట్ద ప్రెస్లో కూడా మాట్లాడుతూ వీలైనంత త్వరగా దీనిని పూర్తి చేస్తానని పునరుద్ఘాటించారు. 2020 జనవరి 6వ తేదీన జోబైడెన్ విజయం తర్వాత ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ హిల్ భవనం వద్దకు చేరి ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత వారు అడ్డంకులు తొలగించుకొని ఆ భవనంలోకి చొరబడి అరాచకం సృష్టించారు. 100 మంది పోలీసులు నాడు గాయపడ్డారు. దాదాపు 1,500 మందిపై దీనికి సంబంధించి కేసులు నమోదు చేశారు.

**భారత్ సరిహద్దు సమీపంలో**

# చైనా సైనిక విన్యాసాలు..!



ఢాకా : టిబెట్లోని అత్యంత ఎత్తైన ప్రదేశంలో చైనా భారీగా సైనిక విన్యాసాలను మొదలుపెట్టింది. అత్యంత కఠిన ప్రదేశాల్లో యుద్ధ సన్నద్ధత, లాజిస్టిక్స్ సరఫరా వంటి అంశాలను దృష్టిలోపెట్టుకొని పీఎల్ఏ వీటిని నిర్వహిస్తోంది. ఇండియన్ ఆర్మీ ఫౌండేషన్ డే ఇంకొన్నాళ్లలో ఉండగా చైనా వీటిని మొదలుపెట్టడం గమనార్హం. షింజియాంగ్ మిలటరీ కమాండ్కు చెందిన రెజిమెంట్ వీటిని చేపట్టింది. అత్యాధునిక సైనిక టెక్నాలజీ, ఆల్ టెర్రైన్ వెహికల్స్, అన్మ్యాన్డ్ సిస్టమ్స్, డ్రోన్లు, ఎక్సో స్కెలిటెన్స్ వంటి వాటిని ఈ విన్యాసాల్లో వినియోగిస్తున్నారు. మరోవైపు వీటిని దృష్టిలో ఉంచుకొని భారత దళాలు అప్రమత్తమయ్యాయి.తాజాగా బీజింగ్ చేపట్టిన లాజిస్టిక్స్ సపోర్ట్ ఎక్సర్సైజు చాలా వ్యూహాత్మకమైనవి. అత్యంత ఎత్తైన ప్రదేశాల్లో యుద్ధం వేళ వేగంగా దళాలకు అవసరమైన పరికరాలు, ఆహారం వంటివి సరఫరా చేయడంపైనా సాధన చేస్తున్నారు. ఈ విన్యాసాలు చేపట్టిన ప్రదేశం కూడా లద్దాఖ్ను ఆనుకొని ఉంది. ఇక్కడి వాతావరణం కారణంగా శారీరకంగా ఎదురయ్యే సవాళ్లను తట్టుకొనేలా చైనా దళాలు ఎక్సోస్కెలిటెన్లు వినియోగించడం విశేషం.2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకొన్న భారత్-చైనా సైనిక ఘర్షణ తర్వాత ఈ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. పలుమార్లు సైనిక-దౌత్య స్థాయిల్లో చర్చలు జరిపి పరిస్థితిని కొంత శాంతపర్చారు. బలగాలను వెనక్కి తీసుకొనే అంశంపై గతేడాది అక్టోబర్లో కీలక ఒప్పందం జరిగింది.భారత సైన్యం కూడా హిమాలయాల్లో పోరాటపటిమను పెంచుకొనేందుకు ఏటా హిమ్ విజయ్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో వివిధ దళాల సమన్వయంతో ఆపరేషన్లు నిర్వహించడంపై సాధన చేశారు. చైనా దళాల కదలికలను గుర్తించేందుకు వీలుగా అత్యాధునిక నిఘా వ్యవస్థలు, ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్లను భారత్ వినియోగిస్తోంది. సరిహద్దుల్లో కీలకమైన రోడ్లు, వంతెనలు, సొరంగాలు నిర్మాణాలను భారత్ వేగవంతం చేసింది.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఉచితాలదే జోరు..

- పథకాలతో పార్టీల మధ్య తీవ్రపోటీ
- ఆర్థిక సాయం, ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాలపై అందరి దృష్టి
- ప్రజా సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చ కనిపించట్లే
- పథకాలు ప్రకటించడంలో ఆప్ దూకుడు
- రంగంలో కాంగ్రెస్ కూడా ఆదే దారిలో పయనం
- భాజపా ఉచితాలకు దూరం అంటూనే వాటిని కొనసాగిస్తామని హామీలు

ఢిల్లీః ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రజలను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఉచితాలపై దృష్టి సారించాయి. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు, వాటి పరిష్కారాల కోసం పెద్దగా చర్చలు జరగకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, దేశ రాజధానిగా ఉన్న ఢిల్లీలో వాయు కాలుష్యం, శాంతిభద్రతల సమస్యలు, మహిళలపై నేరాలు వంటి వాటిపై పెద్దగా ఎన్నికల వేళ వాటి ప్రస్తావనే లేదు. మహిళలకు ఆర్థిక సాయం, ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాలపై ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ మొదలైంది.

అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాలి ఢ్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో "రేవ్డీ పర్ చర్చా" అనే పేరుతో ఉచితాలపై చర్చను ప్రారంభించాలని ప్రకటించారు. కేజ్రీవాల్ ప్రస్తావించిన ఉచిత పథకాలు ప్రధానంగా విద్యుత్, వైద్యం, విద్య, మహిళలకు రవాణా వంటి అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన ద్వారా మహిళలకు నెలకు రూ.2,100 ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల్లో వృద్ధులకు ఉచిత వైద్యం అందించే "సంజీవని యోజన" అమలు చేయనున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. అదనంగా దేవాలయం, గురుద్వార పూజారులకు జీతంలో పెంపు, సెక్యూరిటీ గార్డులను నియమించుకునేందుకు నివాస సంక్షేమ సంఘాలకు ఆర్థిక సాయం అందించే ఆర్థిక



పథకాన్ని కూడా ఆయన ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీ కూడా ఉచితాల పై పోటీలో భాగమైంది. మహిళల కోసం "ప్యారీ దీదీ యోజన" పేరుతో నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. "జీవన్ రక్షా యోజన" కింద రూ.25 లక్షల బీమా కల్పించేందుకు కంగ్రెసు పార్టీ సిద్ధమైందని వెల్లడించింది. నిరుద్యోగ యువతకు యువ ఉడాన్ యోజన పేరు ప్రతి నెలా రూ. 8500 ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. ముందు ఉచితాలపై నిర్లక్ష్యంగా ఉన్న భారతీయ జనతా పార్టీ (భాజపా) కూడా ఇప్పుడు ఉచితాలపై సన్నాహాలు మొదలుపెట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఢిల్లీలో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. "భాజపా అధికారం లోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగిస్తాం." అలాగే, పార్టీ మేనిఫెస్టోలో "ఉచిత" హామీలను కూడా అందించేందుకు భాజపా సిద్ధమవుతున్నట్లు సమాచారం. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, ఇళ్లకు 300 యూనిట్లు, ప్రార్థనా స్థలాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్న ప్రతిపాదనలను ఎన్నికల హామీల్లో చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది.

**ప్రజా సమస్యలు వెనక్కి :** ప్రధాన రాజకీయ పార్టీలు ఉచితాలపై చర్చ చేస్తుండగా, ఢిల్లీని వేదిస్తున్న అనేక సమస్యలు పెద్దగా ప్రస్తావనకు రాలేకపోతున్నాయి. ఢిల్లీలోని వాయుకాలుష్యం ఒకముఖ్యమైన సమస్యగా మారింది. నగరంలోని చాలా ప్రాంతాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. యమునా నదిలో అమ్మోనియా స్థాయిలు పెరిగిపోవడం, నీటిశుద్ధి కేంద్రాలు వాటిని సరైన రీతిలో శుద్ధి చేయకపోవడంపై విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో రోడ్లు దెబ్బతినడం, గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా, ఢిల్లీలో శాంతిభద్రతల సమస్య కూడా మరింత తీవ్రమైంది. మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి, అలాగే కొన్ని ముఠాలు అనేక దాడులకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో, ప్రజలు నగరంలో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలను కోరుతున్నారు.

**ప్రజలు ఆశిస్తున్నదేమిటి? :** ఢిల్లీ వాసులు, సామాజిక వేత్తలు నగరాన్ని ఊపిరి తీసుకోనివ్వకుండా చేసే కాలుష్యం, నీటి కొరత, రోడ్ల సమస్యలు, శాంతిభద్రతల సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రభుత్వాలను కోరుకుంటున్నారు. కాగా, ఈ ఉచితాల మధ్య ప్రజల సాధారణ సమస్యలు విస్మరిస్తున్నారనే విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి.


# నిఘా నేత్రంలో కుంభమేళ

**భారీగా భద్రతా ఏర్పాట్లు**

**అండర్ వాటర్ డ్రోన్లు, ఏఐ కెమెరాల వినియోగం**

ప్రయాగ : ప్రపంచంలోనే అతిపెద్ద జనసమూహంగా రికార్డులు సృష్టించే మహా కుంభమేళకు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తోంది. జనవరి 13న మొదలై ఫిబ్రవరి 26 న ముగిసే ఈ కార్యక్రమంలో దాదాపు 45 కోట్ల మంది హిందువులు పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా. ఇలాంటి కార్యక్రమంలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా పకడ్బందీగా భద్రతా చర్యలు చేపడుతున్నారు.. ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు. ఇందుకోసం.. ఆధు నిక సాంకేతిక పరిజ్ఞానాల్ని వినియోగించనున్నారు. మరి.. యూపీ పోలీసులు వాడుతున్న సాంకేతికతలు ఏంటో తెలుసారోజూ కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాల కోసం నదికి వస్తుంటారు.వారి భద్రత, సరైన మార్గనిర్దేశం సహా వివిధ ఏర్పాట్లకు దాదాపు 30 వేల మంది పోలీసులు అవసరం అవుతారని భావిస్తు న్నారు. ఇందుకోసం.. ఉత్తర్ ప్రదేశ్ లోని 70 జిల్లాల నుంచి పోలీసు బలగాల్ని రప్పిస్తున్నారు. వీరంతా.. నిత్యం భక్తుల రాకపోకలు, వారి కదలికల్ని నిశితంగా పరిశీలించనున్నారు. కాగా.. వీరికి అదనంగా అత్యంత శక్తివంతమైన సాంకేతి కతల సాయం తీసుకునేందుకు యూపీ పోలీసులు రంగం సిద్ధం చేశారు.

**పవర్ ఫుల్ కెమెరాలు సిద్ధం..** కోట్ల మంది ప్రజల కదలికల్ని పరిశీలించేందుకు దాదాపు 2,700 వందలకు పైగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ కెమెరాలను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా.. భక్తుల రాకపోకలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు.. రద్దీ క్రమబద్ధీకరణ సహ మిగతా భద్రతను పరిశీలించేందుకు ఇవి పనిచేయనున్నాయి.ఈ కెమెరాలతో పాటు అండర్ వాటర్ డ్రోన్లను వినియోగించనున్నారు. త్రివేణి సంగమం దగ్గర నదీ స్నానానికి వచ్చే భక్తుల రియల్ టైమ్ సర్వైలెన్స్ ను పరిశీలించనున్నారు.త్రివేణీ సంగమంతో పాటు చుట్టుపక్కల గుడుల్లో



మాత్రమే కాకుండా% ప్రయాగ్ రాజ్ కు దారి తీసే అన్ని మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు యూపీ పోలీసులు తెలిపారు. సంగమం దగ్గరకు వచ్చే వాహనాలకు అప్పటికప్పుడు తనిఖీలు చేయడం వీలు కాని నేపథ్యంలో.. వాహనాల్ని ముందుగానే క్షుణ్ణంగా తనిఖీలు చేయనున్నారు. ప్రయాగ్ రాజ్కి దారితీసే ఎనిమిది జిల్లాల్లోని రహదారులపై చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి అన్ని వాహనాల్ని భద్రతా తనిఖీలు నిర్వహించనున్నారు.ప్రస్తుతం.. ఏడంచెల విధానంలో కుంభమేళ కోసం భద్రతా ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు వాహన తనిఖీల కోసం ఇప్పటికే..102 చెక్పాయింట్లను ఏర్పాటు చేసి 1,026 మంది సిబ్బందిని కూడా కేటాయించారు. భారీ భద్రతా ఏర్పాటు చేయా ల్సి రావడంతో.. రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ సాయం తీసుకుంటున్నారు. అలాగే.. భక్తుల కోసం 125 అంబులెన్సులను వినియోగించనున్న ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం.. ఏడు రివర్ అంబులెన్సులను సైతం అందుబాటులో ఉంచనుంది. వీటి ద్వారా.. ఎవరైన భక్తులు అస్వస్థతకు గురైతే చికిత్స అందించనున్నారు. కుంభమేళ జరిగినన్ని రోజులు రాష్ట్ర సర్కార్ చాలా జాగ్రత్తగా వ్యవహరించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జాతీయ సంస్థలు సైతం ఈ కార్యక్రమాన్ని సజావుగా నెరవేర్చేందుకు వివిధ ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రపంచంలోనే అద్భుతమైన సమ్మేళనాన్ని విజయవంతంగా గట్టెక్కించాలని కృషి చేస్తున్నాయి.


# రాజ్యసభలో నోట్లకట్ట.. విషయం బాధించింది

**కరెన్సీ నోట్ల కట్ట తమదంటూ ఎవరూ ముందుకురాలేదు**

**రాజ్యసభ ఛైర్మన్ జగదీప్**

న్యూఢిల్లీ: ఇటీవలి పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాజ్యసభ లో కరెన్సీ నోట్ల కట్ట కనిపించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన కుర్చీ వద్ద ఆ కరెన్సీ నోట్లను గుర్తించినట్లు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన?ఢ్ ఆ సమయంలో వెల్లడించారు. తాజాగా ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇదే వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ఆ డబ్బు తమదంటూ ఎవరూ ముందుకురాకపోవడం తనను బాధించిందన్నారు. ఇది మన నైతిక విలువలకు సవాలు లాంటిదని పేర్కొన్నారు."గత నెలలో రాజ్యసభలో ఓ సీటు వద్ద కరెన్సీ నోట్ల కట్ట లభ్యమైంది. అయితే, ఆ నగదు మాదేనంటూ ఎవరూ ముందుకురాకపోవడం నన్ను ఎంతగానో బాధించింది. అవసరాల దృష్ట్యా తప్పనిసరి పరిస్థితుల్లో ఎవరైనా ఆ నోట్లు తీసుకెళ్తూ ఉండొచ్చు. కానీ, ఈ విషయంలో ఎవరూ ముందుకురాలేదు. ఇది చాలా తీవ్రమైన అంశం. మన నైతిక విలువలకు సవాలులాంటిది" అని ధన?ఢ్ వ్యాఖ్యానించారు.రాజ్యసభలో అనేక ఏళ్లపాటు నైతిక విలువల కమిటీ లేదని ధన?ఢ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1990ల చివర్లో మాత్రమే రాజ్యసభలో తొలిసారి ఈ కమిటీ ఏర్పాటయ్యిందని తెలిపారు. "రాజ్యసభ ఛైర్మన్గా ఒక విషయం మాత్రం చెప్పగలను. సభలో ఉన్నవారు గొప్ప అర్హతలు, అనుభవం కలిగి ఉన్నవారే. కానీ, సభ కార్యకలాపాల విషయానికి వస్తే.. వేరెవారి మార్గనిర్దేశం లో నడచుకుంటారు" అని విచారం వ్యక్తం చేశారు.

పార్లమెంటు సమావేశాల సమయంలో ధన?ఢ్ నోట్లకట్ట ప్రకటనతో సభలో దుమారం చెలరేగింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలంటూ భాజపా ఎంపీలు డిమాండ్ చేశారు. ధన?ఢ్ ప్రకటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. దర్యాప్తు పూర్తికాకముందే సభ్యుడి పేరు బయటకు చెప్పడమేంటని ప్రశ్నించారు. సభకు తాను నోట్ల కట్టను తీసుకురాలేదని సింఘ్వీ స్పష్టం చేశారు. తన సీటు వద్ద కరెన్సీ నోట్లు



దొరకడం భద్రతా వైఫల్యమేనన్నారు. సభలో ప్రతి సీటు చుట్టూ గాజు గదినిగానీ, ముళ్లతో కూడిన ఇనుప కంచెనుగానీ ఏర్పాటు చేయాలని సూచించారు.

# క్యాసినోకు చట్టబద్ధత..

**బిల్లుకు థాయ్ లాండ్ ఆమోదం**

బ్యాంకాక్: క్యాసినో , గ్యాంబ్లింగ్కు సంబంధించి ప్రతిపాదిత బిల్లుకు థాయ్లాండ్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వస్తే థీమ్, వాటర్ పార్కులు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ వంటి టూరిజం కాంప్లెక్సుల్లో క్యాసినోల ఏర్పాటుకు అనుమతికి వీలుంటుంది. ఇందుకు సంబంధించిన బిల్లు వివాదాస్పదమైనప్పటికీ.. పర్యటకానికి మరింత ఊతమివ్వడంతోపాటు ఉద్యోగాల కల్పన కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు థాయ్ ప్రభుత్వం వెల్లడించింది. థాయ్లాండ్లో ప్రభుత్వం నిర్వహించే గుర్రపు పందేలకు మాత్రమే అనుమతి ఉంది. కానీ, అక్రమ బెట్టింగ్ మాత్రం దేశ వ్యాప్తంగా భారీ స్థాయిలో కొనసాగుతుంది. ఇటువంటి అక్రమ జూదం సమస్యను పరిష్కరించడంతోపాటు ఆదాయాన్ని పెంచడం, థాయ్లాండ్లో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యాలతో తాజా నిర్ణయం తీసుకున్నామని ప్రధాని మంత్రి పేటోంగ్టార్న్ పేర్కొన్నారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం.. 20ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారికి క్యాసినోలకు అనుమతి ఉండదు. విదేశీయులకు ఉచిత ప్రవేశం. కాగా థాయ్ పౌరులు మాత్రం రూ.148 డాలర్ల ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

# పేదల సంక్షేమం.. రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందనే నమ్మకం... విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్లే ప్రభుత్వానికి అసలైన ప్రతినిధులని.. ప్రభుత్వానికి మంచి పేరు రావాలన్నా.. గొప్ప పేరు రావాలన్నా కలెక్టర్లే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారని ముఖ్యమంత్రి అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన సర్వేను విజయవంతంగా పూర్తి చేసినందుకు అన్ని జిల్లాల కలెక్టర్లను అభినందించారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, అమలు చేసే పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని.. వాని పనితీరే ప్రభుత్వ పని తీరుకు కొలమానమవుతుందని అన్నారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. కొంతమంది కలెక్టర్లు ఇప్పటికీ ఆఫీసుల్లోనే కూర్చొని పని చేయాలనుకుంటున్నారని, క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లాలని గతంలో చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాలని అప్రమత్తం చేశారు. జనవరి 26 తరువాత జిల్లాలో పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, ప్రభుత్వ వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయి అధికారులను కూడా అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా ఐఏఎస్ అధికారులతో పాటు ఐపీఎస్ అధికారులు కూడా నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టల్స్ విజిట్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత

# ఈ సంక్రాంతి గొప్ప పండుగ



● నాలుగు సంక్షేమ పథకాలకు 45 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం ● ఎక్కడ, ఎవరికి, ఎలాంటి అనుమానాలు లేకుండా లోతుగా చర్చించి పథకాలు రూపొందించాము ● గ్రామ సభలోనే లబ్ధిదారుల ఎంపిక, అనుమతి పత్రాల మంజూరు ● సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలది కీలకపాత్ర ● రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు, నగదు మొత్తము వివరాలు గ్రామాల్లో భారీ ఫ్లెక్సీలు పెట్టి ప్రచారం చేయాలి ● లబ్ధిదారుల తుది జాబితాకు ఇన్చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి: మల్లు భట్టి విక్రమార్క

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంక్రాంతి గొప్ప పండుగలా చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన నాలుగు కొత్త సంక్షేమ పథకాల అమలు సమీక్ష సమావేశము లో డిప్యూటీ సీఎం మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు రవాణా, 500 కే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచడం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణం, హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్, 200% కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం, వరి ధాన్యానికి 500 బోనస్ వంటి చారిత్రాత్మక పథకాలు ఈ రాష్ట్రంలో అమలు అవుతున్నాయి అన్నారు. వీటితోపాటు ఈ సంక్రాంతి నుంచి అతి ముఖ్యమైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి నాలుగు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తుంది అన్నారు. ఈ నాలుగు పథకాల అమలుకు సుమారు 40 నుంచి 45 వేల కోట్ల అధిక భారం రాష్ట్ర ఖజానాపై పడుతుంది అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ముందుకు వెళుతుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు 2000 కోట్లు, రైతు భరోసా కు 19 వేల కోట్లు చొప్పున ఖర్చు చేసుకుంటూ ముందుకు పోతామని తెలిపారు. ఈ నాలుగు కొత్త పథకాల అమలులో ఎక్కడ ఎవరికి సందేహాలు అవసరం లేదని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక, అమలుకు సంబంధించి విధి విధానాలు లోతుగా చర్చించిన తర్వాతే రాష్ట్ర క్యాబినెట్ ప్రకటన చేసిందని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నిటికీ పరిమితి లేకుండా ఎకరాకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాలో జమ చేస్తాం అన్నారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది అన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా, వ్యవసాయ శాఖ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు తీసుకున్న కుటుంబం కనీసం 20 రోజులు పని చేసి ఉండి సెంటు భూమి కూడా లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందుతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సైతం పూర్తిగా అర్హులనే ఎంపిక చేస్తాం అన్నారు. ఇచ్చిన మాట మేరకు దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా రెండు నెలల వ్యవధిలో రైతు రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లోకి 22 వేల కోట్లు జమ చేసినప్పటికీ పెద్దగా ప్రచారం జరగలేదు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల నుంచి అమలు చేయబోయే నాలుగు కొత్త పథకాలకు గ్రామ సభలు ఏర్పాటు చేసి అందరికీ తెలిసే విధంగా పథకాలు అందజేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక, ఖరారు జరుగుతుంది. గ్రామసభల్లోని అర్హులైన వారికి ఈ నాలుగు పథకాల అనుమతి పత్రాలు అధికారులు, ప్రజా ప్రతినిధులు అందజేస్తారు అని తెలిపారు. ప్రభుత్వ జీవో ప్రకారం సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయా లేదా అనేది ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తాయి, ఇందిరమ్మ కమిటీలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలి, సంక్షేమ పథకాల అమలులో వీరు కీలకం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక మండలాన్ని మూడు భాగాలుగా విభజించుకుని గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామ సభ నిర్వహణ సమయంలో మంచి వేదిక, మైక్ సెట్, అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. లబ్ధిదారుల గుర్తింపు, అర్హుల జాబితా అన్నీ కూడా జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదం ఉండాల్సిందే అని తెలిపారు.రైతు రుణమాఫీ పథకం కింద గ్రామంలో లబ్ధి పొందిన రైతుల పేర్లు, వారు పొందిన లబ్ధి నగదు మొత్తం వివరాలను ఒక ఫ్లెక్సీ పై వేసి గ్రామ సెంటర్ లో ప్రదర్శించాలన్నారు. ఇదే తరహాలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు, వారు పొందిన నగదు మొత్తాన్ని అందరికీ కనిపించేలా పెద్ద అక్షరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని. మొత్తం మూడు పథకాలకు సంబంధించి మూడు ఫ్లెక్సీలు, విడివిడిగా పెద్దగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకాల అమలులో కలెక్టర్లకు ఎలాంటి సందేహాలు ఎదురైనా జిల్లా ఇన్చార్జి మంత్రితో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

## ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికి సంక్రాంతి పండగ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో, కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మన దగ్గర ఉన్నదాన్ని నలుగురితో పంచుకోవడమే అసలైన సంక్రాంతి పండగ పరమార్థమని గుర్తు చేసిన మంత్రి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమం, సుపరిపాలన ప్రగతిపథంలో ముందుకు సాగుతున్న తరుణంలో.. ప్రజలంతా స్వేచ్ఛా సౌభాగ్యాలతో సంబురంగా సంక్రాంతిని జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి పండగ తెలంగాణ బిడ్డల జీవితాల్లో కొత్త వెలుగులను ప్రసాదించాలని ఆకాంక్షించిన మంత్రి ప్రజాస్వామ్యబద్ధంగా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాప్రభుత్వానికి దేవుడి ఆశీస్సులు సంపూర్ణంగా ఉండాలని కోరుకుంటున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

## బీర్లకు, బార్లకు ఖర్చు చేస్తున్నారు

● రక్షణనిచ్చే హెల్మెట్ మాత్రం కొనడం లేదు ● ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతను పాటించాలని సూచించిన మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరోప్రతినిధి: కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసాతోత్సవాల్లో స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారలు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలి అన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని వాపోయారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది చనిపోయారు.. మనతో పాటు మనల్ని నమ్ముకున్న వాళ్లు ఉంటారు. అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క తెలిపారు. ఇక, వాహనాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదు.. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయరాదు అని సీతక్క సూచించారు. అలాగే, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వెల్లడించింది. శిరస్త్రం లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మితిమీరి వేగంతో వెళ్లరాదు అని పేర్కొన్నారు. దీంతో పాటు వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని మంత్రి సీతక్క చెప్పారు.

# పేదోడు అయితే చాలు..!

● కులం, మతం చూసి సంక్షేమ పథకం ఇవ్వం ● ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే ● రాబోయే నాలుగు ఏళ్ళల్లో 20 లక్షల ఇళ్లు లక్ష్యం ● ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ ● తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ● కూసుమంచిలో నమూన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కులం లేదు.... మతం లేదు... ఏ పార్టీ అని అడగం.... సంక్షేమం ఇస్తే వచ్చేసారి మా పార్టీకి ఓటు వేయాలనే నిబంధన పెట్టం...కేవలం పేదోడు అయితే చాలు ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హుడేనని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలోని మండల ఆఫీస్ కంప్లెక్స్ లో నిర్మించిన నమూన ఇందిరమ్మ ఇళ్లు ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ఈ ఆనందం ప్రతిరోజు ఇలానే ఉండే విధంగా ఆ దేవుడు వారిని దీవించాలన్నారు. 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఈనాటి తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఇళ్లు పేదలకు కట్టించి ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు.... ఇందిరమ్మ ఇల్లు అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కావాలని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకొని ఒక సంవత్సరం పూర్తయి రెండో సంవత్సరంలోకి వచ్చామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏందో ప్రతి తెలంగాణ బిడ్డకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడు పెద్దలు ఎలా కొల్లగొట్టారో తెలుసని అయినా కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఇచ్చిన ప్రతీ హామీని తెలంగాణ బిడ్డకు ఇస్తూ ఎక్కడా తెలంగాణలో పేదవాడు ఇబ్బంది పడొద్దు అని పేదవాడు కుటుంబం ఆనందంగా ఉండాలని తహతహలాడుతూ ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లమీద ఈ ప్రభుత్వం ఎంత చిత్త శుద్ధితో ఉందో చెప్పడానికి మొదటి విడతగా మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించాలని ఒక దృఢ సంకల్పంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తక్కువలో తక్కువ 3500 ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఉన్నంతవరకు సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. జనవరి 26 నుంచి పేదలు మెచ్చే మరో నాలుగు సంక్షేమ హామీలు అమలు కాబోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఒకటే చెప్పదలుచుకున్నానని తెలంగాణ రాష్ట్రంలో ఉండే పేద వాడి కల నెరవేర్చడం కోసం అర్హులైన ప్రతీ పేదవాళ్ళకి ఈ ఇందిరమ్మ రాజ్యం రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇల్లు కట్టాలని చిత్తశుద్ధితో ఉన్నట్లు చెప్పారు. ఎన్ని ఒడి దూడుకులు ఎన్ని ఇబ్బందులు ఎన్ని కుట్రలు కుతంత్రాలు జరిగిన పేదవాడి ముఖములో ఆనందం చూడటం కోసం పేదవాడి కల నెరవేర్చడం కోసం పేదవాడు కూడా ఒక గూడుని ఏర్పాటు చేయడం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ కి మార్చిన భూములు తప్ప వ్యవసాయానికి యోగ్యమైన ఎన్ని ఎకరాలు ఉన్నా ఆనాటి ప్రభుత్వం సంవత్సరానికి 10000 ఇస్తే ఈనాడు ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా 12 వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అది పది లక్షలా, 15 లక్షల ఎన్ని లక్షలు అనేది కాదు ఎన్ని కార్డులు అయినా ఇస్తామని తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వము చేయని విధంగా భరోసా కార్యక్రమం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ప్రతి సంవత్సరం పన్నెండు వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమాన్ని రెండు విడుతలుగా శ్రీకారం చుట్టబోతున్నమన్నారు. అనంతరం కూసుమంచి మండలంలోని దుబ్బ తండాలో ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్, ఖమ్మం ఆర్డీఓ, హౌసింగ్ ఈ ఈ, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### మందా జగన్నాథం భౌతికకాయానికి

## నివాళులర్పించిన మంత్రి జూపల్లి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: మాజీ ఎంపీ మందా జగన్నాథం భౌతికకాయానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని చంపాపేటలోని మందా జగన్నాథం నివాసంలో ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన మరణం తీరని లోటని మంత్రి జూపల్లి ఆవేదన వ్యక్తం చేసారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వాసిగా ఆయనతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న మందా జగన్నాథం ఆదివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.

# బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పి. కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కౌశిక్ రెడ్డిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కౌశిక్ రెడ్డిని కరీంనగర్ తరలించే అవకాశమున్నట్లు సమాచారం. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో కౌశిక్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొన్నారు. ఆ క్రమంలో సంజయ్‌ను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి చేసిన కామెంట్ల కారణంగా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అది కాస్తా స్వల్ప ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు చేశారు. తనపై కౌశిక్‌రెడ్డి దుర్భాషలాడారని ఆ ఫిర్యాదులో సంజయ్ స్పష్టం చేశారు. తాను ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న సమయంలో కౌశిక్ రెడ్డి.. తనను అడ్డుకున్నారని చెప్పారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ను ఎమ్మెల్యే సంజయ్ కోరారు. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై రౌడీ షీట్ ఒపెన్ చేయనున్నట్లు ఓ చర్చ అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదీకాక గత కొంత కాలంగా కౌశిక్ రెడ్డి వివాదాలకు కేరాఫ్ అడ్రస్?గా మారిపోయారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు సవాళ్లు విసురుతోన్నారు. ఇటీవల ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో చోటు చేసుకున్న వివాదాన్ని తీవ్ర స్థాయికి తీసుకెళ్లారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అయిన ఆయనపై మండిపడ్డారు. దీంతో అరికెపూడి గాంధీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తిరుమల లడ్డూ కౌంటర్‌లో అగ్నిప్రమాదం

● 47వ కౌంటర్‌లో హఠాత్తుగా చెలరేగిన మంటలు

తిరుపతి: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలోని ఓ లడ్డూ కౌంటర్ లో ఈరోజు అగ్నిప్రమాదం సంభవించింది. 47వ కౌంటర్ లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో, భక్తులు భయంతో కౌంటర్ నుంచి బయటకు పరుగెత్తారు. వెంటనే స్పందించిన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సిబ్బంది అప్రమత్తత వల్ల పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో పెద్దగా నష్టం జరగలేదని చెప్పారు.



# ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీల పాలిట శాపం

● సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఈడబ్ల్యూఎస్ పరిధి దాటకుండా ఉన్నాయి ● అయినా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ● తెలంగాణలో గత ప్రభుత్వ తీరుతో నష్టం ● జనాభా 10% లేకున్నా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు ● ఐదు శాతం జనాభా ఉంటే 10% ఎలా అమలు చేస్తారు? ● అందుకే బీసీ ఇంటలెక్చువల్ ఫోరం తరపన పోరాటం ● కలిసివచ్చే అన్ని శక్తులను ఏకం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం ● బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

తెలంగాణ బ్యూరోప్రతినిధి :తెలంగాణ రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీలకు పాలిట శాపంగా తయారైందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు ఆర్టికల్ 15(4), 16(4) ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాలకు మిగతా వర్గాలలో పాటు సమానంగా ఎదగడానికి, అవకాశాలు పొందడానికి కల్పించబడిన రక్షణలు. ఇవి రాజ్యాంగం ప్రవచించిన సామాజిక న్యాయం సమానత్వ సాధనలో కీలక సాధనములు అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని సామాజిక వ్యవస్థ ముఖ్యంగా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ భారత దేశంలో నే ఉంది. వేల సంవత్సరాలుగా అణగత్రొక్క బడిన ఈ వర్గాలు మిగతా వర్గాలతో సమానంగా పోటీ పడటం సాధ్యం కాదు కాబట్టి ఈ రిజర్వేషన్ల సౌకర్యం కల్పించడం జరిగింది. కాని రాజ్యాంగ నిర్మాతలు ఎక్కడ కూడా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే నిబంధనలను రాజ్యాంగంలో పొందుపరచలేదు. మండల్ కమిషన్ రిపోర్టు ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబిసిలకు రిజర్వేషన్లు కల్పించే సందర్భంలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు %ూ.వీ% 36012/31/90 ఈ ఎస్ టి (ఎస్ సి టి) 25.09.1991 ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కోటా తీసుకువచ్చారు. మండల్ కమిషన్ రిపోర్టును విచారించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ (ఇంద్ర సహాని) ధర్మాసనంలోని 9 మంది న్యాయమూర్తులలో 8 మంది న్యాయమూర్తులు ఆర్థికపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమని 16.11.1992 తేదీన కొట్టివేసినట్లు తెలిపారు. కాని అగ్రవర్ణాలు తమ పట్టు విడవలేదు. ఎలాగైనా తమ వారికి రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో 10-7-2006 న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి రిటైర్డ్ మేజర్ జనరల్ సిన్హా కమిటీ వేయించినారు. ఆ కమిటీ జనరల్ కేటగిరి వారి జనాభా 34 శాతం అని అంచనా వేసి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2010లో సిఫారసు చేసింది. కానీ నాటి ప్రభుత్వం ఆ రిపోర్టు ను పక్కన పెట్టినారు. కాని వడ్డించే వాడు మనవాడు అయితే మనం అడగవలసిన అవసరం లేదు' అనె సామెతను నిజం చేస్తూ 2019లో బిజెపి ప్రభుత్వం ఎవరు అడగకుండానే 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 103వ రాజ్యాంగ సవరణ చట్టం చేసి ఆర్టికల్ 15 (6) మరియు 16 (6) లను రాజ్యాంగంలో చేర్చి, ఆఫీస్ మెమొరండం 20013/01/2018/బీసీ11 తేదీ 17-01-2019 ద్వార 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు జనవరి 19, 2019 నుంచి దేశవ్యాప్తంగ కేంద్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగాలలో అమలు చేస్తుంది. ఇది రాజ్యాంగంలోని 15(4) మరియు 16(4) లో లేని జనరల్ కేటగిరీ వర్గాలకు మాత్రమే వర్తిస్తుంది.

దీని అమలు రాష్ట్రాలకు వాటి వాటి విచక్షణకు వదిలివేయటం జరిగింది. ఈ చట్ట సవరణలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గరిష్టంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చును అనే విషయం పొందుపరిచింది. కానీ కచ్చితంగా 10 శాతం ఇవ్వాలనే నిబంధన ఏమీ లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీ.ఓ. 33 ద్వారా 19.03.2021 నుంచి 10 శాతం రిజర్వేషన్లు విద్యా ,ఉద్యోగాలలో అమలు చేస్తుందన్నారు. 1961 లో బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50% మించకూడదని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును దృష్టిలో పెట్టుకొని మండల కమిషన్ ఓబిసిలకు 27% రిజర్వేషన్లు సిఫారసు చేసింది. అప్పటికే ఎస్సీలకు 15 శాతం మరియు ఎస్టీలకు 7.5% వారి జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్లు కల్పించబడినవి .వెరసి 15%౦7.5%౦27.5= 49.5% .అంటే 50% కు దరిదాపు.ఇదే 50% సీలింగు ను మండల్ కేసు తీర్పు లో (ఇంద్రసహానికేసు లో)1992లో తిరిగి పునరుద్ఘాటించిందని తెలిపారు. కోర్టులు ఓబిసిల రిజర్వేషన్ల విషయంలో చాలా సందర్భాలలో ప్రతి కూలంగా తీర్పులు ఇచ్చాయి .మండల్ కమిషన్ అమలు ఆఫీస్ ఆర్డర్ 36012/31/90 ఈజీటీటి తేదీ 13.08.1990 ,కోర్టు స్టే వలన తీర్పు వచ్చేవరకు అంటే 16.11.92 వరకు నిలిపి వేయబడినది. తర్వాత 08.09.1993 నుండి అమలులో కి వచ్చింది .అలాగే కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో రిజర్వేషన్స్ 2006 లో 93 వ రాజ్యంగ సవరణ ద్వారా తీసుకొచ్చి నప్పటికిని కోర్ట్ స్టే ద్వారా 2008 వరకు అమలు కు నోచు కోలేదు.అలాగే బిసి ల జనాభా లెక్కలు లేవని ,శాస్త్రయుక్త లెక్కలు కావాలనే కోర్టులు ఎలాంటి శాస్త్ర యుక్త లెక్కలు లేని మేజర్ జనరల్ సిన్హా కమిటీ రిపోర్ట్ ను సుప్రీం కోర్ట్ అంగీకరించింది. అదేవిధంగా ఆర్థికపరమైన రిజర్వేషన్లు చట్ట పరమేనని జనహిత అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు నవంబర్ 7, 2022లో సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులలో 3-2తో తీర్పు ఇవ్వడము జరిగింది. కోర్టులు ప్రతిసారి ఓబీసీ రిజర్వేషన్లపై స్టేలు ఇవ్వడం, కొన్ని సందర్భాలలో కొట్టివేయడం మనం చూడడం జరిగింది. కానీ 2019 ఆర్థికంగా బలహీనులు అనే అంశంపై తెచ్చిన రిజర్వేషన్లపై ఏ కోర్టు ఒక్కరోజు కూడా స్టే ఇవ్వలేదు. మీదు మిక్కిలి 50 శాతం సీలింగును అతిక్రమించి నప్పటికిని 10% అదనంగా ఇవ్వడం కూడా సబబే అని తీర్పు ఇవ్వడం జరిగింది. ఎన్నో సందర్భాలలో ఓబీసీలకు 50 శాతం సీలింగును దాటి రిజర్వేషన్లు తీసుకువస్తే కోర్టులు అది రాజ్యాంగ విరుద్ధం అని కొట్టివేయడం జరిగింది.ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము లొ మురలిదర్ రావు కమిషన్ బీసీ రిజర్వేషన్ ను 25% నుంచి 44% పెంచాలని రిపోర్ట్ ఇవ్వగా ,ఆ రిపోర్ట్ ను ఎన్టీఆర్ 1986 లో అమలు పరుస్తూ జీవో నెంబర్166,167,168 ది 15-07-1986 ఇవ్వగా ఇట్టి జీవో లను హై కోర్టు కొట్టివేయడం జరిగింది .అలాగే ఈ మధ్య పాట్నా హై కోర్ట్ కూడా బీహార్ లొ కులగణన చేసిన తర్వాత 65%కు పెంచిన బిసి ల రిజర్వేషన్లకు కూడా ఇదే గతి పట్టించిందని తెలిపారు. కానీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విషయంలో సుప్రీం కోర్టు తను గతంలో ఇచ్చిన రెండు తీర్పులను వెనక్కి తీసుకుంది. ఒకటి ఆర్థికంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదనే అంశము, రెండవది 50% సీలింగ్ను దాటి అదనంగా 10 శాతంనకు అనుమతి ఇవ్వటం.



ఈ తీర్పును ఈ మధ్య మాజీ సుప్రీమ్ కోర్ట్ సీనియర్ రిటైర్డ్ న్యాయమూర్తి ఆర్ ఎఫ్ రిమన్ గారు తీవ్రముగా తప్పు పట్టినారు ఇక పోతే ఆర్థికము గ వెనుక బడిన రిజర్వేషన్ ల విషయములో బిజెపి కూటమి ప్రభుత్వం ఎంత స్పీడ్ గా వ్యవరించిందంటే ఎవ్వరు ఊహించనంత.124 వ రాజ్యాంగ సవరణ బిల్లు ను 8-1-2019 లో లోక సభలో ప్రవేశ పెట్టడం,అదే రోజు ఆమోదించడం,మరుసటి రోజు 09-01-2019 న రాజ్యసభ లో ప్రవేశ పెట్టడం,అదే రోజు పాస్ చేయడం,రాష్ట్రపతి 12 వ తేదిన ఆమోదం తెలపటం,103 వ రాజ్యాంగ సవరణ చట్టమ చేయడము,17 వ తేదీన అమలు ఉత్తర్వులు,19 నుంచి దేశవ్యాప్తంగా అమలు ఈడబ్ల్యూఎస్ లు అంటే ఎంత ప్రేమో అన్ని పార్టీ లకు ఒక్క డీఎంకె,సమాజ్ వాది, ఆర్జెడి లాంటి కొన్ని బిసి పార్టీ లకు తప్ప. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలో (తమిళనాడు చత్తీస్ ఘడ్ తప్ప) ఆర్థికపరమైన రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. అస్సాం విద్యారంగంలో ఇస్తుంది కాని విద్యార్థుల ప్రతిఘటన మేరకు ఉద్యోగ రంగంలో నవంబర్ 2022 నుంచి అమలు చేయటం నిలిపివేసింది. చత్తీస్ ఘడ్ నాలుగు శాతం రిజర్వేషన్లు చేసింది కానీ కొన్ని కారణాల వలన ఆపివేసింది. కర్ణాటక నాలుగు శాతం 'బి' కేటగిరి ముస్లిం కోటాను ఈడబ్ల్యూఎస్ కు మార్చి ఫిబ్రవరి 2023 నుంచి అమలు చేస్తుంది. కేరళ లొ నాయర్ కమిటీ రిపోర్ట్ ద్వారా 10 శాతం ఇ డబ్ల్యు యెస్ అమలు చేస్తుంది. కానీ తెలంగాణ ఏ కమిటీ రిపోర్టు లేకుండానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తుంది. వాస్తవానికి మేజర్ సిన్హా కమిటీ జనరల్ కేటగిరి జనాభా 34% ఉంటారని తప్పుగా అంచనా వేసింది. ఈ దేశంలో 2011 జనాభా లెక్కల (సెన్సెస్) ప్రకారం ఎస్సీలు 16.6%, ఎస్టీలు 8.6%, ముస్లింలు 14.2% అదే విధము గా మండల్ లెక్కల ప్రకారం 52 శాతం ఓబీసీలు. 43.8% హిందూవులు, 8.4% ముస్లింలు, (వాస్తవానికి మండల్ నివేదిక తర్వాత చాలా కులాలు ఓబీసీలలో కలపబడినవి. ఇంకా ఈ శాతం పెరుగుతుంది.) ఇతరులు (16.6౦8.6౦52=77.2) కేవలం 22.8% ఇందులో కూడా చాలా కులాలు ఓబీసీలలో కలపబడినవి. ఈరోజు దేశంలో అన్ని కులాల జన గణన చేసినట్లయితే జనరల్ కేటగిరి జనాభా 15%నకు మించి ఉండదు. అందులో ఈ డబ్ల్యూ ఎస్ జనాభా ఐదు శాతం మునకు మించి ఉండదు. ఉదాహరణకు 2024 సివిల్స్ లో జనరల్ కేటగిరీ కట్ ఆఫ్ 75.4%, ఓబీసీ 74.75, ఈ డబ్లూ ఎస్ 68.02 ఎస్సీ 59.25, ఎస్టీ 47.82. తెలంగాణ లొ కూడా సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఎస్సీ 18%ఎస్టీ 10%బిసి 51% ముస్లింలు 13% లొ బీసీ లు సుమారు 10%(అందులొ బీసీ లో 14 కులాలు, బిసి 4 కులాలు బీసీ లో రెండు కులాలు వెరసి సుమారు 10% బీసీ,) ,మతమార్పిడి క్రిస్టియన్స్,సిక్కులు బుద్దులు,జైన్స్ లు సుమారు 1% ఇక పోతే ఓసీ లు 10 % మాత్రమే అందులో ఈడబ్ల్యూఎస్ 5 % మించి ఉండరు.

ఈ విషయం తెలిసి కూడా నాటి ప్రభుత్వము తమ అగ్ర వర్ణ వైఖరి తో 10% రిజర్వేషన్స్ తీసుకువచ్చి బిసి ల నోట్లో మట్టి కొట్టింది.అందుకే ఏ రిక్రూట్మెంట్ లో చూసిన ఈ డబ్ల్యూ ఎస్ కట్ ఆఫ్ మార్కులు బీసీ,ఎస్సీ,ఎస్టీ ల కంటే తక్కువ. ఒకవైపు కేంద్రం, చాలా రాష్ట్రాలు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు మొత్తం పోస్టులపై అమలు చేస్తుంటే మధ్యప్రదేశ్ ప్రభుత్వం జనరల్ కేటగిరి లోని పోస్టులపై అమలు చేస్తుంది. ఈ విషయమును జబల్ పూర్ హైకోర్టు కేసు డబ్ల్యూ పి నంబర్. 9692 ఆఫ్ 2022 తేదీ: 30.04.2024 తీర్పు లొ ధృవీకరించింది. తెలంగాణ హైకోర్టు కూడా గ్రూప్ 1 నోటిఫికేషన్ కు సంబంధించి డబ్ల్యూ ప నంబర్.16585 %శీట% 2024 తేదీ 28.06.2024 ద్వారా తుది తీర్పుకు లోబడి గ్రూపు 1 నియామకాలు చేయాలని స్పష్టం చేసింది. నిజానికి తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ ప్రజలు ఐదు శాతం కూడా ఉండరు. కానీ వారికి 10 శాతం అమలు చేస్తున్నారు ఇది ఓబిసిలను, ఎస్సీ, ఎస్టీలను తీవ్ర అన్యాయానికి గురిచేస్తుంది. అన్ని రిక్రూట్మెంట్ లలో వారి కటాఫ్ మార్కులు ఓబిసిల కంటే చాలా చాలా తక్కువ. అలాగే ఈ డబ్ల్యూ ఎస్ అర్హతలను నిర్ధారించటానికి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వ జీవో 244 తేది 24-8-2021 వార్షిక ఆదాయం కేవలము 8 లక్షల రూపాయలు అని నిర్వచించి ,5 ఎకరాల భూమి ఇతర కేంద్ర ప్రభుత్వ నిబంధనలను ప్రక్కన పెట్టినది.అలాగే అమలు పరచడములో కూడా అనేక అవకతవకలు జరిగి కుప్పలు తెప్పలుగా దొంగ ,తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టిస్తున్నారు.వీటిపై విచారణ జరపాలి. దీని వలన నిజమైన ఈడబ్ల్యూఎస్ ప్రజలు కూడా అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా బిసి సంఘాలు ఈ సమస్య తీవ్రత ను తెలుసు కొని పెద్ద ఎత్తున ఉద్యమించి రాష్ట్ర ప్రభుత్వంను ఈ రిజర్వేషన్స్ రద్దు చేసేలా చూడాలి లేదా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 2024 కుల సర్వే ఆధారంగా పునః పరిశీలించి మధ్య ప్రదేశ్ ప్రభుత్వం లాగా జనరల్ కేటగిరి సీట్లకే రిజర్వేషన్లు వర్తింప చేసే లాగ చూడాలి.కేంద్ర ప్రభుత్వము కూడా త్వరలో జరగ బోయే సెన్సస్ లొ కులగణన చేసి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేసి ఓ బి సి లకు తగు న్యాయం చేయాలి ,లేనట్లయితే ఓబిసిలు మరోసారి ఈ స్వతంత్ర భారతంలో మోసపోయిన ప్రజలు గా చరిత్ర లో మిగిలి పోతారని చెప్పారు.

# తెలుగు లోగిళ్లలోకి సంప్రదాయ సంక్రాంతి వచ్చేసింది



## రంగవల్లుల నడమ తెలుగువాకిళ్లు

**సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన రోజే సంక్రాంతి. 'వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి%ౌ% వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి%ౌ%' అంటూ గ్రామీణులు అమితోత్సాహంతో ఈ పండుగ రోజుల్లో పాడుకుంటారు. బొమ్మల పండుగ, ముగ్గుల పండుగ, పంటల పండుగ, పశువుల పండుగ, పెద్దల పండుగ, పెద్ద పండుగ%ౌ% ఇలా సంక్రాంతికి ఎన్నో పేర్లు. వీటన్నిటికన్నా సంక్రాంతి అనగానే మనకు గుర్తుకు వచ్చేవి ప్రతి ఇంటి ముంగిటా మెరిసిపోయే ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల భజనలు, గంగిరెద్దుల ఆటలు, భోగిమంటలు, అరిసెలు, బొమ్మల కొలువు. ఇలా ఎన్నో హంగులద్దుకుని తెలుగు వాకిళ్లలోకి వచ్చేసింది మన సంక్రాంతి.**

సంక్రాంతి దక్షిణ భారతదేశంలో అతిపెద్ద పండుగ. ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండుగ ఇది. ఈ పండుగ మూడు రోజుల పాటూ నిర్వహించుకుంటారని అనుకుంటారు. భోగీ, సంక్రాంతి, కనుమ మాత్రమే లెక్కిస్తారు. నిజానికి ఈ పండుగ నాలుగు రోజుల పాటూ నిర్వహించుకోవాలి. ఈ పండుగలో చాలా చోట్ల ఇంద్రుడిని, సూర్యభగవానుడిని పూజిస్తారు. వీరి వల్లే పంటలు పండుతాయని భావిస్తారు. అందుకే పాలు పొంగించి, కొత్త బియ్యంతో పాయసం వండి సూర్యుడికి సమర్పిస్తారు. తమిళనాడులో ఈ పండుగను నాలుగు రోజుల పాటూ నిర్వహిస్తారు.

### ప్రకృతి మార్పులకు సంకేతం

సంక్రాంతి పుష్యమాసంలో వస్తుంది. వరుస ప్రకారం పుష్యమాసం సంవత్సరంలో పదో మాసం. ఈ నెలలో పూసగుచ్చడానికి కూడా పొద్దు ఉండదని నానుడి. చల్లచల్లని గాలులు మేనును స్పృశించడం, మంచుజల్లులు పుడమిని ముద్దాడటం%ౌ% ఇవన్నీ పుష్య సోయగాలే. పుష్య అంటే పోషణ శక్తి కలదని అర్థం. పుష్య పూర్ణిమ నాటి రాత్రి సిద్ధాంతులు దూదిని మంచులో ముంచి ఆ మర్నాడు దాన్ని పిండి ఆ ప్రక్రియలో వచ్చిన నీటి చినుకుల్ని బట్టి వర్ష నిర్ణయం చేసేవారని చెబుతారు. ఎన్ని చుక్కలు జారిపడితే అన్ని కుంచాల వాన కురుస్తుందని అంచనా వేసేవారు. ప్రాచీన కాలంలో ప్రకృతి పరిశీలన ద్వారా మనిషి సాధించిన వైజ్ఞానిక ప్రగతికి ఇది ప్రతీకగా కనిపిస్తుంది. సంక్రాంతి అంటే 'చేరుట' అని అర్థం కూడా ఉంది. సంక్రమణంలో భాగంగా పుష్య మాసంలో సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ పర్వకాలమే సంక్రాంతి. ఇది మూడు రోజుల పర్వం. పంట చేతికి అందటం వల్ల రైతులు ఆనందోత్సాహాలతో గడిపే సమయం ఇది. తమకు పాడి వంటలనిచ్చిన పండుగగా రైతులు సంక్రాంతిని కృతజ్ఞతా పూర్వకంగా జరుపుకొంటారు. పంటను చేతికిచ్చిన భగవంతుడికి, పొలాల్ని దున్నే ఎద్దులకు ఈ పండుగ ద్వారా ధన్యవాదాలు తెలుపుతారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వాల్లోని అంతరార్థం ఇదే.





### మొదటి రోజు: భోగీ పొంగల్

ఈ సంవత్సరం జనవరి 13 న భోగి వచ్చింది. దీన్ని భోగి పొంగల్ అంటారు. ఇది సంక్రాంతి వేడుకల ప్రారంభాన్ని సూచిస్తుంది. తమ వ్యవసాయ భూమిని సారవంతం చేసేందుకు కృతజ్ఞతగా మొదటి రోజు వర్షాధిపతి ఇంద్రుడిని పూజిస్తారు. పంజాబ్ లో లోహ్రీ పండుగ మాదిరిగానే, ఈ రోజు కార్యక్రమాలు భోగి మంటల చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. ఈ రోజున ప్రజలు సూర్యభగవానుడితో పాటు పంటలు పండించడానికి ఉపయోగించే వ్యవసాయ పనిముట్లను పూజిస్తారు.

### రెండవ రోజు: సూర్య పొంగల్

ఇక రెండో రోజు సూర్య పొంగల్ గా పండుగ చేసుకుంటారు. ఈ వేడుకలో ఇదే ప్రధానమైన రోజు. దీన్నే మిగతా చోట్ల సంక్రాంతిని నిర్వహించుకుంటారు. తాజా పాలను మరిగించి పొంగేలా చేస్తారు. తీపి వంటకం పాయసం వండుతారు. చెరకు, కొబ్బరి, అరటి వంటి ఇతర వస్తువులను కూడా సూర్యభగవానుడికి సమర్పిస్తారు.

### మూడో రోజు: మట్టు పొంగల్

గోవుల ఆరాధనకు అంకితమైనది మూడో రోజు. దీన్ని మట్టు పొంగల్ అని పిలుస్తారు. ఆవులు, ఎద్దులు వంటి పశువులను ఈ రోజున పూచిస్తారు. ఎందుకంటే అవి రైతులకు ఇవి ఎంతో సాయం చేస్తాయి. పశువులను స్నానం చేయించివాటిని అందంగా అలంకరిస్తారు. వాటి కొమ్ములకు రంగులు వేసి పూలదండలతో అలంకరిస్తారు.

### నాలుగో రోజు: కానుం పొంగల్

ఇక నాలుగో రోజు పండుగలో చివరి రోజు. దీన్ని కానుమ్ పొంగల్ అని పిలుస్తారు. ఈ రోజున, ప్రజలు సూర్య భగవానుడిని ఆరాధిస్తారు. జీవితంలో మాధుర్యానికి, ఆనందానికి ప్రతీకగా చెరకును దేవతలకు నైవేద్యంగా పెడతారు. ఈ రోజు చాలా వేడుకగా బంధుమిత్రులను కలుస్తారు. కలిసి ఆడిపాడతారు.

ఇక మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే భోగీ, సంక్రాంతి, కనుమ పండుగలను నిర్వహించుకుంటారు. నాలుగో రోజు ముక్కనుమ అంటారు. కానీ దీన్ని పెద్ద పట్టించుకోరు. మొదటి మూడు రోజులకే ఎక్కువ ప్రాధాన్యత ఉంది. సంక్రాంతి రోజు ఎలాంటి మాంసాహారాన్ని ముట్టుకోరు. కానీ కనుమ రోజు పూర్తిగా మాంసాహారాన్నే తినేందుకు ఇష్టపడతారు.

ఆంధ్రప్రదేశ్ లో గోదావరి జిల్లాల్లో ఎంతో వేడుకగా సంక్రాంతి పండుగ జరుగుతుంది. ఎంతో మంది పర్యాటకులు అక్కడ జరిగే కోడిపందేలు చూసేందుకు తరలి వెళతారు. తమిళనాడులో కూడా జల్లికట్టు జరిగేది సంక్రాంతికే.

– జూలూరి భార్గవి సరస్వతి
8790496969

# జగ్గన తోట ప్రభల తీర్థం

## అదొక ప్రత్యేకమైన వేడుక. విశేషమైన పండగ సంబరం

కోనసీమ వాసులకి జగ్గన్న తోట ప్రభల తీర్థం పంటపొలాల మధ్య జరిగే తిరునాళ్ళ బంధం. ప్రభల తీర్థానికీ మా కుటుంబానికీ తరతరాలుగా పెనవేసుకున్న ఒక అమూల్యమైన అనుబంధం ముడిపడుంది. అది పదిమందితో పంచుకోవాలన్నదే నా వుద్దేశ్యం.

కోనసీమ చుట్టుపక్కనున్న సుమారు 90 గ్రామాల నుండీ ప్రజలు ఈ ప్రభలతీర్థంలో పాలుపంచుకుంటారు. అమలాపురానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న మొసలపల్లి-ఇరుసుమండ గ్రామాల సరిహద్దులో ఉన్న ఏడెకరాల కొబ్బరితోటలో ఈ ప్రభల తీర్థం జరుగుతుంది. ఈ తోటని జగ్గన్న తోటగా పిలుస్తారు. ఇక్కడ ఏ గుడీ ఉండదు. దేవునికి సంబంధించిన చిహ్నాలూ కనిపించవు. కేవలం దుక్కి దున్నిన కొబ్బరితోట. రైతులు నమ్మే భూ మండపంలో జరిగే ప్రకృతి వేడుక ఈ ప్రభల తీర్థం.

శివుని వాహనంగా భావించబడే వీరభద్రునిగా కోనసీమ వాసులు ఈ ప్రభలని భావిస్తారు. చుట్టుపక్కల గ్రామాల్లోని పరమేశ్వర రూపాలని ఈ ప్రభలని అలంకరించి మేళ తాళాలతో "అహెూం- ఓహెూం" అని తలస్తూ, తమ భుజ స్కంధాలపై మోస్తూ ఊరేగింపుగా ఈ జగ్గన్న తోటకి తీసుకొస్తారు. ఈ ప్రభలని వెదురు కర్రలతో చేసి, రంగు రంగుల వస్త్రాలతో, పూలతో అలంకరించీ, వేదమంత్రాల మధ్యా గంటలు మ్రోగిస్తూ మోసుకు వస్తారు. కుల మతాలకతీతంగా ఈ ప్రభలని మోయడం పరమేశ్వర సేవగా భక్తులు తలుస్తారు. సుమారు నాలుగొందల ఏళ్ళపైగా ఈ జగ్గన్నతోట తీర్థం జరుగుతోందని అంటారు. నాలుగొందల ఏళ్ళగా జరుగుతోందన్నది చెప్పలేంగానీ సుమారు వందేళ్ళగా ఖచ్చితంగా జరుగుతోందని చెప్పగలను. దానికి మా కుటుంబమే ఒక పెద్ద ఆధారం. ఈ ప్రభల తీర్థం గురించి చదివాకా ఎందుకోనన్నది అందరికీ అర్థమవుతుంది. ఈ ప్రభల తీర్థానికొక పురాణ గాథ కూడా వుంది. మొసలపల్లి గ్రామంలో ఉన్న భోగేశ్వర స్వామి వారి ఆహ్వానంపై చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న పరమేశ్వర ప్రతీకలైన ప్రభలు తరలివస్తాయనీ, లోక కళ్యాణార్థమైవారందరూ ఇక్కడ కలుస్తారని ప్రజల విశ్వాసం. దీన్ని ఏకాదశ రుద్రసమావేశంగా ప్రజలు భావిస్తారు. ఈ ప్రభల తీర్థానికి జగ్గన్నతోట ప్రభల తీర్థమన్న పేరురావడానికీ వేరొక కథ చెబుతారు. మొసలపల్లి గ్రామ సమీపంలో విథల జగ్గన్న అనే ఒక ఏక సంధాగ్రాహి ఉండేవాడట. ఆ గ్రామాన్నానుకుని ప్రవహించే కౌశికలో స్నానం చేసీ, పూజాపునస్కారాలు ముగించుకొని అక్కడే ఉన్న మర్రి చెట్టుకింద భోజనం చెసేవాడట. అలా చేస్తూ ఈ చెట్టునానుకున్న అమ్మ వారిని మైల పరుస్తున్నాడని భావించీ కొంతమంది స్థానికులు నిజాం నవాబు ప్రతినిధులకి ఫిర్యాదు చేస్తే వాళ్ళు ఈయన్ని అడ్డుకున్నారట. ఈ సందర్భంలో అందిరికీ పరిచయమున్న ఈ జగ్గన్న నిజాం నవాబుని కలిస్తే, జగ్గన్న పాండిత్యాన్ని చూసి మెచ్చుకొని ఆ మర్రిచెట్టుతో పాటు ఆ చుట్టుపక్కల ఉన్న నాలుగువందల ఎకరాలు బహుమానంగా రాసిచ్చారట. తనపై ప్రజలు ఫిర్యాదు చేయబట్టే తనకీ భూమి లభించింది కాబట్టి వారికోసమే ఈ ప్రభల తీర్థం జరిపాడనీ అంటారు. దేవుడికీ గుళ్ళూ గోపురాలూ అవసరం లేదనీ, మైలా మాపూ దేవుడికుండవనీ పదిమందికీ చెప్పడంకోసం ఈ ప్రభలపై దేవుణ్ణి ఎవరైనా మోసుకు రావచ్చని చెప్పే నిమిత్తమై ఈ తీర్థం మొదలయ్యిందనీ అంటారు. ఈ ప్రభలు ప్రజలు నడిచే దారంట రావు. రాళ్ళూ, రప్పలూ తోసుకుంటూ, గోతులనూ, కుప్పలనూ దాటుకుంటూ పొలాల మధ్యగా ఈ ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. చుట్టు పక్కలగ్రామాలనుండీ ప్రభలు మోసుకు రావడమొక్కటే దీని ప్రత్యేకత కాదు. ఈ తీర్థానికి మరొక వేశేషం కూడా వుంది. అదేమిటంటే పాలగుమ్మి పక్కనే ఉన్న గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామ ప్రభలు పీకల లోతు కౌశిక దాటుకుంటూ, పొలాల మధ్యనుండి వస్తాయి. ఈ ప్రభలు కౌశిక దాటడం చూడ్డం కోసం వేలాది మంది తరలి వస్తారు. ఒక్కసారి ఎత్తేకా ఈ ప్రభలు క్రిందకి దింపకూడదు. మోసేటప్పుడు నేలని తాకించకూడదు. కౌశిక దాటేటప్పుడు ప్రభ ఏ మాత్రం తడవ కూడదు. నీళ్ళ చుక్క కూడా ప్రభ మీదా, పైనున్న దేవుడి మీదా పడకూడదు. ఇవి మోయడానికి పాతిక మంది వ్యక్తులు సరిపడ్డా, కౌశిక దాటించడానికి మాత్రం నలభైమంది పైగా ఉంటారు. ఎంతో ఏకాగ్రతతో ఏ మాత్రం కంగారు లేకుండా జాగ్రత్తగా కౌశిక దాటించి జగ్గన తోట తీర్థ ప్రదేశానికి చేరుస్తారు. తీర్థమయ్యాక వచ్చిన దారినే తిరిగి ప్రభలని ఆయా గ్రామాలకి తీసుకెళతారు. ఈ ప్రభలు ఎంతో బరువున్నా కౌశిక దాటించేటప్పుడు అవలీలగా దాటించడం మాత్రం దైవానుగ్రమే అంటారు అది మోసే వాళ్ళు. ఈ కౌశిక దాటించడం మాత్రం చూసి తీరాల్సిన ఘట్టం. గంగలకుర్రూ, అగ్రహారం ప్రభపై చెన్నమల్లేశ్వర స్వామీ, వీరేశ్వర స్వామీ విగ్రహాలని అలంకరిస్తారు.



## విరాట్‌కు ఆ మ్యాచ్ గుర్తు చేస్తే సరి

### మెగా టోర్నీ పై షోయబ్ అక్తర్

ఫామ్తో ఇబ్బంది పడుతోన్న విరాట్ కోహ్లీ హ ఛాంపియన్స్ ట్రోఫీలో చెలరేగాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ టోర్నీ ప్రారంభం కానుంది. భారత్ తన తొలి మ్యాచ్ను పాకిస్థాన్తో దుబాయ్ వేదికగా ఫిబ్రవరి 23న ఆడనుంది. ఈ క్రమంలో పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ మళ్లీ ఫామ్లోకి రావాలంటే.. పాక్పై మెల్బోర్న్ ఇన్నింగ్స్ను గుర్తు చేస్తే సరిపోతుందని వ్యాఖ్యానించాడు. అదే అతడికి మేలుకొలుపు అవుతుందని తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2022 ఎడిషన్లో చివరి బంతి వరకూ క్రీజ్లో ఉండి పాక్పై భారత్ను గెలిపించాడు. ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే ఫార్మాట్లో జరగనుంది. "మీరు విరాట్ కోహ్లీలోని బ్యాటర్ను నిద్రలేపాలంటే.. పెద్దగా కష్టపడక్కర్లేదు. పాకిస్థాన్తో మెల్బోర్న్ వేదికగా ఆడిన మ్యాచ్ను గుర్తు చేస్తే చాలు. అతడు ఆ మ్యాచ్లో చెలరేగిపోయాడు. చివరి వరకూ ఉండి టీమ్ఇండియాను గెలిపించాడు. ఇప్పుడు పాకిస్థాన్ తరఫున బాబర్ అజామ్ ఆ పాత్ర పోషిస్తాడని అనుకుంటున్నా. ఓపెనర్ సైమ్ అయుబ్ గాయపడటం దురదృష్టకరమే. ఫఖర్ జమాన్తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభిస్తాడని భావించా. వారిద్దరి ఓపెనింగ్ విధ్వంసంగా ఉంటుంది. భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్లో ఎవరు గెలుస్తారని చెప్పడం కష్టమే. ఇరు జట్లూ ఫేవరెట్లే. దుబాయ్ వేదికగా ఈ మ్యాచ్ కావడంతో మరింత ఉత్కంఠగా మారనుంది. అయితే, 2021 టీ20 ప్రపంచకప్లో పాక్ పది వికెట్ల తేడాతో భారత్పై గెలిచింది. కాబట్టి, ఈసారి కూడా మేం గెలవాలని ఆశిస్తున్నా. అయితే, టీమ్ఇండియా విషయంలో ఏమాత్రం నిర్లిప్తత చూపించినా భారీ మూల్యం ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని అక్తర్ తెలిపాడు.



## భారత క్రికెట్ బోర్డులో కీలక మార్పులు...



భారత క్రికెట్ బోర్డు కొత్త సెక్రటరీగా దేవజిత్ సైకియా బాధ్యతలు తీసుకున్నారు. ఐదేళ్లుగా ఈ పొజిషన్లో బాధ్యతలు నిర్వహించిన జై షా, గత ఏడాది డిసెంబర్లో ఐసీసీ ప్రెసిడెంట్గా బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఖాళీ అయిన బీసీసీఐ సెక్రటరీ పొజిషన్లో దేవజిత్ సైకియా బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది బీసీసీఐ.. జనవరి 12న బీసీసీఐ హెడ్ క్వార్టర్స్లో జరిగిన స్పెషల్ జనరల్ మీటింగ్లో సెక్రటరీ పొజిషన్ కోసం ఎలక్షన్ జరిగింది. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా దేజిత్ సైకియాకి బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు బోర్డు సభ్యులు..

అలాగే బీసీసీఐ గౌరవ ట్రెజరర్గా ప్రభ్తేజ్ సింగ్ భాటియాకి బాధ్యతలు అప్పగించింది బీసీసీఐ. ఈ ఇద్దరూ ఇప్పటికే బాధ్యతలు తీసుకున్నారు. జై షా, బీసీసీఐ సెక్రటరీగా ఉన్న సమయంలో ఆశీష్ శేలర్, ట్రెజరర్గా ఉండేవాడు. బీసీసీఐ సెక్రటరీగా, ట్రెజరర్గా బాధ్యతలు తీసుకున్న దేవజిత్ సైకియా, ప్రభ్తేజ్ సింగ్లకు అభినందనలు తెలిపారు బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా..

జై షా ప్లేస్లో మాజీ మంత్రి అరుణ్ జైట్లీ కొడుకు రోహాన్ జైట్లీ బాధ్యతలు తీసుకుంటాడని ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా రోహాన్ జైట్లీ, బీసీసీఐ సెక్రటరీ రేసు నుంచి తప్పుకున్నాడు.. రోహాన్ జైట్లీతో పోటీ పడతారని అనుకున్న బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ అభిషేక్ దాల్మియా, పంజాబ్ క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్ దిల్షేర్ ఖన్నా కూడా బీసీసీఐ సెక్రటరీ రేసులో నిలవకపోవడం విశేషం..

## 6 మ్యాచుల్లో 5 సెంచరీలు!

### సెలక్టర్ల దృష్టిలో పడిన కరణ్ నాయర్... ఛాంపియన్స్ ట్రోఫీ ఆడతాడా?



వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత టీమిండియా తరుపున టెస్టుల్లో ట్రిబుల్ సెంచరీ చేసిన బ్యాటర్ కరణ్ నాయర్. అయితే ఆ తర్వాతి టెస్టులో కరణ్ నాయర్కి చోటు దక్కలేదు. మిడిల్ ఆర్డర్లో అజింకా రహానే, విరాట్ కోహ్లీ వంటి ప్లేయర్ల కారణంగా కరణ్ నాయర్, ట్రిబుల్ సెంచరీ చేశాక కూడా టీమ్లో ప్లేస్ కోల్పోవాల్సి వచ్చింది... వరుసగా ఫెయిల్ అవుతున్న శుబ్మన్ గిల్, కెఎల్ రాహుల్ వంటి ప్లేయర్లకు మళ్లీ మళ్లీ అవకాశాలు ఇస్తున్న సెలక్టర్లు, కరణ్ నాయర్ని మాత్రం పట్టించుకోవడం మానేశారు. టీమిండియా నుంచి పిలుపు కోసం ఆశగా ఎదురుచూస్తున్న నాయర్, ప్రస్తుతం విజయ్ హాజారే ట్రోఫీలో రికార్డు లెవెల్ పర్ఫామెన్స్తో దుమ్మురేపుతున్నాడు..

రాజస్థాన్తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్లో 82 బంతుల్లో 122 పరుగులు చేశాడు విదర్భ కెప్టెన్ కరణ్ నాయర్. ఇందులో 13 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఈ సీజన్లో కరణ్ నాయర్కి ఇది ఐదో సెంచరీ. 6 మ్యాచుల్లో 5 సెంచరీలతో 664 పరుగులు చేసిన కరణ్ నాయర్, ఒకే ఒక్క మ్యాచ్లో అవుట్ కావడం విశేషం.. కరణ్ నాయర్కి తోడు ధ్రువ్ షోరే 131 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 118 పరుగులు చేసి విదర్భ జట్టుకి విజయాన్ని అందించారు.

2021-2022 విజయ్ హాజారే ట్రోఫీ సీజన్లో నారాయణ్ జగదీశన్ 5 సెంచరీలు సాధించాడు. ఆ రికార్డును కరణ్ నాయర్ సమం చేశాడు. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 292 పరుగులు చేసింది. కార్తీక్ శర్మ 62, శుబ్మన్ గర్వాల్ 59 పరుగులు చేశారు. దీపక్ చాహర్ 31, దీపక్ హుడా 45, మహిపాల్ లోమ్రార్ 32 పరుగులు చేశారు. అయితే విదర్భ బౌలర్ యశ్ ఠాకూర్ 4 వికెట్లు తీసి రాజస్థాన్ని దెబ్బ తీశాడు..

ఈ లక్ష్యాన్ని 43.3 ఓవర్లలో ఛేదించి సెమీస్కి దూసుకెళ్లింది విదర్భ. విజయ్ హాజారే ట్రోఫీలో టాప్ క్లాస్ పర్ఫామెన్స్ చూపిస్తున్న కరణ్ నాయర్కి వన్డే టీమ్లో అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తున్నారట సెలక్టర్లు. అతని నిలకడైన ప్రదర్శన, సెలక్టర్ల దృష్టిలో పడిందని, ఇంగ్లాండ్తో వన్డే సిరీస్కి ఎంపిక చేసే జట్టులో కరణ్ నాయర్ పేరు ఉండే అవకాశం ఉందని టాక్ వినబడుతోంది..

మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్లో హర్యానా జట్టు, గుజరాత్పై గెలిచి సెమీస్ చేరింది. రవి భిష్ణోయ్ 4 వికెట్లు తీసి హర్యానా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటికే కర్ణాటక, మహారాష్ట్ర సెమీస్ చేరాయి. కర్ణాటక, హర్యానా మధ్య మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ జనవరి 15న జరుగుతుంది. అలాగే విదర్భ, మహారాష్ట్ర మధ్య రెండో సెమీ ఫైనల్ జరుగుతుంది. ఈ రెండింట్లో గెలిచిన జట్ల మధ్య జనవరి 18న విజయ్ హాజారే ట్రోఫీ 2025 ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది..

## బావుమా కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో సౌతాఫ్రికా !




బావుమా కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో సౌతాఫ్రికా !

ఫిబ్రవరి 19.. అంటే సరిగ్గా మరో 36 రోజులలో ఛాంపియన్స్ ట్రోఫీ %-% 2025 ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఐదు జట్లు తమ స్క్వాడ్ లను ప్రకటించాయి. ఈ క్రమంలో తాజాగా దక్షిణాఫ్రికా జట్టు కూడా తమ టీమ్ ని ప్రకటించింది. పాకిస్తాన్ లో జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం సౌత్ ఆఫ్రికా 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది.

సౌత్ ఆఫ్రికా జట్టు: తెంబా బావుమా (కెప్టెన్), టోనీ డి జోర్జి, మార్కో జాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, కేశవ్ మహరాజ్, ఐడెన్ మర్క్రామ్, డేవిడ్ మిల్లర్, వియాన్ ముల్డర్, లుంగి ఎంగిడి, అన్రిచ్ నోర్జే, కగిసో రబడ, ర్యాన్ రికెల్టన్, తబ్రైజ్ షమ్సీ, ట్రిస్టన్ స్టబ్స్, ట్రిస్టన్ స్టబ్బెన్. ఇలా 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది సౌత్ ఆఫ్రికా. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ 2015 కి జట్టు కెప్టెన్ గా తెంబా బవుమాని నియమించింది.

ఇతడు దక్షిణాఫ్రికా కెప్టెన్ గా పగ్గాలు చేపట్టినప్పటి నుండి.. ఆ జట్టు మంచి విజయాలు సాధిస్తుంది. 2021 నుండి బవుమా మూడు ఫార్మాట్లలో కలిపి 67 మ్యాచ్ లకు నాయకత్వం వహించాడు. ఇందులో దక్షిణాఫ్రికా 41 మ్యాచ్ లు గెలిచింది. 23 మ్యాచ్ లు ఓడిపోయి.. ఒక మ్యాచ్ డ్రా గా మిగిలింది. కెప్టెన్ గా బవుమా 61.19 విన్నింగ్ పర్సంట్ ని కలిగి ఉన్నాడు. బవుమా 2023లో టెస్ట్ కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించాడు. తన కెప్టెన్సీలో ఇప్పటివరకు 9 టెస్టుల్లో దక్షిణాఫ్రికా ఒక్క మ్యాచ్ లోను ఓడిపోలేదు.

అంతేకాదు అతడు టెస్టుల్లో 57.78 సగటుతో 809 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలు కూడా ఉన్నాయి. ఇతని సారథ్యంలో సౌత్ ఆఫ్రికా వరుసగా ఏడు టెస్ట్ మ్యాచ్ లలో గెలిచింది. 2021లో వన్డే కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టిన బవుమా.. 38 వన్డేలకి కెప్టెన్ గా వ్యవహరించాడు. ఇందులో 21 వన్డేలు గెలుపొందగా.. మరో 16 మ్యాచ్ లని సౌత్ ఆఫ్రికా ఓడిపోయింది. బవుమా వన్డేల్లో 5 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలతో 1631 పరుగులు చేశాడు.

ఈ క్రమంలో అతని సారథ్యంలోనే ఛాంపియన్ ట్రోఫీ 2025 కి వెళ్లాలని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు నిర్ణయించింది. అయితే ఇక్కడ మరో సమస్య ఏంటంటే పాకిస్తాన్ లోని కరాచీ నేషనల్ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 21వ తేదీన ఆఫ్ఘనిస్తాన్ తో గ్రూప్ బి మ్యాచ్ లో సౌత్ ఆఫ్రికా కెప్టెన్ బవుమా నేతృత్వంలోని జట్టు ఆఫ్ఘనిస్తాన్ తో తలపడనుంది. కానీ ఈ మ్యాచ్ ని నిషేధించాలనే డిమాండ్స్ వస్తున్న నేపథ్యంలో ఐసీసీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుంది అనేది వేచి చూడాలి.

అయితే ఇప్పటివరకు పాకిస్తాన్ మరియు భారత జట్లు మాత్రం తమ టీమ్ లని వెల్లడించలేదు. టీమ్ ఇండియా జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ ఫిట్నెస్ వల్లే జట్టును ఆలస్యంగా ప్రకటించనుందని సమాచారం. ఒకసారి జట్టును ప్రకటించిన తర్వాత మార్పులు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో జట్టు కూర్పు పై బీసీసీఐ ఆచితూచి వ్యవహరిస్తోంది.

## ఛాంపియన్స్ ట్రోఫీకి ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్‌గా కమ్మిన్స్



ఈ ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి క్రికెట్ ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు కెప్టెన్గా పాట్ కమ్మిన్స్కు బాధ్యతలు అప్పగించింది. ఇటీవల టెస్టుల్లో గాయపడిన ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్వుడ్కు సైతం జట్టులో చోటు కల్పించింది. ఓపెనర్ జేక్ ఫ్రేజర్, మెక్గర్క్కు సైతం జట్టులో చోటు దక్కింది. పాక్తో జరిగిన వన్డే సిరీస్లో పేలవమైన ఫామ్తో జాతీయ జట్టుకు దూరం కాగా.. మళ్లీ చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించిన జట్టులో ఆల్రౌండర్లు, ఫాస్ట్ బౌలర్లతో పాటు స్టార్ బ్యాటర్స్తో జట్టు పటిష్టంగా కనిపిస్తున్నది. ఈ సందర్భంగా ఆసిస్ చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిల్ మాట్లాడుతూ.. వన్డే ప్రపంచకప్, వెస్టిండ్ సిరీస్, ఇంగ్లాండ్ పర్యటనలో విజయవంతమైన జట్టు ఇదని తెలిపారు. పాకిస్థాన్ సిరీస్లోనూ విజయవంతమైన ఆటగాళ్లతో కూడిన సమతుల్య, అనుభవజ్ఞులైన జట్టని.. పాక్లోని పరిస్థితులకు అనుగుణంగా బెస్ట్ టీమ్ని ఎంపిక చేశామన్నారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి మొదలుకానున్నది. పాకిస్థాన్తో పాటు దుబాయి వేదికగా జరుగనున్నది. టీమిండియా మ్యాచులు దుబాయిలో జరుగుతాయి. ఇక చాంపియన్స్ ట్రోఫీకి ఇటీవల ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్లను ప్రకటించారు. ఈ ఈవెంట్లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటాయి. ఎనిమిది జట్లను రెండేసి గ్రూపులుగా విభజించారు.

**ఆస్ట్రేలియా జట్టు ఇదే..** పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), నాథన్ ఎల్లిస్, ఆరోన్ హార్డీ, జోష్ హేజిల్వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబుషేన్, మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్వెల్, మాట్ షార్ట్, స్టీవ్ స్మిత్, ఆడమ్ జంపా, మార్కస్ స్టొయినిస్, మిచెల్ స్టార్క్.

## ఐసీసీ కొత్త రూల్స్..




క్రికెట్ ని ఎప్పటికప్పుడు ఆకర్షణీయంగా మార్చేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిరంతరం కొత్త రూల్స్ ని ప్రవేశ పెడుతూనే ఉంటుంది. ఈ క్రమంలోనే ఐపీఎల్ పై కన్నేసింది. తాజాగా ఐపీఎల్ లో ఐసీసీ నిబంధనలను అమలులోకి తీసుకురాబోతోంది. త్వరలోనే ఐపిఎల్ 2025 సీజన్ ప్రారంభం కాబోతున్న విషయం తెలిసిందే.

అయితే ఐపీఎల్ లో ఆటగాళ్ల ప్రదర్శనతో పాటు ఆన్ ది ఫీల్డ్, ఆఫ్ ది ఫీల్డ్ లో ప్లేయర్స్ వ్యవహరిస్తున్న తీరుపై ఐసీసీ ప్రత్యేక దృష్టి సాధించింది. ఇప్పటివరకు జరిగిన 17 ఐపీఎల్ సీజన్లను దృష్టిలో పెట్టుకుని.. 2025 ఐపీఎల్ సీజన్ నుండి కొత్త కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు కానుంది. ఇకపై ఐపీఎల్.. ఐసీసీ ప్రవర్తన నియమావళిని అనుసరించనుంది. ఈ విషయాన్ని తాజాగా బీసీసీఐ గవర్నింగ్ కౌన్సిల్ ప్రకటించింది. అంటే మార్చ్ 23 నుండి ప్రారంభం కాబోతున్న ఐపీఎల్ 2025 సీజన్ లో.. నిబంధనలను ఉల్లంఘించిన ఆటగాడిపై అంతర్జాతీయ క్రికెట్ ప్రమాణాల మేరకు చర్యలు తీసుకోనున్నారు.

అంటే ఈ ఐపీఎల్ సీజన్ నుండి ఐసీసీ నియమావళిని అతిక్రమించిన ఆటగాళ్లకు జరిమానాలు విధిస్తారు. లెవెల్ 1, 2 అలాగే 3 ని అతిక్రమించిన ఆటగాళ్లకు పెనాల్టీలు విధిస్తారు. ఇప్పటివరకు ఐపీఎల్ తన సొంత కోడ్ ఆఫ్ కండక్ట్ తో కొనసాగుతోంది. కానీ ఇకనుండి అలా కుదరదు. ఇకనుండి ఐపీఎల్ మ్యాచ్ లు ఐసీసీ, టి-20, ఇంటర్నేషనల్ మ్యాచ్ రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం కొనసాగనున్నాయి.

ఈ విషయాన్ని ఐసీసీ జీసీ మెంటర్ తో ఓ ఐపీఎల్ పాలకవర్గ సభ్యుడు తెలియజేశారు. ఇక ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ మార్చ్ 23 నుండి ప్రారంభం కాబోతుందని తాజాగా బీసీసీఐ అధ్యక్షుడు రాజీవ్ శుక్ల వెల్లడించిన విషయం తెలిసిందే. మే 25వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుందని ఆయన తెలిపారు. బీసీసీఐ ప్రత్యేక సమావేశం ఆదివారం రోజు ముంబైలో జరిగింది.

ఈ సమావేశం అనంతరం రాజీవ్ శుక్ల మీడియాతో మాట్లాడుతూ.. మార్చి 23 తేదీ నుండి ఐపీఎల్ ప్రారంభమవుతుందని తెలిపారు. అయితే ఆదివారం జరిగిన బీసీసీఐ సమావేశంలో.. బీసీసీఐ నూతన సెక్రటరీ, ట్రెజరర్ ఎన్నిక జరిగింది. బీసీసీఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన జై షా.. ఐసీసీ చైర్మన్ గా వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జై షా స్థానంలో కొత్త కార్యదర్శిగా దేవజిత్ సైకియా, ట్రెజరర్ గా ప్రభ్ తేజ్ సింగ్ భాటియా ఎంపికైనట్లు బిసిసిఐ ఎస్జిఎం ఆదివారం సమావేశం అనంతరం తెలిపింది.

## రాయుడుని సాగనంపింది కోహ్లీనే..

### తనకిష్టం లేదని ప్రపంచ కప్ నుంచి ఔట్..

### త్రీడీ ప్లేయర్ వివాదంపై మాజీ క్రికెటర్ సరికొత్త వాదన



భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీపై తన ప్రశ్నల బాణాలను మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప సంధిస్తూనే ఉన్నాడు. యువరాజ్ సింగ్ కెరీర్ అర్థాంతరంగా ముగియడానికి కారణం కోహ్లీనే అని తేల్చిన ఉతప్ప.. తాజాగా తెలుగు మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడి గురించి కూడా చెప్పాడు. 2019 వన్డే ప్రపంచకప్ లో రాయుడు.. టీమిండియాలోకి ఎంపిక కాకపోవడానికి గల కారణం కోహ్లీనే అని కుండబద్దలు కొట్టాడు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కోహ్లీకి నచ్చని వారికి టీమిండియాలో ఎంట్రీ క్లోజ్ అవుతుందని, అతని రాగద్వేషాలపైనే అప్పట్లో జట్టు ఎంపిక నడిచేదని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ లో జరిగిన 2019 వన్డే ప్రపంచకప్ కు రాయుడు కచ్చితంగా ఎంపికవుతాడని అందరూ భావించారు. అయితే సడెన్ గా రాయుడు ప్లేస్ లో తమిళనాడుకు చెందిన ఆల్ రౌండర్ విజయ్ శంకర్ ను ఎంపిక చేయడం వివాదాస్పదమైంది. అప్పట్లో ఈ ఘటన సెన్సేషన్ అయింది. తాజాగా ఈ ఘటన వెనకాల కారణంగా కోహ్లీనే అని ఉతప్ప ఆరోపిస్తున్నాడు.

**త్రీడీ ప్లేయర్ వివాదం..**

నిజానికి 2019 వన్డే ప్రపంచకప్ కు చీఫ్ సెలెక్టర్ గా తెలుగు ప్లేయర్ ఎమ్మెస్కే ప్రసాద్ పని చేశాడు. అతని నాయకత్వంలోనే టీమిండియాను ఎంపిక చేశాడు. రాయుడుని కాకుండా విజయ్ శంకర్ ను ఎంపిక చేయడం, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా మూడు విభాగాల్లో పనికొచ్చే త్రీడి ప్లేయర్ తను అని ఎమ్మెస్కే తన ఎంపికను సమర్థించుకున్నాడు. అప్పటి నుంచి విజయ్ శంకర్ కు త్రీడీ ప్లేయర్ అని పేరు స్థిరపడి పోయింది. ఆ సెలెక్షన్ పై ఫైరయిన రాయుడు.. వన్డే ప్రపంచకప్ చూడటానికి త్రీడి కళ్లద్దాలను ఇప్పుడే ఆర్డర్ చేశానని సోషల్ మీడియాలో వివాదస్పదమైంది. ఎమ్మెస్కేపై కోపంతోనే అతను ఇలా చేశాడని అందరూ భావించారు. దీనిపై అప్పట్లో వాడి వేడి చర్చ జరిగింది. అయితే తాజాగా ఈ ఘటన వెనక ప్రధాన కారకుడు కోహ్లీయే అని ఉతప్ప బాంబ్ పేల్చడం కలకలం రేగింది. కోహ్లీ వ్యవహార శైలి వలనే అప్పటి భారత ప్లేయర్లు ఇబ్బంది పడ్డారని పలు ఉదాహరణలతో వివరిస్తున్నాడు.

**నొత్తి నోరు కొట్టుకున్న ఎమ్మెస్కే.**

మరోవైపు రాయుడుని జట్టులోకి ఎంపిక చేయక పోవడానికి గల కారణం ఎమ్మెస్కే ప్రసాదేనని అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇక అటు రాయుడు, ఇటు ప్రసాద్ ఇద్దరు తెలుగువాళ్లే కావడంతో తెలుగు నాట కులచర్చ కూడా జరిగింది. కాపు కులస్తుడైన రాయుడుని, కమ్మ కులస్తుడైన ప్రసాద్ తొక్కేశాడని పలువురు ఫైరయ్యారు. తను జట్టులోకి ఎంపిక కాలేకపోవడానికి గల కారణం ప్రసాదేనని రాయుడు భావించినట్లు ప్రచారం కూడా జరిగింది. అయితే దీనిపై గతంలో ప్రసాద్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించాడు. రాయుడు%శ్రీతీ% ఎంపిక చేయకపోవడమనేది కెప్టెన్ కోహ్లీతోపాటు టీమ్ మేనేజ్మెంట్ నిర్ణయమని నొత్తి నోరు కొట్టుకుని చెప్పాడు. అయితే అప్పట్లో ఈ వాదనను ఎవరూ అంగీకరించకపోయినా, ఉతప్ప తాజా స్టేట్మెంట్ తో ఈ వార్తల్లో నిజముందని తెలుస్తోంది. ఏదేమైనా తనపై రోజుకో ఆరోపణ చేస్తున్న ఉతప్పకు కోహ్లీ తగిన జవాబివ్వాలని అతని అభిమానులు భావిస్తున్నారు. తను కూడా సోషల్ మీడియాలోకొచ్చి తన వంతు వివరణ ఇవ్వాలని కోరుకుంటున్నారు.

# 'సంక్రాంతికి వస్తున్నాం' ఎక్స్ ట్రార్డినరీ గా వచ్చింది – వెంకటేష్




విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్ లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సెన్సేషనల్ హిట్ గా నిలిచి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి
. ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింతగా పెంచింది. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్ ని గ్రాండ్ గా నిర్వహించారు. ఈ వేడుకలో విక్టరీ వెంకటేష్ లైవ్ లో బ్లాక్ బస్టర్ పొంగల్ సాంగ్ పాడటం అందరినీ ఉర్రూతలూగించింది. వెంకటేష్ మాట్లాడుతూ..నేను హీరోలా కాకుండా ప్రొడ్యూసర్ లా ఆలోచిస్తాను. ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా థాంక్ యూ. ఇది వండర్ ఫుల్ జర్నీ. ఇది నా 76వ సినిమా. 'సంక్రాంతికి వస్తున్నాం' జనవరి 14న వస్తోంది. అనిల్ వండర్ ఫుల్ స్క్రిప్ట్ తో వచ్చారు. తప్పకుండా మీ అందరికీ బాగా నచ్చుతుంది. సినిమా ఎక్స్ ట్రార్డినరీ గా వచ్చింది. నిర్మాతలు చాలా హ్యాపీగా వున్నారు. నా అభిమానులు ఇలాంటి సినిమాలని చాలా ఇష్టపడతారు. వాళ్ళ ప్రేమ ఎప్పుడూ చూపిస్తూనే వున్నారు. మళ్ళీ మేము సంక్రాంతికి మంచి సినిమాతో వస్తున్నాం. మీరంతా ఫ్యామిలీతో రావాలి. మామూలుగా వుండదు చాలా ఎంజాయ్ చేస్తారు. అనిల్ ప్రతి సీన్ అద్భుతంగా తీశాడు. ఈ సినిమా కూడా పెద్ద హిట్ కావాలని కొరుకుంటున్నాను' అన్నారు.



## మొదటి షో నుంచి 'డాకు మహారాజ్' కి బ్రహ్మరథం

అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో బాబీ డియోల్, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలైంది. భారీ అంచనాలతో థియేటర్లలో అడుగుపెట్టిన ఈ చిత్రానికి మొదటి షో నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 'డాకు మహారాజ్' సినిమాకి వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం.. అభిమానులకు, ప్రేక్షకులను కృతజ్ఞతలు తెలిపింది. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "తిరుమల ఘటన నేపథ్యంలో అనంతపురంలో తలపెట్టిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ను రద్దు చేశాము. అందుకే ఈ వారంలో సక్సెస్ మీట్ ను అనంతపురంలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నాం. అన్ని వర్గాల నుంచి, అన్ని ప్రాంతాల నుంచి సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. సినిమా పట్ల బాలకృష్ణ అభిమానులు చాలా సంతోషంగా ఉన్నారు. సాధారణ ప్రేక్షకులు కూడా సినిమాని ఎంజాయ్ చేస్తున్నారు. పండగ సీజన్ కూడా కావడంతో ఈ సినిమా భారీ వసూళ్లు రాబడుతుందనే నమ్మకం ఉంది" అన్నారు.

## 'గేమ్ చేంజర్' విడుదలకు ముందు నుంచి బెదిరింపులు



కోట్లకు కోట్ల రూపాయల ఖర్చుచేసి గ్లోబల్ రేంజ్లో ఇమేజ్ ఉన్న ఒక స్టార్ హీరో మూడేళ్లకు పైగా కష్టపడి చేసిన సినిమా విడుదల రోజు నెట్టింట లీక్ అయితే ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సంక్రాంతికి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన 'గేమ్ చేంజర్ విడుదల రోజే ఆన్లైన్లో పైరసీ ప్రింట్ లీక్ అయ్యింది. దీని వెనుక సుమారు 45 మందితో కూడిన ఒక ముఠా ఉంది. గేమ్ చేంజర్' విడుదల ముందు నిర్మాతలతో పాటు చిత్ర బృందంలోని కీలక వ్యక్తులు కొందరికి సోషల్ మీడియా, అలాగే వాట్సాప్లలో కొంత మంది నుంచి బెదింపులు వచ్చాయి. తాము అడిగిన అమౌంట్ ఇవ్వకపోతే సినిమా పైరసీ ప్రింట్ లీక్ చేస్తామని గొడవకు దిగారు. 'గేమ్ చేంజర్' విడుదలకు రెండు రోజుల ముందు సినిమాలో కీలక ట్విస్టులను సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ చేశారు. ఇక విడుదలైన తర్వాత హెూచ్డి ప్రింట్ లీక్ చేయడమే కాదు... టెలిగ్రామ్, సోషల్ మీడియాలో ఆడియన్స్ అందరికీ షేర్ చేశారు. 'గేమ్ చేంజర్' చిత్ర బృందాన్ని బెదిరించిన, పైరసీ ప్రింట్ లీక్ చేసిన 45 మంది మీద ఆధారాలతో సహా సైబర్ క్రైమ్లో కంప్లైంట్ చేసింది టీం. ఆ 45 మంది కలిసి ఓ ముఠాగా ఏర్పడి 'గేమ్ చేంజర్' మీద నెగెటివిటీ స్ప్రెడ్ చేశారా? పైరసీ ప్రింట్ లీక్ చేశారా? లేదంటే వాళ్ళ వెనుక ఎవరైనా ఉన్నారా? అనేది తెలియాల్సి ఉంది.

## 'నాగబంధం' నుంచి రుద్రగా విరాట్ కర్ణ



హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియా మూవీ 'నాగబంధం' నుంచి రుద్రగా యువ హీరో విరాట్ కర్ణ ప్రీ-లుక్ ఇటీవల విడుదలై మంచి బజ్ క్రియేట్ చేసింది. పాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ గ్రాండ్-స్కేల్ ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ లో విరాట్ కర్ణ ఫెరోషియస్ రగ్గడ్ అవతార్ లో సాలిడ్ ఫిజక్ తో కనిపించారు. యాక్షన్-ప్యాక్డ్ పోస్టర్ లో అతని సిక్స్-ప్యాక్ అబ్స్ ప్రజెంట్ చేస్తోంది. కర్ణను స్టన్నింగ్ అవతార్లో, సముద్రంలో భయంకరమైన మొసలితో పోరాడుతున్నట్లు చూపిస్తున్న ఫస్ట్ లుక్ అదిరిపోయింది. తన ఒట్టి చేతులు, తాడుతో మొసలి నోరు తెరిచి పట్టుకున్న రుద్ర డేరింగ్ నేచర్ ఆకట్టుకుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. 'ది సీక్రెట్ ట్రెజర్' అనే ట్యాగ్లైన్తో 'నాగబంధం' ఒక ఎపిక్ అడ్వెంచర్ గా రూపుదిద్దుకుంటోంది. అభిషేక్ నామా కథ స్క్రీన్ప్లే రెండింటికీ తనదైన విజన్ తీసుకువస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్తో కలిసి నిక్ స్టూడియోస్ ఆధ్వర్యంలో కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా గర్వంగా సమర్పిస్తున్నారు.

## మజాకా అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ - సందీప్ కిషన్




పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ , జీ స్టూడియోస్ బ్యానర్స్ పై రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్టైనర్లో రీతు వర్మ హీరోయిన్ . మజాకా హైలీ ఎంటర్ టైనింగ్ టీజర్ను మేకర్స్ లాంచ్ చేశారు. మాస్ ఎంటర్టైనర్లను రూపొందించడంలో త్రినాధ రావు నక్కిన మరోసారి తన మార్క్ చూపించారు,. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ..అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఇది నా 30వ సినిమా. దీన్ని ఒక భాధ్యతగా భావిస్తున్నాను. నా గత సినిమాలు భైరవకోన, రాయన్ మంచి రిజల్ట్స్ ఇచ్చాయి. ఆడియన్స్ నా నుంచి మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ని కోరుకుంటున్నారని వారితో మాట్లాడినప్పుడు తెలిసింది. ముప్పై సినిమాలు చేయడం అంటే ప్రేక్షకులు ఇచ్చిన వరం. వారు కోరుకున్న సినిమా చేయడం నా బాధ్యత. అలాంటి సమయంలో 'మజాకా' నా దగ్గరకి వచ్చింది. 'మేము వయసుకు వచ్చాం' సినిమా చూసినప్పటినుంచి త్రినాథ్ తో పని చేయాలని వుండేది. ఫైనల్ గా 'మజాకా'తో కుదిరింది. ఖచ్చితంగా పోస్టర్ పై చాలా పెద్ద నెంబర్ కనిపిస్తుంది. అందరికీ థాంక్ యూ' అన్నారు.

## 'ది రైజ్ ఆఫ్ అశోక' ఫస్ట్ లుక్



లఅభినయ చతుర సతీష్ నీనాసం నటించిన 'ది రైజ్ ఆఫ్ అశోక' ప్రాజెక్ట్ మీదున్న అంచనాలు అందరికీ తెలిసిందే. కన్నడ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానున్న ఈ మూవీని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్స్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ నరహరి, జైష్ణవి, సతీష్ నీనాసం నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వినోద్ దొండలే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ 80 శాతం పూర్తయింది. ఈ క్రమంలో సినిమాకు సంబంధించిన మోషన్ పోస్టర్ను రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ను చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే. బ్యాక్ గ్రౌండ్లో వినిపించే ఆ పాట, బీజీఎం, హీరోని చూపించిన విధానం, ఆ రక్తపాతం చూస్తుంటే నెవ్వర్ బిఫోర్ అనే ఎక్స్ పీరియెన్సుని ఇవ్వబోతోన్నట్టుగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. టాకీ సీక్వెన్సు, పాటల్ని త్వరితగతిన షూట్ చేసేందుకు టీం రెడీ అవుతోంది. తాజాగా రిలీజ్ చేసిన ఫస్టుక్, మోషన్ పోస్టర్లో సతీష్ నీనాసం బోల్డ్ అండ్ ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది. కత్తులు పట్టుకుని ఊచకోత కోస్తున్న హీరో లుక్ సినిమా మీద అంచనాలు పెంచేస్తోంది. ఫిబ్రవరి 15న షూటింగ్ని పునఃప్రారంభించడానికి షెడ్యూల్ ఫిక్స్ చేశారు.

## వామికా జాక్ పాట్



2025 ప్రముఖ బాలీవుడ్ కథానాయిక వామిక గబ్బికి ప్రత్యేక సంవత్సరం కానుంది. ఈ ఏడాదిలో రెండు భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది వామిక. వీటిలో ఒకటి అక్షయ్ కుమార్ తో భూత్ బంగ్లా. మరొకటి రణవీర్ సింగ్ సరసన సూపర్ హీరో సినిమాలో నటించే వీలుందని కథనాలొస్తున్నాయి. బాలీవుడ్ లో ఒక్కో సినిమాతో తనదైన ముద్ర వేస్తూ వామిక గబ్బి అగ్ర హీరోయిన్ రేసులోకి చేరుకుంది. ఇటీవల చాలామంది సీనియర్ నటీమణులకు దక్కాల్సిన ఛాన్సుల్ని ఈ కుర్రబ్యూటీ తన ఖాతాలో వేసుకుంటోంది. అక్షయ్ కుమార్ 'భూత్ బంగ్లా' షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం జైపూర్లో భూత్ బంగ్లా షూటింగ్లో ఖిలాడీ అక్షయ్ పాల్గొంటున్నారు. ఇప్పుడు వామికా గబ్బి అతడితో సెట్స్లో చేరింది. తాజాగా వామికా గబ్బి ఇన్స్టాగ్రామ్లో ఒక వీడియోను షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతోంది. 'దిల్ కా దర్వాజా ఖోల్ దో నా డార్లింగ్' చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, జయా బచ్చన్లతో కలిసి వామిక నటిస్తోంది. ఆదిత్య రాయ్ కపూర్ – సమంతా రూత్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రక్త్ బ్రహ్మాండ్' వెబ్ సిరీస్లో కూడా భాగం కానుంది. నాని సరసన ఓ తమిళ చిత్రంలో నటించనుందని టాక్ ఉంది. అయితే వీటన్నిటిలో సూపర్ హీరో మూవీలో ఆఫర్ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు బాసిల్ జోసెఫ్ తెరకెక్కించనున్న సూపర్ హీరో సినిమాలో రణ్వీర్ సింగ్ సరసన కథానాయిక పాత్రకు వామికా పోటీపడుతోందని బలంగా టాక్ వినిపిస్తోంది.

## రాష్ట్రాలు దాటిన 'బేబి' వైష్ణవి చైతన్య క్రేజ్



తెలుగు చిత్ర పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావడమన్నది మిరాకిల్ అన్నట్లుగా పరిస్థితులు తయారయ్యాయి. అందం, అభినయం ఉన్నప్పటికీ తెలుగు భామలను దర్శక నిర్మాతలు ఎందుకో పట్టించుకోవడం లేదు. కానీ కొందరు తెలుగు అమ్మాయిలు మాత్రం ఇలాంటి వాటికి అతీతమని నిరూపిస్తున్నారు. టాలెంట్ ఉంటే ఎప్పటికైనా అవకాశాలు అవే వెతుక్కుంటూ వస్తాయని ప్రూవ్ చేస్తున్నారు. ఇలాంటి వారిలో వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్ ద్వారా కెరీర్ మొదలుపెట్టిన వైష్ణవి చైతన్యకు యూత్లో మంచి ఫాలోయింగ్ ఉంది. లవ్ ఇన్ 143 అవర్స్, ది సాఫ్ట్వేర్ డెవలపర్, అరెరె మానస, మిస్సమ్మ వంటి షార్ట్ ఫిల్మ్ వైష్ణవి చైతన్యకు పాపులారిటీ తెచ్చిపెట్టాయి. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకుని చిన్న పాత్రయినా సరే ఒప్పుకుని తన ముద్ర వేసింది.

## సినిమాలకు రిటైర్మెంట్ ఇవ్వను - విశాల్



నటుడు విశాల్ ఆరోగ్యంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగిన సంగతి తెలిసిందే. మాట్లాడుతున్నప్పుడు ఆయన ముఖం అటు ఇటూ ఉగడం..చేతులు ఒణకడం వంటి సన్నివేశాలతో విశాల్ కి ఏమైందంటూ అభిమా నులంతా ఎంతో ఆందోళన చెందారు. ఇక విశాల్ వ్యతిరేక వర్గమైతే ఆయన పనైపోయిందని...సినిమాలకు ఇక రిటైర్మెంట్ ఇవ్వడమేనంటూ నెగిటివ్ కామెంట్లు కూడా తెరపైకి వచ్చాయి. తీవ్ర జ్వరం కారణంగానే విశాల్ అలా ఉన్నారని డాక్టర్లు హెల్త్ బులిటెన్ రెండుసార్లు రిలీజ్ చేసినా? ఇదంతా అవాస్తవం అంటూ చాలా మంది భావించారు. దీనిపై సోషల్ మీడియాలో చర్చ అంతే ఆసక్తికరంగా సాగింది. దీనికి తోడు విశాల్ కుటుంబ సభ్యులు కూడా ఎవరూ స్పందించలేదు. దీంతో ఇదంతా నిజమేనా? అన్న అభూత కల్పన మరింత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో తాజాగా విశాల్ శనివారం 'మదగజ రాజ' ప్రీమియర్ రి విశాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యంపై తొలిసారి స్పందించారు. 'మా నాన్న అంటే నాకెంతో ఇష్టం. ఆయన వల్లే నేనెంతో ధైర్యంగా ఉన్నాను. జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడతా. ఇదంతా ఎందుకు చెబుతు న్నానంటే? కొంత మంది నేను సినిమాలకు రిటైర్మెంట్ ఇచ్చి వెళ్లిపోతానని అనుకుంటున్నారు. నాకు ఎలాంటి సమస్య లేదు. అంతా బాగానే ఉంది. ఇప్పుడు నా చేతులు వణకడం లేదు. మైక్ కూడా కరెక్ట్ గా పట్టుకోగల్గుతున్నా. నా పై చూపించిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు. నా చివరి శ్వాస వరకూ మీ అభిమానాన్ని మర్చిపోను. నేను కోలుకోవాలని మీరు పెట్టిన ప్రతీ మెసేజ్ కోలుకునేలా చేసాయి' అని తెలిపారు. దీంతో విశాల్ ఆరోగ్యంపై వచ్చిన వదంతులన్నీ తొలగిపోయాయి. కేవలం ఆయనకు తీవ్ర జ్వరం రావడంతోణే క్షీణించ శరీరమంతా అలా ఒణికిందని తెలుస్తోంది.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**.